కష్టమేవ జయతే..!

శ్రమ మనిషికి ఆరోగ్యం. ఆదాయం.. జీవనానికి ఒక మార్గం. కుటుంబానికి ఒక భరోసా. కొందరు శారీరక శ్రమ చేయొచ్చు. మరికొందరు మానసిక శ్రమ చేయొచ్చు. కష్టం చేసినవారు జీవితంలో ఎప్పుడూ విజేతలే. అలా కష్టించే ప్రతి ఒక్కరూ శ్రామికులే. ఆ శ్రామికుల పండుగే మేడే! అది నేడే!!



ఒంగోలులోని నెల్లూరు బస్టాండ్ వద్ద ఇంటి శ్లాబును పగులగొడుతున్న కార్మికులు

నేడు జోనల్ ప్రత్యేక అధికారి కృష్ణబాబు రాక

● మద్దిపాడు మండలంలో పెన్షన్లు పంపిణీకి హాజరు ● అధికారులతో సమీక్ష

ఒంగోలు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రప్రభుత్వం ప్రత్యేకంగా నియమించిన జోనల్ ప్రత్యేక అధికారి, ప్రస్తుత రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరి ఎంటీ కృష్ణబాబు గురువారం జిల్లాకు రానున్నారు. రాష్ట్రంలో ఆయా వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాల పర్యవేక్షణ, అధికారుల మధ్య సమన్వయమే లక్ష్యంగా ప్రభుత్వం రెండు నెలల క్రితం ప్రత్యేక అధికారులను నియమించిన విషయం విదితమే. అందులో స్పెషల్ సీఎస్ స్థాయి అధికారిని నాలుగైదు జిల్లాలకు జోనల్ ప్రత్యేక అధికారిగా, కమిషనర్ స్థాయి ఐఏఎస్ అధికారిని జిల్లాకు ప్రత్యేకాధికారిగా నియమించారు. అలా దక్షిణాదిలోని నాలుగు

మిగతా 6లో...

వేసవి సెలవులను ఉల్లాసంగా గడుపుతున్న విద్యార్థులకు శుభవార్త. 80 నుంచి 90 వరకు ఉండే పాఠ్యపుస్తకాల టైటిల్స్‌ను ప్రభుత్వం 45కి కుదించింది. రానున్న విద్యా సంవత్సరం నుంచి ఇది అమలవుతుంది. దీంతో పుస్తకాల భారం తగ్గిపోతుంది. ప్రాథమిక, ప్రాథమికోన్నత స్థాయిలో భాషల (తెలుగు, ఇంగ్లీషు, హిందీ) సబ్జెక్టులన్నింటినీ ఒకే పుస్తకంగా ఇస్తున్నారు. సెమిస్టర్ విధానంలో అందిస్తుండటంతో విద్యార్థులకు పుస్తకాల బ్యాగ్ తేలిక కానుంది. జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా, మండల పరిషత్, మునిసిపల్, ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేసేందుకు పాఠ్యపుస్తకాలు జిల్లాకు వచ్చేశాయి. మొత్తం ఇండెంట్‌లో ఇప్పటికే 70శాతం చేరాయి. వాటిని ఆర్టీసీ కార్గో ద్వారా మండలాలకు సరఫరా చేస్తున్నారు.



జిల్లాకు చేరిన పాఠ్యపుస్తకాలను సర్దుతున్న సిబ్బంది


బడి పిల్లలకు భలే పండుగ!

పుస్తకాల మోత భారీగా తగ్గింపు

టైటిల్స్ సగానికి కుదింపు

ప్రాథమికోన్నత స్థాయి వరకూ లాంగ్వేజీలన్నీ ఒకే బుక్‌లో..

70శాతం పుస్తకాలు జిల్లాకు చేరిక



2.32 లక్షల పుస్తకాలు పంపిణీ

ఉమ్మడి జిల్లాలోని 14 మండలాలకు ఇప్పటి వరకు 2.32 లక్షల పాఠ్యపుస్తకాలను ఆర్టీసీ కార్గో ద్వారా పంపినట్లు పాఠ్యపుస్తకాల డిపో మేనేజర్ శివాజీ తెలిపారు. ఒంగోలు, టంగుటూరు, కొండపి, దర్శి, కొరిశపాడు, కొత్తపట్నం, పొదిలి, చీమకుర్తి, కందుకూరు, వీవీపాలెం, పొన్నలూరు, జరుగుమల్లి మరో నాలుగు మండలాలకు పుస్తకాలు పంపినట్లు ఆయన తెలిపారు.

ఒంగోలు విద్య, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వచ్చే విద్యా సంవత్సరంలో 1 నుంచి 10 తరగతుల విద్యార్థులకు 12,44,480 పాఠ్యపుస్తకాలు ఉచితంగా పంపిణీ చేయాలని అధికారులు నిర్ణయించారు. మొదటి సెమిస్టర్‌కు ఈ పుస్తకాలను అందిస్తారు. ప్రాథమిక తరగతుల కంటే ప్రాథమికోన్నత తరగతులకు ఎక్కువ పాఠ్యపుస్తకాలు సరఫరా అయ్యాయి. ప్రతిరోజూ ప్రభుత్వం నుంచి జిల్లాకు పాఠ్యపుస్తకాలు సరఫరా అవుతున్నాయి. వాటిని ఆర్టీసీ కార్గో ద్వారా మండల కేంద్రాలకు తరలిస్తున్నారు.

తగ్గిన టైటిల్స్, బ్యాగు బరువు

రానున్న విద్యా సంవత్సరంలో విద్యార్థులకు ఉచితంగా సరఫరా చేసే పాఠ్యపుస్తకాల టైటిల్స్ సంఖ్య తగ్గింది. దీంతో పుస్తకాల మోత తగ్గి విద్యార్థుల స్కూలు బ్యాగు తేలికైంది. మొత్తం 45 టైటిల్స్‌కుగాను ఇప్పటి వరకు 36 టైటిల్స్ సరఫరా కాగా మిగిలిన 9 టైటిల్స్‌లో ఇప్పటివరకు ఒక్క పుస్తకం కూడా సరఫరా కాలేదు.

తరగతి వారీగా పుస్తకాలు వివరాలు..

- 1వ తరగతి విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీషు, గణితం సబ్జెక్టులకు ఒకే పాఠ్యపుస్తకం ఇస్తారు. ఈ మూడు సబ్జెక్టులకు సంబంధించి వర్క్‌బుక్ కూడా ఒకే పుస్తకంలో ఇస్తారు. అంటే 1వ తరగతి విద్యార్థులకు కేవలం రెండు పుస్తకాలు మాత్రమే ఉంటాయి.
- 2వ తరగతి విద్యార్థులకు కూడా తెలుగు, ఇంగ్లీషు, గణితం సబ్జెక్టులు ఒక పుస్తకంలో, ఈ మూడు సబ్జెక్టులకు వర్క్‌బుక్ కలిసి మొత్తం రెండు పుస్తకాలు మాత్రమే

మిగతా 6లో...

అడుగు ముందుకు..

● వీరయ్యచౌదరి హత్యకేసులో పోలీసుల అదుపులో ఇరువురు నిందితులు?

● డీఎస్పీ కార్యాలయంలో ఎస్పీ విచారణ

ఒంగోలు క్రైం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): వీరయ్య చౌదరి హత్య కేసులో చిక్కుముడులు వీడుతున్నాయి. ఎస్పీ ఏఆర్.దామోదర్ బుధవారం ఒంగోలు డీఎస్పీ కార్యాలయంలో మకాం వేసి అనుమానితులను విచారించారని తెలిసింది. వీరిలో వైసీపీకి చెందిన ఓ ఎంపీపీ, ఎంపీపీ భర్తతోపాటు అనుమానితుల బంధువులను విచారణ చేశారు. ముఖ్యంగా నగదు లావాదేవీలపై దృష్టిసారించి దర్యాప్తు చేస్తున్నారు. వీరయ్య చౌదరిని అత్యంత కిరాతకంగా చంపిన ఇరువురు కిరాయి హంతకులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అయితే వారిని గోప్యంగా విచారిస్తున్నట్లు తెలిసింది. తొలుత ఎస్పీ ఒంగోలు డీఎస్పీ కార్యాలయంలో కేసు దర్యాప్తుపై ఏఎస్పీ కే.నాగేశ్వరరావు, ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, తాలూకా సీఐ అజయ్‌కుమార్‌లతో సమీక్ష నిర్వహించారు. అనంతరం అనుమానితులుగా ఉన్న వారిని పిలిచి విచారిస్తున్నారు. అయితే ఎంపీపీ భర్త, మరో ఎంపీపీని రెండో దఫా పిలవడం, నేరుగా ఎస్పీ స్వయంగా విచారణ చేయడం చర్చనీయాంశమైంది. దీంతోపాటు ఈ కేసులో సూత్రధారులుగా అనుమానిస్తున్న వారి బంధువులను విచారిస్తున్నారు.

పోలీసుల అదుపులో ఇరువురు నిందితులు?

వీరయ్య చౌదరి హత్య కేసులో పాల్గొన్న కిరాయి హంతక ముఠాలోని ఇరువురిని పోలీసులు మంగళవారం రాత్రి అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అయితే వీరి వివరాలను పోలీసులు గోప్యంగా ఉంచారు. కేసులో కీలకంగా ఉన్న ఇసుక వ్యాపారికి పొరుగు జిల్లాలో బంధుత్వం ఉంది. దీంతో అక్కడ నుంచే కిరాయి హంతకులను వినియోగించుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ ముఠాలో ఉన్న వారికి పెద్ద నేరచరిత్ర ఉందని కూడా తెలుస్తోంది. ఈ క్రమంలో ఇంకా మిగిలిన నిందితులు కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఇప్పటికీ అనేక బృందాలు ఇతర రాష్ట్రాలతో పాటుగా, ఇతర జిల్లాలో వేట కొనసాగిస్తున్నారు. ఈ కేసులో ప్రధానంగా వినియోగించిన రెండు బైకులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీంతో ప్రారంభమైన దర్యాప్తు అత్యంత వేగంగా ముందుకు సాగుతోంది. అదే క్రమంలో ప్రధానంగా నగదు లావాదేవీలు చేసిన వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. కీలకమైన వ్యక్తి కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. ఏది ఏమైనా కేసు దర్యాప్తు కొలిక్కి వచ్చినట్లే కనబడుతోంది. అయితే పరోక్షంగా కేసుతో ఎవరికి సంబంధాలు ఉన్నాయి అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.



వీరయ్య చౌదరి హత్య ప్రదేశంలో పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్ (ఫైల్)

ప్రధాని సభకు సమాయత్తం

- తరలుతున్న టీడీపీ శ్రేణులు
- రేపు అమరావతిలో రాజధాని పనుల పునఃప్రారంభ సభకు హాజరవుతున్న మోదీ
- ప్రతిష్టాత్మకంగా తీసుకున్న టీడీపీ
- ఎండల నేపథ్యంలో జిల్లా నుంచి పరిమితంగానే జన సమీకరణ
- 200 బస్సులు ఇతర జిల్లాలకు కేటాయింపు
- ఉత్తర నియోజకవర్గాల నుంచి దృష్టి

ఒంగోలు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో శుక్రవారం జరగనున్న ప్రధానమంత్రి మోదీ సభకు జిల్లా నుంచి టీడీపీ శ్రేణులు తరలనున్నాయి. రాజధాని అమరావతిని గత వైసీపీ ప్రభుత్వం విధ్వంసం చేయగా తిరిగి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆ పనులపై ప్రత్యేక దృష్టిసారించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం తాత్కాలికంగా అసెంబ్లీ, సెక్రటేరియట్, హైకోర్టు వంటివి నడుస్తుండగా వాటికి శాశ్వత భవనాల నిర్మాణంతోపాటు ప్రజాప్రతినిధులు, అధికారుల క్వార్టర్లు, ఇతర పలు నిర్మాణాలను తిరిగి చేపడుతున్నారు. వేలాది కోట్లతో ఈ పనులను చేపడుతుండగా అమరావతి రాజధాని పనులు పునఃప్రారంభం పేరుతో ప్రభుత్వం భారీ సభను శుక్రవారం రాజధాని ప్రాంతంలో ఏర్పాటు చేసింది. ప్రధాని నరేంద్రమోదీ ఆ సభలో పాల్గొనుండగా ప్రతిష్టాత్మకంగా సభను ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఈ సభకు లక్షలాదిగా ప్రజలను రాజధాని ప్రాంత జిల్లా నుంచి సమీకరిస్తున్నారు. అలా మన జిల్లా నుంచి కూడా ప్రభుత్వపరంగా 30వేల మందిని సమీకరించాలని నిర్ణయించినా తీవ్ర ఎండల నేపథ్యంలో ఆ ఆలోచనను విరమించినట్లు సమాచారం.

వాహనాల దారిమళ్లింపు

అన్ని నియోజకవర్గాల నుంచి పార్టీశ్రేణులను కదిలించాలని, అందులో రాజధాని దగ్గరగా ఉండే జిల్లా ఉత్తర భాగం నుంచి అధికంగా హాజరయ్యేలా చూడాలని ఇక్కడి నేతలకు సంకేతాలు వచ్చాయి. దీంతో రెండు, మూడు రోజులుగా ఒంగోలు, సంతనూతలపాడు ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎన్ విజయకుమార్, దర్శి, వైపాలెం ఇన్‌చార్జ్‌లు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, ఎరిక్షన్‌బాబులు జనసమీకరణపై దృష్టిసారించారు. ఈ నాలుగు నియోజకవర్గాల

మిగతా 6లో...

అమ్మా.. నిద్రలేమ్మా..!

● తల్లి మృతదేహం వద్ద చిన్నారుల ఆర్తతతో పిలుపు


● రెండేళ్ల క్రితం తండ్రి కన్నుమూత

● అనాథలైన పిల్లలు

6



ఈసారీ కందిపప్పు లేవు



● ఐదు నెలల నుంచి నిలిచిన సరఫరా

● నేటి నుంచి రేషన్ సరుకుల పంపిణీ

6

చివర్లో చేతివాటం!

భారీగా భూముల పందేరం

● తారుమారు చేసిన రికార్డులకు ఆమోదముద్ర

● తహసీల్దార్ కార్యాలయంలో అడ్డగోలుగా భూముల చేర్పులు మార్పులు, ఆన్‌లైన్‌లు..

● రిటైర్మెంట్ ఆఖర్లో అకమాలకు తెరలేపిన అధికారి

తహసీల్దార్ కార్యాలయాలు అవినీతికి అడ్డాగా మారాయి. ప్రభుత్వం మారినా వైసీపీ నేతల అడ్డగోలు అక్రమాలకు మాత్రం బ్రేక్ పడలేదు. గత వైసీపీ పాలనలో ప్రభుత్వ, అనాథీనం భూములను రెవెన్యూ అధికారులు వైసీపీ నేతలకు కైంకర్యం చేశారు. వాటికి అధికారిక ముద్రపడే సమయంలో ఎన్నికలు రావడంతో బ్రేక్ పడింది. ఈక్రమంలో వైసీపీ నేతలు, పలుకుబడి వ్యక్తులు అవకాశం కోసం వేచిచూస్తున్నారు. ఇంతలో ఓ అధికారి ఉద్యోగ విరమణ కలిసొచ్చింది. అవకాశం కోసం వేచి ఉన్న అక్రమార్కులకు అడ్డగోలుగా భూముల ఆన్‌లైన్ మార్పులు జరిగాయని సమాచారం. కనిగిరి నియోజకవర్గంలోని వెలిగండ్ల మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో పరిస్థితి ఇదీ..



వెలిగండ్ల తహసీల్దార్ కార్యాలయం

కనిగిరి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): వెలిగండ్ల తహసీల్దార్ కార్యాలయంలో కీలక అధికారి బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సమయంలో ఆ అధికారిపై అవినీతి ఆరోపణలు పెద్దఎత్తున వ్యాపించాయి. వెలిగొండ ప్రాజెక్టు పూర్తయితే వెలిగండ్ల మండలంలో 17వేల ఎకరాలకుపైగా ప్రత్యక్షంగా నీరు అందనుంది. పరోక్షంగా రెండింతలు ఎకరాల రైతులకు మేలు కలిగేందుకు అవకాశం ఉంది. దీంతో వెలిగండ్ల మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ, అనాదీనం, పోడు, బీడు భూములను గత ప్రభుత్వంలో వైసీపీ నేతలు రెవెన్యూ రికార్డులు తారుమారు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం ఆ రికార్డులకు ఆమోద ముద్ర వేసేందుకు రంగం సిద్ధం చేశారు. వారి అక్రమాలకు సదరు అధికారి రిటైర్మెంట్ కలిసొచ్చింది. దీంతో

మిగతా 6లో...

కొలిక్కిరాని కసరత్తు

● టీచర్ల పునర్విభజనపై కుస్తీ.. రకరకాల సవరణలతో తలనొప్పి

6

ఈకేవైసీకి మరో 2 నెలలు గడువు

6



బంగారం షాపులు వెలవెల

7

● అక్షయతృతీయ రోజున కొనుగోళ్లు డీలా..

● ధరలు పెరుగుదలే ప్రధాన కారణం

ప్రధానమంత్రి పర్యటనతో ట్రాఫిక్ మళ్లింపు

● రేపు ఉదయం 5 నుంచి రాత్రి 10 వరకు ఆంక్షలు

ఒంగోలు క్రైం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ అమరావతిలో పర్యటన కారణంగా శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు ట్రాఫిక్ మళ్ళించాలని రాష్ట్ర డీజీపీ కార్యాలయం నుంచి ఆదేశాలు ఇచ్చారు. ఈ మేరకు చెన్నయ్ నుంచి విజయవాడ మీదగా విశాఖపట్నం వెళ్లే వాహనాలను ఒంగోలులోని త్రోవగుంట వద్ద నుంచి చీరాల వైపు మళ్ళిస్తారు. అదేవిధంగా విశాఖపట్నం నుంచి చెన్నయ్ వైపు వెళ్లే వాహనాలు కూడా అదే మార్గంగా తరలిచాలని ఆదేశాలు అందాయి. మల్టీ-యాక్సిల్ గూడ్స్ వాహనాలు చెన్నయ్ నుంచి విశాఖపట్నం వెళ్లే వాహనాలు ఒంగోలు, చిలకలూరిపేట వద్ద నిలిపివేస్తారు. ఆయా వాహనాలు శుక్రవారం రాత్రి 9 గంటల తరువాత ముందుకు వెళ్లేందుకు అనుమతి ఇస్తారు. ట్రాఫిక్ మళ్ళింపు ఈనెల 2న ఉదయం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు అమలు చేస్తారని డీజీపీ కార్యాలయం నుంచి ఓ ప్రకటన బుధవారం విడుదల చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ప్రయాణికులు, వాహన డ్రైవర్లు సహకరించాలని కోరారు.

లారీని ఢీకొట్టిన మినీ ట్రావెల్స్ వాహనం

● ఇరువురికి తీవ్రగాయాలు
● మరో తొమ్మిదిమందికి స్వల్పంగా
● బాధితులు తెలంగాణ వాసులు

ఒంగోలు క్రైం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ముందు వెళుతున్న లారీని వెనుక నుంచి మినీ ట్రావెల్స్ వాహనం ఢీకొనడంతో ఇరువురికి తీవ్ర గాయాలు అయ్యాయి. మరో తొమ్మిది మంది స్వల్పంగా గాయపడ్డారు. ఈ సంఘటన ఒంగోలు నగరం కొప్పోలు ఫ్లైఓవర్ బ్రిడ్జిపై మంగళవారం అర్ధరాత్రి 12.30 గంటలకు జరిగింది. వివరాలలోకి వెళితే.. తెలంగాణ రాష్ట్రం సూర్యపేట జిల్లా ఖమ్మంరోడ్డులోని జకీర్‌హుసేన్ నగర్‌కు చెందిన గజ్జల రవీంద్ర కుటుసభ్యులు 11 మంది మినీ ట్రావెల్స్ వాహనంలో మంగళవారం రాత్రి 7 గంటలకు తిరుపతికి బయలుదేరారు. ఆయన మనమడు పుట్టెంట్రుకలు తీసేందుకు కుటుంబ సభ్యులుతో కలిసి వెళుతున్నారు. అయితే అర్ధరాత్రి సమయంలో అందరూ నిద్రపోతుండగా డ్రైవర్ పీటాల సూర్యం వాహనం నడుపుతున్నాడు. ముందుగా వెళుతున్న గుర్తు తెలియని లారీ సడన్ బ్రేక్ వేయడంతో ప్రమాదం జరిగిందని డ్రైవర్ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో మినీ ట్రావెల్స్ వాహనంలో గెల్లి చంద్రకళకు తల మీద తీవ్రగాయమై అపస్మారక స్థితిలోకి వెళ్లారు. డ్రైవర్ సూర్యంనకు ముక్కులో నుంచి రక్తస్రావమైంది. మిగిలిన తొమ్మది మందికి స్వల్పంగా గాయలు అయ్యాయి. వీరిలో ఇద్దరు చిన్నపిల్లలు ఉన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే 108 వాహనం ద్వారా క్షతగాత్రులను ఒంగోలులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు తాలుకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారుప్రమాదంలో ఒంగోలు వైద్య విద్యార్థి మృతి

● శోకసంద్రంలో యగ్నేష్ కుటుంబం

ఒంగోలు కార్పొరేషన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా కోవూరు మండలం పోతిరెడ్డిపాలెంలో జరిగిన కారు ప్రమాదంలో ఒంగోలుకు చెందిన గుర్రం యగ్నేష్(20) మృతిచెందడంతో వారి కుటుంబం శోకసముద్రంలో మునిగిపోయింది. స్థానిక రామనగర్ 3వ లైను 6వ క్రాస్ రోడ్‌లో నివాసం ఉండే గుర్రం గురువీర్ జిల్లాలోని తూర్పుగంగవరం, అనంతపురంలో పాల వ్యాపారం చేస్తుండగా, తల్లి గృహిణిగా ఉన్నారు. యగ్నేష్ నెల్లూరులోని నారాయణ కాలేజీలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కాగా తనతోపాటు చదువుకునే స్నేహితుడు చక్రధర్ సోదరి నిశ్చయ కార్యక్రమానికి హాజరై వస్తూ ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదానికి గురికావడంతో యగ్నేష్ మృతిచెందాడు. దీంతో వారి కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరు అయ్యారు. కాగా పోస్టుమార్టం అనంతరం గురువారం మధ్యాహ్నం తర్వాత యగ్నేష్ మృతదేహాన్ని ఒంగోలు తీసుకురానున్నారు.

అమ్మా.. నిద్రలేమ్మా..!

● తల్లి మృతదేహం వద్ద చిన్నారుల ఆర్తతతో పిలుపు
● రెండేళ్ల క్రితం తండ్రి మృతి

మర్రిపూడి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : వారు ముగ్గురూ చిన్నారులు. ఒక తల్లి బిడ్డలు. మంచంపై విగతజీవిగా ఉన్న తల్లి చనిపోయిందని కూడా ఆ పసి మనసులకు తెలీదు. తల్లి భుజాన్ని తడుతూ 'అమ్మా.. నిద్రలేమ్మా.. ఆకలవుతోంది' అని పదేపదే పిలుస్తూ ఉన్న ఆ చిన్నారులను చూసి అక్కడున్నవారంతా చలించిపోయారు. కన్నీటి చుక్కను చిందించారు. మండల కేంద్రమైన మర్రిపూడిలో బుధవారం హృదయవిదారక ఘటన చోటుచేసుకుంది. కాలనీకి చెందిన కొండ్రు షడ్రక్, మౌనిక(29)లకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. అరవింద్, మేషక్, రూపిక.. ముగ్గురూ చిన్నారులే. వీరిది నిరుపేద కుటుంబం. ఏజుకారోజు కూలి చేసుకుని జీవనం గడపాలి. 2023 ఏప్రిల్‌లో కొండ్రు షడ్రక్ తీవ్ర అనారోగ్యంతో కన్నుమూశారు. కూలి చేసుకుంటూ మౌనిక తన పిల్లలను పోషించుకుంటోంది. ఆమె కూడా అనారోగ్యంతో బుధవారం కన్నుమూశారు. ఆమె శాశ్వతనిద్రలోకి వెళ్లినట్లు తెలీని ఆ పసిబిడ్డలు తల్లి దగ్గరకెళ్లి లేపే ప్రయత్నం చేయడం చూపరులకు కంటతడి పెట్టించింది. అనాథలైన ఆ అమాయకపు పిల్లలు ఎలా బతకాలో అని సమీప బంధువు గజ్జా దానమ్మ రోదించింది. టీడీపీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు గురజాల పోలయ్య, తెలుగు యువత నాయకులు రాజు, సురేష్, ప్రసాదు మాదిగ, జర్నలిస్ట్ ఫోరమ్ అధ్యక్షుడు బాబు రావు.... మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. మౌనిక కుటుంబాన్ని ఆదుకునేందకు మంత్రి స్వామి, మారిటైం బోర్డ్ ఛైర్మన్ సత్యల కలిసి ప్రభుత్వం, పార్టీ పరంగా సహాయం అందించేందుకు కృషి చేస్తామన్నారు.



తల్లిమృతదేహం ముందు విషన్నవదనంతో నిలుచున్న చిన్నారులు

సమ్మె బాట పట్టిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు

సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ వద్ద సమ్మె

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం కలెక్టరేట్ ఎదుట నిరవధిక సమ్మెను ప్రారంభించారు. జిల్లాలోని 538 కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు ఈ సమ్మెలో పాల్గొన్నారు. కలెక్టరేట్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్లు మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు మాట్లాడుతూ బీఎస్సీ నర్సింగ్ నుంచి పీహెచ్‌డీ వరకు ఉన్నత విద్య చదివినప్పటికీ వారు చేస్తున్న ఉద్యోగానికి భద్రత లేదన్నారు. ఒక నిర్దిష్టమైన పనిలేకుండా రకరకాలుగా పనులు చేయిస్తూ పనిభారం పెంచడం సిగ్గుచేటన్నారు. ఉద్యోగులకు వెంటనే పని భారం తగ్గించాలని డిమాండ్‌చేశారు. కేంద్రం ఇచ్చిన ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఆరేళ్ల పనిచేసిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లను రెగ్యూలర్ చేయాలని డిమాండ్‌చేశారు. ఎన్‌ఎంహెచ్ ఉద్యోగులతో సమానంగా 23శాతం ఇంక్రిమెంట్ ఇచ్చివేతనాలు చెల్లించాలన్నారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో ఓపీ దగ్గర నుంచి రోగులకు బీపీ, షుగర్, చిన్న పిలలలకు క్యాన్సర్ పరీక్షలతో పాటు అనేక రకాల వైద్యుల సలహాలు, సౌకర్యాలు అందించడంలో కీలకపాత్ర పోషిస్తున్నారనితెలిపారు. యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కోశాధికారి జి.నాగేశ్వరరావు మాట్లాడుతూ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్‌చేశారు. ఈకార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎం రాజేష్, ఎ. నిర్మల, జీవన జ్యోతి, ప్రసన్న, సయ్యద్ గౌస్ తదితరులు ఉన్నారు.



మోకాళ్లపై నిల్చుని నిరసన తెలుపుతున్నఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఉద్యోగులు

బతిమలాడి..అజెండాకు ఆమోదం

సాధాసీదాగా ముగిసిన కౌన్సిల్ సమావేశం

మార్కాపురం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రతి నెలాఖరులో మున్సిపాలిటీలో అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణ, సమస్యలను తెలియజేసేందుకు సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించడం పరిపాటి. అక్కడ ముందుగా అభివృద్ధి కార్యక్రమాలతో రూపొందించిన అజెండాపై, ప్రజల సమస్యలపై చర్చించి కౌన్సిల్‌లో ఆమోదంతో పనులు చేపడతారు. కానీ బుధవారం మున్సిపాలిటీలో జరిగిన సాధారణ సమావేశానికి కౌన్సిలర్లు ముఖం చాటేశారు. సాయంత్రం 4.00 గంటలకు సమావేశం ప్రారంభంకావాల్సివున్నా పట్టుమని పది మంది కూడా హాజరు కాలేదు. దీంతో ఛైర్మన్ చిర్లంచర్ల కృష్ణ పలువురు కౌన్సిలర్లకు ఫోన్ చేసి బతిమలాడి సమావేశానికి పిలిచించుకున్నారు. కోరం సరిపోయేంతమంది కౌన్సిలర్లు 14 మంది 5.00 గంటలకు చేరుకున్నాక 23 అభివృద్ధి అంశాలతో కూడిన అజెండాను ఆమోదింపజేసుకుని మమ అనిపించారు.



మాట్లాడుతున్న ఛైర్మన్ బాలమురళీకృష్ణ

ముఖం చాటేసిన కౌన్సిలర్లు

మార్కాపురం మున్సిపాలిటీలో మొత్తం 35 మంది కౌన్సిలర్లకుగాను ఒక రు చనిపోగా, 34 మంది ఉన్నారు. అధికార, ప్రతిపక్షానికి ప్రస్తుతం సమానంగా కౌన్సిలర్లు ఉన్నారు. ప్రతిపక్షానికి చెందిన వాళ్ల సమావేశానికి గైర్హాజరైనా అధికార పక్షానికి చెందిన 17 మంది హాజరైనా కోరం సరిపోతుంది. కానీ ఛైర్మన్ కృష్ణ పట్ల అధికార పక్షాని కి చెందిన కౌన్సిలర్లు అసంతృప్తితో ఉన్నారు. తమకు సరైన ప్రాధాన్యత ఇవ్వడంలేదనేది వారి వాదన. అంతేకాక వైసీపీ తరపున గెలిచి టీడీపీలో చేరి న కౌన్సిలర్లు కూడా బుధవారం సమావేశానికి హాజరుకాలేదు. కొందరు కౌన్సిలర్లు వారి సమస్యలను తెలియజేసేందుకు మాత్రమే వచ్చారు. చివరికి గత్యంతరం లేని పరిస్థితుల్లో ఛైర్మన్ పలువురు కౌన్సిలర్లకు ఫోన్ చేసి రావాలని కోరారు. గంట ఆలస్యం తర్వాత కోరంకు సరిపోయేంత మంది హాజరరుకావడంతో అజెండాను ఆమోదించుకున్నారు.

అక్రమ లే-అవుట్లపై ఎందుకు చర్యలు తీసుకోవడంలేదు

పట్టణంలో మున్సిపాలిటీ అనుమతులు లేకుండా వేసిన అక్రమ లేఅవుట్లపై ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని ఛైర్మన్ చిర్లంచర్ల కృష్ణ అధికారులను ప్రశ్నించారు. ఇప్పటికే అక్రమ లేఅవుట్లను గుర్తించి ఓ పత్రికలో వాటి వివరాలను ప్రచురించినా వాటికి సంబంధించి క్రయవిక్రయాలు యథేచ్ఛగా జరుగుతూనే ఉన్నాయన్నారు. ఎలాంటి చర్యలు తీసుకోనప్పుడు పత్రికల్లో ప్రచురించడం ఎందుకని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణానికి సాగర్ నీటిని అందించే పైపులైన్ పనులు దూపాడు సమీపంలో సంవత్సర కాలంగా నిలిచిపోయాయని వాటిని వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కాంట్రాక్ట్ సంస్థ పట్టించుకోకుంటే పనులు క్యాన్సిల్ చేయడమో, వారికి నోటీసులు ఇవ్వడమో త్వరగా చేయాలన్నారు. గత సంవత్సరం పట్టణంలో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు ప్రభుత్వం నుంచి రాకపోవడంతోనే ఈ సంవత్సరం రవాణా చేసేందుకు ఎవరూ ముందుకు రావడంలేదన్నారు. 22, 29వ వార్డుల కౌన్సిలర్లు పలు సమస్యలపై వినతిపత్రం అందజేయడంతో వాటిని టేబుల్ అజెండాలో చేర్చారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణరావు, డీఈ లక్ష్మీనారాయణ, మేనేజర్ శ్రీనివాసన్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు జోనల్ ప్రత్యేక అధికారి కృష్ణబాబు రాక

(5వ పేజీ తరువాయి)

జిల్లాలకు జోన్-4 స్పెషల్ ఆఫీసర్‌గా నియమితులైన కృష్ణబాబు తొలి పర్యటన కోసం గురువారం వస్తున్నారు. 20 ఏళ్ల క్రితం ఆయన జిల్లా కలెక్టర్‌గా కూడా పనిచేశారు. అందిన సమాచారం మేరకు గురువారం ఉదయం ఆయన జిల్లాకు వస్తారు. తొలుత మద్దిపాడు మండలంలోని ఒక గ్రామంలో ప్రభుత్వ పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. గ్రోత్ సెంటర్‌లో గ్రానైట్ ఫ్యాక్టరీలను పరిశీలిస్తారు. మధ్యాహ్నానికి ఒంగోలు చేరుకునే కృష్ణబాబు ప్రకాశం భవన్‌లో జిల్లా అధికారులతో సమీక్ష చేయనున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరు, వేసవిలో తాగునీటి పరిస్థితి, ఉపాధి పనుల తీరు, పీఎం సూర్యఘర్, ప్రజా వినతుల పరిష్కారం, వివిధ అంశాలకు సంబంధించి జరుగుతున్న సర్వేలు తదితర అంశాలను ఆయన ప్రధానంగా సమీక్షిస్తారని సమాచారం.

ఆవిరైన ఆనందం!

● అదుపుతప్పి పూరింట్లోకి దూసుకెళ్లినకారు
● బెల్లూను తెరుచుకున్నా తప్పని ఘోరం
● ఆరుగురు మృత్యువాత.. మృతుల్లో ఐదుగురు వైద్య విద్యార్థులు
● పోతిరెడ్డిపాళెం సమీపంలో ఘటన

కోవూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): స్నేహితుడి అక్క నిశ్చితార్థంలో వారంతా సరదాగా గడిపారు. ఆడుతూపాడుతూ హుషారెత్తించారు కలిసి కబుర్లాడుతూ భోజనం చేశారు. వచ్చిన కార్లలోనే అంతా తిరుగు ప్రయాణమయ్యారు. వీరి సంతోషాన్ని చూసి మృత్యువుకు కన్నుకుట్టినట్టుంది. బయలుదేరిన కాసేపటికే వేగంతో వెళుతున్న కారు అదుపుతప్పి పురింటిలోకి దూసుకెళ్లింది. అంతే, కళ్లుమూసి తెరిచేలోగా నుజునుజ్జయిన కారులో దుమ్ము ధూళి. రక్తపు మడుగులో ఎవరికి ఏం జరిగిందో తెలియలేదు. ఆ వెనుకే వచ్చిన స్నేహితులు గాయపడ్డ వారిని ఆసుపత్రులకు తరలించారు. చికిత్సపొందుతూ ఐదుగురు మృత్యువాత పడ్డారు. పూరింటిలో నిద్రపోతున్న వృద్ధుడి ప్రాణాన్నీ మృత్యువు కాటేసింది. కోవూరు మండలం పోతిరెడ్డిపాళెం సమీపంలో ముంబయి జాతీయరహదారిపై బుధవారం జరిగిన ఈ ఘటన వైద్యవిద్యార్థుల్లో తీవ్ర విషాదాన్ని నింపింది.

నెల్లూరు శివార్లలోని చింతారెడ్డిపాళెంలో ఉన్న నారాయణ మెడికల్ కళాశాలలో రెండవ సంవత్సరం (2023వ బ్యాచ్) చదువుతున్న బుచ్చిరెడ్డిపాళెంకు చెందిన చక్రధర్ అక్క నిశ్చితార్థం బుచ్చిలో బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు చక్రధర్ స్నేహితులు 12 మంది ఉదయం రెండు కార్లలో బుచ్చిరెడ్డిపాళెంకు వెళ్లారు. మధ్యాహ్నం భోజనాలు పూర్తయ్యాక అందరూ కలిసి అవే కార్లలో తిరుగు ప్రయాణమయ్యారు. పోతిరెడ్డిపాళెం సమీపంలో కారు అతి వేగంతో అదుపుతప్పింది. కారు నడుపుతున్న జీవన్‌చంద్రారెడ్డి బ్రేక్ వేసినా కుదరలేదు. హైవే పక్కనే ఓ పూరింటిలోకి దూసుకెళ్లింది. ఇంట్లో సేద తీరుతున్న నిడిగుంట రమణయ్య (65)ను ఢీకొనడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. కారు పూర్తిగా నుజ్జునుజ్జవగా, గుడిసె ధ్వంసమైంది. ఇక కారులో ఉన్న ఖామవత్ అభిషేక్ రాజ్ (అనంతపురం) గుండాల జీవన్‌చంద్రారెడ్డి (సిద్దీపురం, నెల్లూరు జిల్లా) గుర్రం యజ్ఞేష(ఒంగోలు), లవదియా నరేష్‌నాయక్ (ధర్మవరం-అనంతపురం జిల్లా) గోను అభిసాయి పురుషోత్తం(తిరుపతి), వీరమల్లు నవనీత్‌రెడ్డి (మైదుకూరు, కడప జిల్లా) తీవ్రంగా గాయపడ్డారు. వెనుకనే కారులో వెళ్తున్న స్నేహితులు వీరిని గుర్తించి తమ కారులో ప్రభుత్వ వైద్యశాల, నారాయణ వైద్యశాల, పుచ్చలపల్లి రామచంద్రారెడ్డి పీపుల్స్ పాలీ క్లినిక్‌లకు తరలించారు. వైద్య విద్యార్థులు ఖామవత్ అభిషేక్ రాజ్, గుండాల జీవన్‌చంద్రారెడ్డి, గుర్రం యజ్ఞేష్, లవదియా నరేష్‌నాయక్, గోను అభిసాయి పురుషోత్తం మృతిచెందారు. మృతుల వయసు 19నుంచి 20ఏళ్లలోపు ఉంటుందని పోలీసులు నిర్ధారించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. తీవ్రంగా గాయపడిన కడప జిల్లా మైదుకూరుకు చెందిన వీరమల్లు నవనీత్ నారాయణ వైద్య కళాశాల వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ఘటనా స్థలిని అదనపు ఎస్పీ సౌజన్య, డీఎస్పీ జీ శ్రీనివాసరావు, సీఐ సుధాకరరెడ్డి పరిశీలించి కేసు నమోదు చేశారు.



నెల్లూరు ప్రభుత్వాసుపత్రిలో మృతదేహాలు

● ఒక్కక్షణంలో ప్రమాదం

అతివేగంగా నెల్లూరు వైపు వెళ్తున్న కారు ఒక్కక్షణంలో పూరింట్లోకి చొచ్చుకుని వెళ్లినట్లు స్థానికులు చెబుతున్నారు. పోతిరెడ్డిపాళెం సమీపంలో ముంబయి హైవే వంకరగా ఉంటుంది. ఈ ప్రాంతాల్లో వాహనాలను వేగంగా నడపకూడదు. వాహనాల రద్దీ కూడా ఎక్కువగా ఉంటుంది. ఈక్రమంలో అతివేగం వల్ల అదుపుతప్పిన కారులో బెలూన్లు తెరుచుకున్నా ప్రాణాపాయం మాత్రం తప్పలేదు.

● ఆగిన సమయం

ప్రమాద సమయాన్ని సూచిస్తూ మృతుల్లో ఒకరి చేతి గడియారం 1.55గంటలకు ఆగిపోయింది. ఘటన కూడా అదే సమయంలో వాటిల్లినట్లుగా భావిస్తున్నారు. సమయాన్ని చేదిస్తూ వేగంగా వెళ్తున్న కారు ప్రమాదాన్ని సూచిస్తూ రిస్ట్‌వాచీ ఆగిపోవడం గమనార్హం.

● ఆమె అదృష్టవంతురాలు

పూరింటిలో నిద్రపోతూ మృతిచెందిన నిడిగుంట రమణయ్య భార్య రమణమ్మ క్షణంలో ప్రమాదం నుంచి తప్పించుకున్నట్లు స్థానికులు తెలిపారు. మంచంపై ఉన్న రమణయ్యను పలకరించి తలుపు వేస్తుండగా పెద్ద శబ్దం రమణమ్మకు వినిపించింది. దీంతో భయకంపితురాలై ఆమె పరుగులు తీసింది.

అవీఇవీ

ఈసారీ కందిపప్పు లేవు

ఐదు నెలల నుంచి నిలిచిన సరఫరా
నేటి నుంచి రేషన్ సరుకుల పంపిణీ

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకుల్లో ఈసారి కందిపప్పు పంపిణీ లేనట్లే. ప్రభుత్వం సరఫరా చేయకపోవడమే ఇందుకు కారణం. జిల్లాలో గురువారం నుంచి రేషన్ పంపిణీ జరగనుంది. ఈ రేషన్ బియ్యం పంపిణీ చేసేందుకు ఆ శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. జిల్లాలో 1,392 రేషన్ దుకాణాలు ఉండగా మొబైల్ వాహనాల ద్వారా సరుకులు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకున్నారు. 6.61 లక్షల రేషన్ కార్డులు ఉండగా అవసరమైన మేరకు బియ్యం, చక్కెరను దుకాణాలకు సరఫరా చేశారు. గత ఐదు నెలల నుంచి జిల్లాకు కందిపప్పు సరఫరా కావడం లేదు. దీంతో రేషన్ షాపుల ద్వారా కేవలం బియ్యం, చక్కెరకే పరిమితమయ్యారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కార్డుదారులకు కందిపప్పు ఇవ్వని పరిస్థితి ఏర్పడింది. అయితే రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చాక బియ్యం, పంచదార, కందిపప్పుతో పాటు చిరు ధాన్యాలను కూడా సరఫరా చేస్తామని ప్రకటించారు. ప్రభుత్వం వచ్చిన కొత్తలో కందిపప్పుతోపాటు జొన్నలు కూడా ఇచ్చారు. దీంతో కార్డుదారులు ఇక నుంచి తమకు అన్నిరకాల వస్తువులు తక్కువ ధరకు దొరకుతాయని భావించారు. నవంబరులో 70శాతం కందిపప్పును జిల్లాకు కేటాయించగా, డిసెంబరులో అసలు జిల్లాకు కేటాయించలేదు. జనవరి, ఫిబ్రవరి నెలల్లో కూడా అదే పరిస్థితి నెలకొంది. తాజాగా మే 1వ తేదీ నుంచి జిల్లాలో రేషన్ పంపిణీ ప్రారంభమవుతుండగా ప్రభుత్వం జిల్లాకు కేవలం బియ్యం, చక్కెరను మాత్రమే సరఫరా చేసింది.

కొలిక్కిరాని కసరత్తు

టీచర్ల పునర్విభజనపై కుస్తీ.. రకరకాల సవరణలతో తలనొప్పి

ఒంగోలు విద్య, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని ఉపాధ్యాయుల పునర్విభజన ప్రక్రియ ఇంకా కొలిక్కి రాలేదు. జిల్లాలోని 3,048 పాఠశాలల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ పూర్తికాగా టీచర్ల కేటాయింపు విషయంలో ఇంకా కుస్తీ పడుతున్నారు. టీచర్ల పునర్విభజనకు సంబంధించి విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పష్టమైన మార్గదర్శకాలు రాతపూర్వకంగా జారీ చేయకుండా రోజు వెబెక్స్ సమావేశంలో రకరకాల సవరణలు చెప్తుండటంతో క్షేత్రస్థాయిలో అధికారులు ఏం చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. రోజూ ఒంగోలు నుంచి కమిషనర్ కార్యాలయానికి క్యూ కడుతున్నా ఆశించిన మేర పురోగతి లేదు. బుధవారం కమిషనర్ కార్యాలయానికి వెళ్లిన డీఈవో కిరణ్‌కుమార్ ఇతర సిబ్బంది టీచర్ల పునర్విభజనను మమఅనిపించి నివేదించారు. అయితే టీచర్ల కేటాయింపుల్లోని తప్పులను కమిషనర్ కార్యాలయ సిబ్బంది ఎత్తిచూపి డీఈవో సమర్పించిన ప్రతిపాదనలను వెనక్కు పంపారు. తప్పులతడకలుగా ప్రతిపాదనలు సిద్ధం చేస్తుండటం పట్ల వారు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. బుధవారం ఎంత రాత్రైనా జాబితాల్లోని తప్పులు సవరించి కచ్చితమైన జాబితాలను సంతకాలతో సమర్పించిన తర్వాతే వెళ్లాలని కమిషనర్ కార్యాలయం హుకుం జారీ చేసింది. దీంతో ఇక్కడి నుంచి వెళ్లిన అధికారులు, సిబ్బంది తప్పులను సవరించడంలో తలమునకలవుతున్నారు.

ఈకేవైసీకి గడువు మరో 2 నెలలు పెంపు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రేషన్‌లబ్ధిదారులకు ఈకేవైసీ చేయించుకునేందుకు మరో రెండు నెలలు గడువు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రేషన్‌కార్డుల పరిధిలో ఉన్న లబ్ధిదారులందరూ ఈకేవైసీని చేయించుకునేందుకు మార్చి 15 నుంచి అవకాశం కల్పించింది.మార్చి ఆఖరుకు ప్రక్రియ పూర్తికాకపోవడంతో ఏప్రిల్ 30 వరకు గడువు పొడిగించారు. ప్రస్తుతం జిల్లాలో ఇంకా 1.22 లక్షల మంది లబ్ధిదారులు ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉంది. జూన్ 30 వరకు పెండింగ్‌లో ఉన్న లబ్ధిదారులందరూ చేయించుకోనే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జూన్ 30లోపు ఈకేవైసీ చేయించుకోకపోతే ఇక గడువు పెంచేది లేదని ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేసినట్లు సమాచారం.

బడి పిల్లలకు భలే పండుగ

(5వ పేజీ తరువాయి)

ఉంటాయి.

● 3వ తరగతికి తెలుగు, ఇంగ్లీషు ఒక పుస్తకం, గణితం, పరిసరాల విజ్ఞానం పాఠాలు మరో పుస్తకంలో ఇస్తారు. పాఠ్యపుస్తకాల తరహాలో వర్క్‌బుక్ కూడా రెండేసి సబ్జెక్టులకు ఒకటి చొప్పున వర్క్‌బుక్ ఇస్తారు.

● 4వ తరగతికి కూడా ఆ తరహాలోనే రెండేసి సబ్జెక్టులకు 1 పాఠ్యపుస్తకం, 1 వర్క్‌బుక్ మొత్తం నాలుగు పుస్తకాలు ఇస్తారు.

● 5వ తరగతికి కూడా 3, 4 తరగతుల తరహాలోనే తెలుగు, ఇంగ్లీషు, సబ్జెక్టులకు ఒకటి, గణితం, పరిసరాల విజ్ఞానానికి ఒకటి చొప్పున పాఠ్యపుస్తకాలు, అదే సబ్జెక్టులతో వర్క్‌బుక్స్ నాలుగు ఇస్తారు.

● 6, 7 తరగతులకు తెలుగు, హిందీ, ఇంగ్లీషు సబ్జెక్టులకు ఒక పుస్తకం, గణితం, జనరల్‌సైన్స్, సోషల్ స్టడీస్ సబ్జెక్టులకు వేర్వేరుగా పాఠ్యపుస్తకాలు మొత్తం నాలుగు ఇస్తారు.

● 8వ తరగతికి తెలుగు, హిందీ, ఇంగ్లీషు సబ్జెక్టులకు ఒక పుస్తకం... గణితం, సోషల్ స్టడీస్, ఫిజికల్ సైన్స్ అండ్ బయాలజీ సైన్స్ సబ్జెక్టులకు వేర్వేరుగా మొత్తం 4 పుస్తకాలు ఇస్తారు.

● 9వ తరగతికి తెలుగు, హిందీ (పాతది) ఇంగ్లీషులకు ఒక పుస్తకం, గణితం ఒక పుస్తకం, పీఎస్ అండ్ బీఎస్ ఒక పుస్తకం, సోషల్ ఒక పుస్తకం, ఇంగ్లీషు వర్క్, ఎక్స్ ప్రెషన్స్ వర్క్‌బుక్ మొత్తం ఐదు పుస్తకాలు ఇస్తారు.

● పదవ తరగతిలో తెలుగు, హిందీ, గణితం, పీఎస్, బీఎస్, జియోగ్రఫీ, హిస్టరీ, డెమొగ్రఫిక్ పాలిటిక్స్ అండర్ స్టాండింగ్ ఎకాసమిక్ డెవలప్‌మెంట్ మొత్తం 12 పుస్తకాలు ఇస్తారు.

చివర్లో చేతివాటం!

(5వ పేజీ తరువాయి)

వారం రోజులుగా వెలిగండ్ల మండలంలోని భూరికార్డులకు సంబంధించి నదాదాపు 700కుపైగా ఫైళ్లలో అడ్డగోలుగా మార్పులు, చేర్పులు చేసి ఆన్‌లైన్‌లు చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై జిల్లా రెవెన్యూ ఉన్నతాధికారులు స్పందించి విచారణ చేపట్టాల్సి ఉంది. పాత రికార్డులను పరిశీలించి ప్రభుత్వ భూములను కాపాడాలని పలువురు కోరుతున్నారు.

నాకు ఫిర్యాదులు అందాయి

వెలిగండ్ల మండలంలో భూములకు సంబంధించి అడ్డగోలుగా ఆన్‌లైన్, రికార్డుల మార్పులు, చేర్పులు జరిగాయని ఫిర్యాదులు అందాయి. ప్రస్తుతం ప్రధానమంత్రి కార్యక్రమం కోసం అమరావతిలో ఉన్నా. కనిగిరి వచ్చిన వెంటనే ఎవరైన లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే విచారణ చేస్తా. అవకతవకలు రుజువైతే చర్యలు తీసుకుంటాం.

-కేశవర్ధన్‌రెడ్డి, ఆర్డీవో, కనిగిరి

ప్రధాని సభకు సమాయత్తం

(5వ పేజీ తరువాయి)

నుంచి భారీగా టీడీపీ శ్రేణులు తరలివెళ్లే విధంగా ఏర్పాట్లు చేశారు. ఇతర నియోజకవర్గాల ముఖ్య నాయకులు వాహనాలలో వెళ్లే విధంగా అధికారపక్షం ప్రజాప్రతినిధులు దృష్టిసారించారు. సమీప జిల్లాలైన బాపట్ల, పల్నాడుల నుంచి అధికంగా జనసమీకరణ ఉన్న నేపథ్యంలో జిల్లా నుంచి 200 ఆర్టీసీ బస్సులను ఆ జిల్లాలకు కేటాయించారు. మన జిల్లా నుంచి వెళ్లే వారి కోసం స్థానిక నేతలు ప్రైవేటు, కాలేజీ, స్కూలు బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం. మరోవైపు ప్రధాని సభ నేపథ్యంలో విజయవాడ, విశాఖపట్నం వైపు రాకపోకలు సాగించే వాహనాలను దారిమళ్లిస్తున్నారు. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ మార్గంలోని వాహనలను త్రోవగుంట నుంచి చీరాల మార్గంలో వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. అలాగే సభ విజయవంతానికి జనసమీకరణ చేసేందుకు ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రి రవికుమార్‌కు మంగళగిరి, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు తాడికొండ, కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రకు పెదకూరపాడు నియోజకవర్గాల బాధ్యతలు అప్పగించారు. అద్దంకి, చీరాల, పర్చూరు నుంచి జనసమీకరణ చేయనున్నారు.

పీఎం సభకు తరలిన యంత్రాంగం

కమిషనరేట్‌లో విధులకు 12 మంది అధికారులు, 10 మంది తహసీల్దార్లు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో శుక్రవారం జరగనున్న ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సభ ఏర్పాట్లు, ఇతర అంశాలను పర్యవేక్షించేందుకు జిల్లా నుంచి అధికారులు తరలివెళ్లారు. రాష్ట్రప్రభుత్వ ఆదేశాలతో ఆరుగురు జిల్లా స్థాయి అధికారులు, ఆరుగురు డిప్యూటీ కలెక్టర్లు, 10మంది తహసీల్దార్లకు విధులను కేటాయించారు. దీంతో అమరావతి సభకు కేటాయించిన వారు బుధవారం ఇక్కడ విధుల నుంచి రిలీవ్ అయ్యి మధ్యాహ్నం అక్కడ కమిషనరేట్‌లో రిపోర్టు చేశారు. అక్కడి అధికారులు కేటాయించే విధుల్లో పాల్గొననున్నారు. ఆ కార్యక్రమం ముగిసిన అనంతరం తిరిగి అధికారులు ఇక్కడకు వచ్చి విధుల్లో పాల్గొననున్నారు.

బంగారం షాపులు వెలవెల


జనసంచారం తక్కువగా ఉన్న గాంధీరోడ్డు

అక్షయతృతీయ రోజున ఆశించిన స్థాయిలో లేని కొనుగోళ్లు
ఒక వైపు ధరలు పెరుగుదల.. మరో వైపు గ్రామీణ ప్రాంతాల ప్రజల పరిస్థితి అంతంతమాత్రమే కారణమా...


ఓ షాపులో కొనుగోలుదారులు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): అక్షయ తృతీయరోజున బంగారం కొనుగోలు చేస్తే ఆ ఏడాదంతా ఆ కుటుంబానికి మేలు జరుగుతుందనే భావనతో ప్రజానీకం ఎంతో కొంత బంగారం కొనుగోలు చేయడం సంప్రదాయంగా వస్తుంది. అటువంటిది ఈ ఏడాది పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. బుధవారం అక్షయ తృతీయ అయినప్పటికీ ఒంగోలు నగరం గాంధీరోడ్డులో బంగారం షాపులన్నీ వెలవెలబోయాయి.

జిల్లా వ్యాప్తంగా 500లకు పైగా బంగారం షాపులు ఉండగా ఒంగోలులో 125 వరకు ఉన్నాయి. ఈఏడాది అక్షయ తృతీయ రోజున బంగారం కొనుగోళ్లు జరుగుతాయని వ్యాపారులు అందుకు తగ్గట్లుగా పలురకాల మోడల్స్‌ను కూడా అందుబాటులోకి తెచ్చారు. బుధవారం బంగారం ధర సవరు(ఎనిమిది గ్రాములు) రూ.72వేలు ఉండగా మూడు శాతం జీఎస్టీ ఉంది. అంటే ఒక్కొక్క గ్రాము రూ.9వేలు పడుతుండటంతో ప్రజానీకం ఏ వస్తువు కొనుగోలు చేయాలన్నా కనీసం రూ.20వేలు దాటుతుంది. దీంతో బంగారం కొనుగోలు చేసేందుకు పెద్దగా ముందుకు రాని పరిస్థితి ఏర్పడింది. గత ఏడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది బంగారం కొనుగోళ్లు భారీగా తగ్గిందని అందులోని వ్యాపారులు చెబుతున్నారు. ఏదేమైనా ఒక వైపు బంగారం ధరలు ఆకాశాన్ని అంటడం, మరో వైపు ప్రజలకు రాబడి తగ్గిపోవడం ప్రభావం అక్షయతృతీయ రోజున స్పష్టంగా కనిపించింది. సాధారణంగా అక్షయతృతీయ రోజున గాంధీ రోడ్డు ప్రజల రాకపోకలతో కళకళలాడేది. అంటువంటిది ఈ ఏడాది ఆ పరిస్థితి లేకుండాపోయిందని వ్యాపారులు చెప్తున్నారు.

హైదరాబాద్‌కు 'ఈదర'

ఒంగోలు విద్య, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ప్రైవేటు వైద్యశాలలో వారం రోజులుగా చికిత్స పొందుతున్న జడ్పీ మాజీ చైర్మన్ ఈదర హరిబాబు కోలుకోవడంతో అక్కడి నుంచి డిశ్చార్జి అయ్యారు. ఆయనకు గుండె సంబంధ ప్రత్యేక పరిస్థితులు అవసరం ఉండటంతో హైదరాబాద్‌లో పేరున్న ఆస్పత్రికి తీసుకెళ్లారు. టీడీపీ నేత, మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్య చౌదరి ఈనెల 22వ తేదీ రాత్రి దారుణహత్యకు గురైన విషయం విదితమే. హరిబాబుకు స్వయాన వీరయ్య మేనల్లుడు కాగా, హత్య అనంతరం రిమ్స్‌లో ఉన్న వీరయ్య మృతదేహాన్ని చూసి భోరున విలపించిన హరిబాబుకు గుండెపోటుకు గురయ్యారు. వెంటనే ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తుండగా అప్పటి నుంచి వైద్యశాలలోనే ఉన్నారు. ఆరోగ్యం కొంత కుదుటపడినప్పటికీ గుండెకు సంబంధించి పలు కీలక పరీక్షలు అవసరంగా వైద్యులు సూచించారు. దీంతో ఇక్కడి ఆస్పత్రి నుంచి బుధవారం ఉదయం డిశ్చార్జి చేయగా ఆ వెంటనే కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. నాలుగైదు రోజులు అక్కడ పేరున్న ఆస్పత్రిలో ఆయనకు వైద్య పరీక్షలు చేయనున్నట్లు సమాచారం.



రియల్ హీరోలు.. నిరంతర శ్రామికులు

నిద్రలేచింది మొదలు కాయకష్టం చేసుకుంటూ, కుటుంబాన్ని పోషించుకుంటూ, జీవన పోరాటంలో శ్రమిస్తూ, హక్కుల కోసం పోరాడుతున్న శ్రామిక రంగంలో పనిచేస్తున్న ప్రతి కార్మికుడు రియల్ హీరో అనే చెప్పవచ్చు.

పట్టణాలు పరిశుభ్రంగా ఉండాలన్నా, పెద్ద పెద్ద కంపెనీలు పనిచేయాలన్నా, భవన నిర్మాణ రంగం బాగుండాలన్నా, ఫ్యాక్టరీలు పనిచేయాలన్నా కార్మికులదే కీలక పాత్ర.

పెద్దగా చదువుకోకపోయినా, చేతిని, కాయకష్టాన్ని నమ్ముకున్న సగటు జీవి సామాన్యుడే కార్మికుడు. గురువారం అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం సందర్భంగా వారి శ్రమకు సెల్యూట్ కొడదాం...

ఒంగోలు, కార్పొరేషన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి)

ఈ-శ్రమ కార్డులతో భరోసా


రిక్షా తొక్కుతూ...


ఇటుకల బట్టీలలో...

● కార్మికుల శ్రేయస్సు కోసం అనేక చట్టాలు

కార్మికుల కోసం ప్రభుత్వం అనేక చట్టాలను అమలులోకి తీసుకొచ్చింది. వారి భద్రత కోసం ఈ శ్రమ్ కార్డును అందుబాటులోకి తీసుకొచ్చి వారికి అవసరమైన ఆరోగ్య, పని భద్రత, పిల్లల పెళ్లిళ్లు, చివరి మజిలీ వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాయి. ఈ శ్రమతో కార్మికులకు భరోసా కల్పిస్తూ అండగా నిలుస్తున్నాయి. ముఖ్యంగా వ్యవసాయ, ఆశా, వలస కార్మికులు, పాల వ్యాపారం, చేతి వృత్తులు, భవన నిర్మాణ రంగం, తదితర రంగాల్లో కార్మికులకు ఈ శ్రమ కార్డులను అందించి ఆదుకోవడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. అందుకోసం కార్డు రూపంలో వారికి గుర్తింపు అందిస్తుంది.

● ప్రయోజనాలు..

ఈ శ్రమ కార్డు ద్వారా ఎన్నో ప్రయోజనాలున్నా అవగాహన లేకపోవడంతో నమోదు చేసుకునేందుకు పెద్దగా ముందుకు రావడం లేదు. కార్మికులకు రూ.2లక్షల వరకు ఉచిత బీమా సౌకర్యం ఉంటుంది. ప్రమాదవశాత్తు అంగవైకల్యం సంభవిస్తే గరిష్ఠంగా రూ.లక్ష సాయం చేస్తారు. నిరుద్యోగుల నమోదు సమయంలో ఇచ్చిన ఈ మెయిల్, చరవాణీ నవంబర్‌కు నేరుగా కొలువుల సమాచారం అందుతుంది.

● వీరు అనర్హులు

ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న వారు, ఈఎస్ఐ, ఈపీఎఫ్, ఆదాయ పన్ను చెల్లిస్తున్నవారు ఈ పథకానికి అనర్హులు. ఆధార్ కార్డు ఉండి 16 నుంచి 59 ఏళ్ల లోపు వారు ఉచితంగా సభ్యత్వం పొందవచ్చు. సాంకేతికపై అవగాహన ఉన్నవారు నేరుగా కంప్యూటర్, సెల్‌ఫోన్ ఈశ్రమ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ఉంది. అలా రాని వారు సీఎస్‌సీ/గ్రామ/వార్డు సచివాలయంలో, కార్మిక శాఖల ద్వారా నమోదు చేసుకోవచ్చు.

అవగాహనతోనే డ్రగ్స్ కట్టడి

జిల్లాలో మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల నివారణకు కృషి చేయాలి
కలెక్టర్ తమీమ్ అన్సారియా


మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా, పక్కన ఎస్పీ దామోదర్, ఏఎస్పీ నాగేశ్వరరావు, సబ్ కలెక్టర్ త్రివినాగ్

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల నివారణకు ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించడమే ఏకైక మార్గమని కలెక్టర్ తమీమ్ అన్సారియా చెప్పారు. డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే దుష్పలితాలను పెద్ద ఎత్తున వివరించడమే కాకుండా జిల్లాలో పూర్తి స్థాయిలో నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో బుధవారం జరిగిన జిల్లా స్థాయి నార్కోటిక్స్ కంట్రోల్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో డ్రగ్స్‌ను పూర్తి స్థాయిలో నివారించేందుకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో ఈగల్ క్లబ్‌లు ఏర్పాటు చేయాలని, అలాగే ఔషధ నియంత్రణాధికారులు సంయుక్తంగా మందుల షాపులను తనిఖీ చేయాలని ఆదేశించారు. ఫిర్యాదులు చేసేందుకు ఏర్పాటు చేసిన 1972 టోల్ ఫ్రీ నెంబరుపై ప్రచారం చేయాలన్నారు. ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ జిల్లాలో మత్తుపదార్థాలు, మాదకద్రవ్యాలను అరికట్టేందుకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. జిల్లాలో ఎక్కడా గంజాయి పంట సాగు లేదన్నారు. జిల్లా మీదుగా రవాణా అవుతున్న గంజాయిని అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. జిల్లాలో ఇతర ప్రాంతాల నుంచి మైనింగ్ పనులకు కూలీలు వస్తున్నారని, సంబంధిత పరిశ్రమల యజమాన్యం ఆ కూలీలపై నిఘా ఉంచేలా మైనింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు, మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డీఆర్వో ఓబులేషు, ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ జమున, వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు, సాంఘిక సంక్షేమశాఖ అధికారి లక్ష్మానాయక్ పాల్గొన్నారు.

గజవాహనంపై స్వామి వారు


గజవాహనంపై ఊరేగుతున్న వేంకటేశ్వరస్వామి

కంభం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : కంభం శ్రీ వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా 8వ రోజు మంగళవారం రాత్రి వేంకటేశ్వరస్వామి గజవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. మాడవీధుల్లో ఊరేగుతున్న స్వామికి భక్తులు కాయకర్పూరాలు సమర్పించారు.

దూడకు అంత్యక్రియలు


ఆవు దూడ అంత్యక్రియల్లో ప్రజలు

మార్కాపురం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : కొండేపల్లి రోడ్డులో బుధవారం ఉదయం కుక్కలు దాడిచేసి కరవడంతో ఓ ఆవు దూడ మృతి చెందింది. ఈ విషయాన్ని స్థానికుల ద్వారా తెలుసుకున్న బీజేపీ నాయకులు వెంటనే ఆ ప్రాంతానికి చేరుకున్నారు. గోమాతకు పూజలు చేసి, శాస్త్రోక్తంగా అంత్యక్రియలు నిర్వహించారు. ముందుగా మున్సిపాలిటీ అధికారులు సమాచారమిచ్చి, అందరి సమక్షంలో దూడకు అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీ కృష్ణారావు, బీసీ సెల్ పట్టణ అధ్యక్షుడు దేశబోయిన శ్రీను, ఎస్సీ సెల్ అధ్యక్షుడు లింగాల నాగరాజు, సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పాలిసెట్

85.86శాతం మంది హాజరు


ఒంగోలులోని పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు


కేటాయించిన గదులను చూసుకుంటున్న విద్యార్థులు

ఒంగోలు విద్య, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లోని డిప్లమో కోర్సుల్లో ప్రవేశాలకు విద్యార్థులను ఎంపిక చేసేందుకు బుధవారం నిర్వహించిన ఉమ్మడి ప్రవేశ పరీక్ష(పాలిసెట్) ప్రశాంతంగా జరిగింది. మొత్తం 85.86శాతం మంది హాజరయ్యారు. ఉమ్మడి జిల్లాలో 4600 మందికి 3950 మంది పరీక్ష రాశారని జిల్లా కో ఆర్డినేటర్ శివ ప్రసాద్ తెలిపారు. ఒంగోలులో ఏడు పరీక్షా కేంద్రాల్లో, మార్కాపురంలో నాలుగు పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. పరిశీలకులు సి. దేవరాజ్, జె రామ్ ప్రసాద్‌లు పరీక్షలను పర్యవేక్షించారు.

శిశువుల సంరక్షణ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రులలో నవజాత శిశువుల సంరక్షణ కేంద్రాల ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ సమావేశపు హాలులో బుధవారం సాయంత్రం వైద్యాధికారులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. గిద్దలూరు, యర్రగొండపాలెం, కొండపి, మార్కాపురం రిమ్స్ ఆస్పత్రుల్లో నవజాత శిశువుల సంరక్షణ కేంద్రాల ఏర్పాటుకు సంబంధిత మెడికల్ ఆఫీసర్లకు దిశానిర్దేశం చేశారు. జిల్లాలో మాతృమరణాలు తగ్గించడం, పుట్టిన బిడ్డలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే నవజాత శిశువుల సంరక్షణ కేంద్రాల ఏర్పాటు ప్రధాన ఉద్దేశ్యమన్నారు. కనిగిరి ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విధంగా నవజాత శిశువుల సంరక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ టి. వెంకటేశ్వర్లు, డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాసనాయక్, ఈఈ నిర్మల్‌కుమార్, కమ్యూనిటీ ఎంపర్మెంట్ ల్యాబ్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ ప్రతినిధి శ్రావ్య ఉన్నారు.

మెప్మా సీఎంఎం సస్పెండ్

ఒంగోలు, కార్పొరేషన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఒంగోలు నగర సీఎంఎంను సస్పెన్షన్ చేస్తూ మెప్మా మేనేజింగ్ డైరెక్టర్ తేజ్‌భరత్ ఉత్తర్వులు జారీ చేశారు. నగర సీఎంఎంగా విధి నిర్వహణలో అవినీతి అక్రమాలకు పాల్పడటం, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మార్చి 8న మార్కాపురం విచ్చేసిన సమయంలో సీఎం సభ పేరుతో వసూళ్లు చేయడం, అలాగే దివ్యాంగుల పట్ల దురుసుగా ప్రవర్తించడం, అలాగే కొందరు ఎస్సీ మహిళల పట్ల కూడా ఇబ్బందిగా ప్రవర్తించడంపై ఇప్పటికే ఆమెపై లిఖితపూర్వకంగా ఫిర్యాదులు వచ్చాయి. పీడీ శ్రీహరి విచారణ చేసి, నివేదికను ఎండీకి అందజేశారు. దీనిపై స్పందించిన ఎండీ.. ఆమెను సీఎంఎంగా విధుల నుంచి సస్పెండ్ చేశారు.

నీటిపన్ను పెంపుపై రగడ

ఏకంగా ఐదురెట్లు పెంచటంపై కౌన్సిల్ సమావేశంలో టీడీపీ కౌన్సిలర్ల ధ్వజం ● టీడీపీ, వైసీపీ కౌన్సిలర్ల మధ్య మాటల యుద్ధం

అభివృద్ధి పనులకు పాలకపక్ష వైసీపీ మోకాలడ్డు ● తొమ్మిది అంశాలకు లభించని ఆమోదం ● కార్యాలయంలో ఉండి కూడా సమావేశానికి హాజరుకాని కమిషనర్



సమావేశంలో టీడీపీ, వైసీపీ కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం

చీమకుర్తి, ఏప్రిల్30(ఆంధ్రజ్యోతి) : చీమకుర్తి మున్సిపాలిటీలో నీటిపన్ను పెంపుపై కౌన్సిల్ సమావేశంలో అధికార వైసీపీ, ప్రతిపక్ష టీడీపీ సభ్యుల మధ్య రగడ నెలకొంది. నెలకు రూ.20గా ఉన్న పన్నును ఏకంగా రూ.100లకు పెంచటంపై టీడీపీ కౌన్సిలర్లు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బుధవారం చీమకుర్తి మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ గోపురపు రాజ్యలక్ష్మి అధ్యక్షతన జరిగింది. అయితే ఈ సమావేశానికి కమిషనర్ హాజరు కాకుండా తన గదికే పరిమితం కావడంతో సమావేశాన్ని ప్రారంభించారు. తొలుత వైసీపీ కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్య నీటిపన్ను భారీగా పెంచటంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. పెంచిన పన్నును తగ్గించాలని తామంతా కోరుతున్నామని చైర్‌పర్సన్‌కి తెలిపారు. దీనిపై టీడీపీ కౌన్సిలర్ గొల్లపూడి రమాదేవి మాట్లాడుతూ కౌన్సిల్లో పాలకవర్గంగా ఉన్న మీరే నీటి పన్నును పెంచుతూ ఏకగ్రీవంగా తీర్మానం చేశారని, అపుడు గిచ్చి ఇపుడు జోలపాట పాడతారెందుకంటూ ధ్వజమెత్తారు. తాము అపుడే పన్ను పెంచటాన్ని తీవ్రంగా వ్యతిరేకించామని తెలిపారు. వైసీపీ కౌన్సిలర్ సోమా శేషాద్రి మాట్లాడుతూ సంపద సృష్టిస్తానన్న సీఎం చంద్రబాబు ఇపుడు పన్నులు పెంచమంటూ ఆదేశాలు ఇచ్చిన మేరకే పన్ను పెంచారన్నారు. దీనిపై టీడీపీ కౌన్సిలర్లు గొల్లపూడి రమాదేవి, గోరంట్ల అంజలి స్పందిస్తూ ప్రజలపై భారం మోపేలా పన్నులు మీరు పెంచి, అభివృద్ధికి మారుపేరైన తమ నాయకునిపై బురద జల్లుతారేమిటని ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఇరుపక్షాల మధ్య మాటల యుద్ధం నెలకొంది. మున్సిపాలిటీలో అభివృద్ధి తమ హయాంలోనే జరిగిందని వాదులాడుకున్నారు.

తాగునీటి సరఫరా పనులు తిరస్కరణ..

కౌన్సిల్ ఎజెండాలో 14 అంశాలను పొందుపరిచి తీరా సమావేశం జరుగుతున్న సమయంలో కేవలం ఐదు అంశాలకే ఆమోదం తెలిపారు. వీటిలో డీఎంఎఫ్ నిధులతో కారుమంచి కాలువ పునరుద్ధరణతోపాటు ఇతర సాధారణ అంశాలు ఉన్నాయి. ఇక తిరస్కరించిన వాటిలో డంపింగ్‌యార్డ్‌కు వేసిన సీసీరోడ్డుకు గ్రావెల్ వేయించటం, వీకర్ సెక్షన్ కాలనీలో, హిమగిరికాలనీకి వెళ్లే రహదారికి ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ పనులు, వీవర్స్ కాలనీలో ప్రమాదకరంగా ఉన్న బావిని పూడ్చటం ఉన్నాయి. వీటితో పాటు వేసవిలో తాగునీరు అందించేందుకు పట్టణంలో మూడుచోట్ల చలివేంద్రాలను ఏర్పాటు చేయాలనే అంశాన్ని సైతం తిరస్కరించారు. ఇంకా 12వ వార్డులో ఎస్టీకాలనీలో మూడులైన్లలో, పదోవార్డులో పద్మశాలీ వీధి రెండో లైన్‌లో తాగునీటి పైపులైన్లు నిర్మించటానికి అజెండాలో పొందుపరచగా వీటిని పాలకపక్షంగా ఉన్న వైసీపీ కౌన్సిలర్లు ఏకగ్రీవంగా తిరస్కరించారు. దీంతో ఈ వేసవికాలంలో పనులు చేపట్టలేని పరిస్థితి నెలకొంది. ఎస్టీకాలనీవాసులు ఇటీవల ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్‌ని కలిసి తమ కాలనీకి తాగునీటి పైపులైన్ వేసి సమస్య పరిష్కరించాలని వినతిపత్రాన్ని అందజేశారు. అయితే ఈ పనులకు ఆమోదం తెలపటంపై అభ్యంతరం ఏమిటని టీడీపీ కౌన్సిలర్లు నిలదీశారు. తాగునీటిపై రాజకీయాలు ఏంటని ప్రశ్నించారు. టెండరు పొందిన కాంట్రాక్టర్ పనితీరు సరిగ్గా లేనందున తిరస్కరిస్తున్నామని వైసీపీ కౌన్సిలర్లు సమాధానం ఇవ్వటం కొసమెరుపు.

పన్ను పెంపు రూ.50కి తగ్గిస్తాం..

కౌన్సిల్ సమావేశం ముగిసిన తదుపరి చైర్మన్ చాంబర్‌లో వైసీపీ కౌన్సిలర్లు ప్రెస్‌మీట్ నిర్వహించారు. చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి, కౌన్సిలర్ సోమా శేషాద్రిలు మాట్లాడారు. నీటిపన్నును నెలకు రూ.20 నుంచి రూ.100లకు పెంచటంపై ప్రజల్లో వ్యతిరేకత నెలకొన్న విషయాన్ని గుర్తించామన్నారు. మహిళల నుంచి విమర్శలు వస్తున్న నేపథ్యంలో పన్నును రూ.50లకు తగ్గిస్తామన్నారు. దీనిపై వచ్చే కౌన్సిల్ సమావేశంలో తీర్మానం పెట్టి ఆమోదిస్తామని తెలిపారు. కాగా అభివృద్ధి పనులకు ఆమోదం తెలుపకుండా కనీసం తాగునీటి సరఫరా పనులను కూడా తిరస్కరించటం ఏమిటనే ప్రశ్నకు కాంట్రాక్టర్ నచ్చకపోవటంతో అజెండాలోనే అంశాలకు ఆమోదం తెలుపలేదని చెప్పడం గమనార్హం.

వీరయ్య కుటుంబసభ్యులకు సోమిరెడ్డి పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహనరెడ్డి

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నేత, మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్యచౌదరి దారుణ హత్యకు గురైన నేపథ్యంలో ఆయన కుటుంబ సభ్యులను టీడీపీ పోలీట్‌బ్యూరో సభ్యుడు, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహనరెడ్డి బుధవారం రాత్రి పరామర్శించారు. అమ్మనబ్రోలులోని వీరయ్యచౌదరి నివాసంలో ఆయన సతీమణి సుచిత్ర, కుమారుడు చంద్రసిద్ధార్థతో సోమిరెడ్డి మాట్లాడారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నిబద్ధత గల నాయకుడిని పార్టీ కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వీరయ్య చిత్రపటానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తేళ్ల మనోజ్‌కుమార్, ఇంటూరి శ్రీనివాసరావు, ఈదర వెంకటకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

20నుంచి ఫొటోగ్రఫీపై ఉచితశిక్షణ

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని రూడ్‌సెట్ సంస్థలో మే 20వ తేదీ నుంచి 30 రోజుల పాటు ఫొటోగ్రఫీ, వీడియో గ్రఫీపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణకు ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగులు అర్హులన్నారు. ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు కలిగి ఉండాలన్నారు. శిక్షణ కాలంలో భోజనం, ఉచిత వసతి కల్పిస్తామని, ఇతర వివరాలకు 9573363141 సెల్‌నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

కమ్మవారి సేవా సమాఖ్య నూతన కార్యవర్గం



నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

ఒంగోలు(కల్చరల్), ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ కమ్మవారి సేవాసమాఖ్య రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలో రాష్ట్ర అధ్యక్షులుగా ఒంగోలుకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త మండవ మురళీకృష్ణ ఎన్నికయ్యారు. బుధవారం మంగళగిరిలోని రాయల్ బాంకెట్ హాలులో సమావేశమైన కమ్మవారి సేవాసమాఖ్య పెద్దలు ఆంధ్రప్రదేశ్ కమ్మవారి సేవాసమాఖ్య పేరిట ఒక ట్రస్టును ఏర్పాటు చేసి దానికి గౌరవ అధ్యక్షులుగా డాక్టర్ గని భాస్కరరావును, అధ్యక్షునిగా మండవ మురళీకృష్ణను ఎన్నుకున్నారు. అదేవిధంగా ప్రధానకార్యదర్శిగా కొత్తపల్లి రమేష్‌చంద్ర, కోశాధికారిగా గూడారి నాగకోటేశ్వరరావు, కార్యదర్శిగా సూరపనేని స్వరూపరాణిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మురళీకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కమ్మవారి సేవాసమితి కార్యదర్శి ఆలా నాగేశ్వరరావు, కన్వీనర్ కాట్రగడ్డ రఘుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ చేసిన ఏఎస్ఐకి సత్కారం

ఒంగోలు క్రైం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): పోలీస్‌శాఖలో 41ఏళ్ళు విధులు నిర్వహించి బుధవారం ఉద్యోగ విరమణ చేసిన ఏఎస్ఐ పి.నారాయణరెడ్డిని ఎస్పీ ఏఆర్.దామోదర్ ఘనంగా సత్కరించారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నారాయణరెడ్డి దంపతులకు శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసుశాఖ అండగా ఉంటుదన్నారు. కుటుంబ సభ్యులతో సుఖసంతోషాలతో గడపాలని కోరారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఆర్ఐ సీతారామిరెడ్డి, ఏఆర్ ఎస్ఐ తిరుపతస్వామి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి గురువారం సాయంత్రం ఒంగోలు రానున్నారు. స్థానిక రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో పార్టీ శ్రేణులకు అందుబాటులో ఉంటారు. అనంతరం నగరంలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారు. శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాల్గొనే అమరావతి రాజధాని పునః ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎంపీ మాగుంట పాల్గొంటారు.

మేడే శుభాకాంక్షలు : జిల్లాలోని కార్మిక వర్గానికి ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి మేడే శుభాకాంక్షలను తెలిపారు.

అమరావతి సభకు హాజరుకావాలి



మాట్లాడుతున్న హరిబాబు

సంతనూతలపాడు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యవేక్షణలో ఈనెల 2వ తేదీన అమరావతిలో ప్రతిష్టాత్మకంగా జరగనున్న అమరావతి పునర్నిర్మాణ సభకు టీడీపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు తెలిపారు. బుధవారం సంతనూతలపాడు టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, పలువురు ముఖ్యనేతలు హాజరవుతున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ నేతృత్వంలో జనసమీకరణ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సెక్రటరీ అడకా స్వాములు పాల్గొన్నారు.

వరాహ లక్ష్మీనరసింహస్వామికి చందన అలంకారం



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

సింగరాయకొండ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ సింహాచలంగా ప్రసిద్ధిగాంచిన పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో బుధవారం అక్షర తృతీయ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూలవిరాట్ శ్రీదేవి, భూదేవి సమేత వరాహ లక్ష్మీనరసింహస్వామి చందన అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. యోగనంద వరాహ లక్ష్మీనరసింహస్వామి, స్వయంభు ఆంజనేయుడికి సుందరమైన పుష్పాలతో అలంకరించారు. స్వామివారికి శాస్త్రోక్తంగా లక్ష తులసిదళ పూజను నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో పి. కృష్ణవేణి, ప్రధాన అర్చకులు ఉదయగిరి వెంకట శేషాలక్ష్మీనరసింహాచార్యులు పాల్గొన్నారు.

విలేకరులపై బనాయించిన కేసు కొట్టివేత

సింగరాయకొండ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వంలో సింగరాయకొండలో పలువురు విలేకరులు, టీడీపీ నాయకులపై పెట్టిన అక్రమ కేసును బుధవారం కందుకూరు జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు కొట్టివేసింది. 2021 మే1న పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహస్వామి ముఖద్వారంపై స్వామి, అమ్మవార్ల విగ్రహాల చేతులు లేకపోవడంతో అప్పట్లో ఎవరో కావాలని విరగకొట్టి ఉంటారని ప్రచారం జరిగింది. అక్కడ జరిగిన ప్రచారంపై పలు మీడియా చానళ్లు, పత్రికలు వార్తలు ప్రచురించాయి. దీంతో పైస్థాయిలో ఉండే వైసీపీ నేతల ఆదేశాలతో 8 మంది విలేకరులు, ఐదుగురు టీడీపీ నేతలపై 153(ఏ), 295(ఏ), 120(బీ), 504 ఆర్-డబ్ల్యూ 38 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. 24 మందిని సాక్షులుగా చేర్చారు. సాక్షులను కందుకూరు కోర్టు న్యాయాధికారి విచారించిన అనంతరం కేసును కొట్టివేస్తూ బుధవారం తీర్పునిచ్చారు.

కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

సంతనూతలపాడు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉచిత టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని బీసీ కార్పొరేషన్ ఈడీ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం సంతనూతలపాడులోని టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఎంపీడీవో డి.సురేష్‌బాబు పర్యవేక్షించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి చేసి మాట నిలబెట్టుకుంటా!

● ఎమ్మెల్యే దామచర్ల
● రూ.5.85 కోట్ల పనులకు శంకుస్థాపనలు



బాలాజీనగర్‌లో డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే దామచర్ల, మేయర్ సుజాత, కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు కార్పొరేషన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): తనపై నమ్మకంతో గెలిపించిన ప్రజల కోసం ఒంగోలు నగరాన్ని అభివృద్ధి చేసి ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటానని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తెలిపారు. ఒంగోలును అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. నగరపాలక సంస్థ, ఒంగోలు అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ (ఒడా) ఆధ్వర్యంలో చేపట్టిన రూ.5.85 కోట్ల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే దామచర్ల శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ నగరంలో మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు అండర్ డ్రైనేజ్ నిర్మాణానికి త్వరలోనే పనులు ప్రారంభం కానున్నట్లు చెప్పారు. అందుకోసం ప్రభుత్వం అవసరమైన నిధులు మంజూరు చేయడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. అమృత్ పథకం కింద తాగునీటి సమస్యను పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకోసం గుండ్లకమ్మ, రామతీర్థం నుంచి నీరు దిగుమతి చేసుకోవడంతోపాటు, అవసరమై ఓవర్ హెడ్ ట్యాంకులు, పైపులైనులు, ఫిల్టర్‌బెడ్‌లు నిర్మించి ప్రతి రోజూ నీరు అందించే దిశగా చర్యలు వేగవంతం చేసినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. మురికివాడల్లో మౌలికవసతుల కల్పన చేయనున్నట్లు తెలిపారు. శివారుకాలనీల్లో తాగునీరు, రోడ్లు, డ్రైన్‌లు నిర్మించడానికి చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. అందుకు సంబంధించి నగరపాలక సంస్థ అధికారులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించినట్లు దామచర్ల తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలన నెరవేర్చడం కోసం తాను ఎల్లప్పుడు కష్టపడి పనిచేస్తానని అన్నారు. ఏ సమస్య వచ్చిన తన దృష్టికి తీసుకువస్తే పరిష్కార కోసం తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా 9వ డివిజన్‌లో రూ.2 కోట్లతో డ్రైనేజీ నిర్మాణం, రూ.2.7కోట్లతో సీసీ రోడ్, డ్రైనేజీ, 16వ డివిజన్‌లోని బాలాజీనగర్‌లో రూ.46 లక్షలతో కొత్తగా నిర్మించిన సీసీరోడ్ ప్రారంభోత్సవం, అలాగే 24వ డివిజన్‌లో రూ.40లక్షలతో ఊరచెరువులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. వాటితోపాటు 35వ డివిజన్‌లోని సాయిబాబా గుడి నుంచి రూ.35లక్షలతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్ ఎమ్మెల్యే దామచర్ల ప్రారంభించారు. నగర కమిషనర్ కె.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమాల్లో మేయర్ గంగాడ సుజాత, డిప్యూటీ మేయర్ వేమూరి బుజ్జి, మునిసిపల్ ఇంజనీర్ చంద్రయ్య, కార్పొరేటర్లు, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

● కలెక్టర్ అన్సారియా



వేరుశనగ మొక్కలను పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా

కొత్తపట్నం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఇచ్చే ప్రకృతి వ్యవసాయాన్ని మరింతగా ప్రోత్సహించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా కోరారు. బుధవారం కొత్తపట్నం మండలంలోని పలు గ్రామాల్లో ఆమె పర్యటించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగుచేస్తున్న పలు పంట పొలాలను పరిశీలించారు. తొలుత కలెక్టర్ రంగాయపాలెంలో పర్యటించారు. రైతు కిష్టం వెంకటరావు నిర్వహిస్తున్న డెయిరీ ఫామ్‌ను సందర్శించారు. డెయిరీ నిర్వహణపై ఆమె రైతుతో మాటాడారు. డెయిరీ నిర్వహణలో ఖర్చులు అన్నీపోను నెలకు రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర ఆదాయం వస్తుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులకు మేత, దాణా సబ్సిడీతో రైతులకు అందజేశారు. అనంతరం కొత్తపట్నం డీడీ కాలనీలో రైతు వెంకటేశ్వర్లు సాగు చేస్తున్న వేరుశనగ సాగును పరిశీలించారు. వేరుశనగలో అంతరపంటలుగా బెండ, పొద్దు తిరుగుడు, క్లస్టర్ బీన్ సాగు చేయటం వల్ల వ్యవసాయం లాభసాటిగా మారిందని రైతు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం గమళ్ళపాలెంలో పీఎండీఎస్ విధానంలో సాగుచేస్తున్న వ్యవసాయ క్షేత్రాన్ని, కొత్తపట్నంలోని హార్టికల్చర్ ఫామ్‌ను ఆమె సందర్శించారు. పండ్ల మొక్కల పెంపకం వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్డీవో లక్ష్మీప్రసన్న, డీఏహెచ్‌వో బేబీరాణి, డీఏవో సుబ్రమణ్యేశ్వరశర్మ, ప్రకృతి వ్యవసాయం జిల్లా డీపీఎం సుభాషిణి, ఏపీఎంఐపీ పీడీ రమణ, జిల్లా హార్టికల్చర్ అధికారి గోపీచంద్, కొత్తపట్నం తహసీల్దార్ మధుసూదనరావు, ఎంపీడీవో శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యలను గాలికొదిలేసిన ప్రభుత్వం

రాజ్యసభ సభ్యుడు వైవీ ● వెల్లంపల్లిలో పొగాకు వేలం పరిశీలన ● హాజరైన జడ్పీచైర్‌పర్సన్ వెంకాయమ్మ, ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ సుబ్బారెడ్డి

మద్దిపాడు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కళ్లుమూసుకుపోయి రైతు సమస్యలను గాలికి వదిలేసిందని రాజ్యసభ సభ్యుడు వైవీ.సుబ్బారెడ్డి ఆరోపించారు. బుధవారం మద్దిపాడు మండలం వెల్లంపల్లిలోని పొగాకు వేలం కేంద్రాన్ని ఆయన వైసీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ ఇతర నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న పొగాకు కొనుగోళ్ల తీరును ప్రత్యక్షంగా పరిశీలించి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైవీ మీడియా సమావేశంలో మాట్లాడుతూ పొగాకు రైతులు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. అలాగే వరి, మిర్చి, శనగ పంటలు సాగు చేసిన రైతులకు సైతం గిట్టుబాటు ధర కల్పించటంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ప్రకాశం, గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో పొగాకు సాగు చేసిన రైతుల పరిస్థితి కూడా దయనీయంగా ఉందని, వారి పక్షాన వైసీపీ నిలిచి ప్రభుత్వం కళ్లు తెరిపిస్తుందని సుబ్బారెడ్డి అన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్, మేరుగ నాగార్జున, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, బత్తుల బ్రహ్మనందరెడ్డి, కొమ్మూరి కనకారావు, కసుకుర్తి ఆదెన్న, మారెడ్డి సుబ్బారెడ్డి, ఒంగోలు ఇన్‌చార్జి చుండూరి రవిబాబు, కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ, వాకా కోటిరెడ్డి, దుంపా రవణమ్మ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులు ప్రొటోకాల్ పాటించాలి

● ఎంపీపీ అరుణ



మాట్లాడుతున్న ఎంపీపీ అరుణ

మద్దిపాడు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శులు ప్రొటోకాల్ పాటించాలని, గ్రామాల్లో కనీస మౌలిక వసతుల కల్పన కోసం ప్రతి అధికారి పనిచేయాలని ఎంపీపీ వాకా అరుణ పేర్కొన్నారు. బుధవారం మద్దిపాడులోని మండల పరిషత్ సమావేశ హాలులో సర్వసభ్య సమావేశం ఆమె అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు తమ శాఖల ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలు తదితర అంశాలను ప్రజాప్రతినిధులకు తెలియజేయాలన్నారు. ఎంపీటీసీ సభ్యులకు ఇచ్చే గౌరవ వేతనం గత రెండు సంవత్సరాల నుంచి మంజూరు చేయడం లేదని గుళ్లాపల్లి ఎంపీటీసీ పల్లకి పద్మకుమారి ఎంపీడీవో దృష్టికి తీసుకురాగా త్వరలో వేతనాలు మంజూరవుతాయని ఆయన తెలిపారు. దొడ్డవరప్పాడు సర్పంచ్ బెజవాడ శ్రీరామమూర్తి మాట్లాడుతూ తమ గ్రామంలోనే అభివృద్ధి పనులు చేద్దామన్నా గతంలో చేసిన పనులకు నిధులు ఇవ్వకుండా పంచాయతీ కార్యదర్శులు ప్రొటోకాల్ పాటించ కుండా ప్రస్తుతం ఉన్న సర్పంచులను, ఎంపీటీసీలను ఇబ్బంది పెడుతున్నారన్నారు. పశుసంవర్ధక శాఖపై ఏడీ సుగణ్యారావు వివరణ ఇస్తుండగా పలువురు సర్పంచులు మొదటగా సభకు హాజరయ్యారని, గతంలో ఆ శాఖ తరపున ఎవరు హాజరు కాలేదని నిలదీశారు. సమావేశంలో ఘడియపూడి సర్పంచ్ బొమ్మల రామాంజనేయులు, పైడిపాటి వెంకటరావు, ప్రభాకర్‌రావు తమ గ్రామాల్లోని సమస్యలను సమావేశం దృష్టికి తెచ్చారు.



ఎద్దుకు పుచ్చకాయ ముక్కలను తినిపిస్తున్న యువకుడు

వృషభరాజా ఆరగించు..!

వేసవి ఎండలకు ప్రజలు ఠారెత్తుతున్నారు. ఎండకు తోడు ఉక్కపోతతో అల్లాడుతున్నారు. అలాగే మూగజీవాలు సైతం ఎంతో ఇబ్బందిపడుతున్నాయి. బుధవారం ఒంగోలు నగరంలో ఎద్దుతో భిక్షాటన చేసే ఓ వృద్ధుడు ఎండకు నడుస్తూ వెళుతుండగా ఓ యువకుడు వారిని ఆపాడు. వృద్ధుడు సేద తీరేందుకు పుచ్చకాయ ముక్కలు తినేందుకు ఇచ్చాడు. అలాగే ఎద్దుకు అందజేయగా అది ఎంతో ఆత్రుతగా ఆరగించింది. ఈ దృశ్యాన్ని చూసిన పలువురు హర్షం వ్యక్తం చేశారు.

- ఒంగోలు, ఆంధ్రజ్యోతి

తూతూమంత్రంగా సర్వసభ్య సమావేశం



ఏఈ శ్రీహరి దంపతులను సత్కరిస్తున్న ఎంపీపీ శోభారాణి, అధికారులు

సింగరాయకొండ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం తూతూమంత్రంగా జరిగింది. మెజారిటీ భాగం ప్రజాప్రతినిధులు సమావేశానికి గైర్హాజరయ్యారు. దీంతో గ్రామాల్లో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేవారు లేకపోవడంతో వారు కూడా తమశాఖల వారీగా నిర్వహిస్తున్న కార్యక్రమాలను, జరుగుతున్న అభివృద్ధి పనులను వివరించి ముగించారు. అనంతరం పంచాయతీరాజ్ ఏఈగా పదవీవిరమణ చేసిన కోటా శ్రీహరి దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కట్టా శోభారాణి, ఎంపీడీవో జయమణి, తహసీల్దార్ రవి, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

పశు సంరక్షణకు పెద్దపీట : డీఏహెచ్‌వో



నీటితొట్టెను పరిశీలిస్తున్న డీఏహెచ్‌వో బేబీరాణి

మర్రిపూడి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ఆర్థికాభివృద్ధికి మూలాధారమైన పశుసంపద సంరక్షణకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతను ఇస్తోందని డీఏహెచ్‌వో బేబీరాణి పేర్కొన్నారు. మర్రిపూడి పశువైద్యశాలను ఆమె బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవిలో పశువుల సంరక్షణకు పోషకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జాతీయ ఉపాధిహామీ పథకం అనుసంధానంతో మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు నిర్మించిన నీటి తోట్లను ఆమె పరిశీలించారు. జిల్లాలో 250 మెట్రిక్ టన్నుల దాణా సరఫరా చేయనున్నట్లు చెప్పారు. ప్రతి మండలానికి 6.7 మెట్రిక్ టన్నుల దాణా సరఫరా చేయనున్నట్లు చెప్పారు. రేషన్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ ఈ పథకానికి అర్హులని చెప్పారు. అనంతరం రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

యువకుడికి తీవ్రగాయాలు



గాయపడిన అంబూద్

వలేటివారిపాలెం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఎక్స్‌కవేటర్ తగిలి యువకుడికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని అయ్యవారిపల్లెలో బుధవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. ప్రకాశం జిల్లా ఈతముక్కల గ్రామానికి చెందిన షేక్ అంబూద్ తన స్నేహితుడు కోసం మోటారుసైకిల్‌పై పామూరు వెళ్తుండగా మార్గమధ్యంలో అయ్యవారిపల్లెలో హైవే పనులు చేస్తున్న ఎక్స్‌కవేటర్ ప్రమాదవశాత్తు తగిలింది. ఈ ప్రమాదంలో అంబూద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో కందుకూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా అంబూద్, పామూరు చెందిన తన స్నేహితుడు ఆర్మీకి ఎంపికై ఉన్నారు. వీరిద్దరూ గురువారం గుంటూరుకు వెళ్లి విధుల్లో చేరాల్సి ఉంది. ఈలోగా ఈ ప్రమాదం జరిగింది.

విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు


● డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు హెచ్చరిక



సూచనలు ఇస్తున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు

మద్దిపాడు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): వైద్యసిబ్బంది విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో డాక్టర్ బి.వెంకటేశ్వర్లు హెచ్చరించారు. బుధవారం సాయంత్రం మద్దిపాడు పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షుగర్, బీపీ, క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. గర్భిణులు, చిన్నారులకు టీకాలపై దృష్టి పెట్టాలని చెప్పారు. ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంటీ.కృష్ణబాబు గురువారం గుండ్లాపల్లి పరిశ్రమల కేంద్రంతో పాటు మద్దిపాడు ఆసుపత్రిని సందర్శిస్తారని, అందువల్ల అన్ని రికార్డులు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. మలేరియా జ్వరాలు ప్రబలే అవకాశాలు ఉన్నందున ఇప్పటినుంచే వైద్య సిబ్బంది అప్రమత్తంగా దోమల నివారణ చర్యలు చేపట్టాలని చెప్పారు. డ్రైనేజీల్లో మురుగు తొలగించేలా పంచాయతీ అధికారులను అప్రమత్తం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యులు శ్రావణ్‌కుమార్, ఆనందమోహన్, వినీల, హెల్త్ సూపర్‌వైజర్ బాలకోటయ్య, దరియా, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

200 ఎకరాల పండ్ల తోటల పెంపకమే లక్ష్యం



మాట్లాడుతున్న ప్రత్యూష

మద్దిపాడు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కింద 200 ఎకరాల పండ్ల తోటల పెంపకమే లక్ష్యంగా పెట్టుకున్నామని ఏపీవో ధనుంజయ వర్మ తెలిపారు. బుధవారం మద్దిపాడు మండల పరిషత్ కార్యాలయంలో ఉద్యానశాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని రైతులు ఉపయోగించుకుని పండ్ల తోటలు సాగుచేయాలని, ఉద్యానశాఖ ద్వారా రాయితీలు ఉంటాయని చెప్పారు. హార్టికల్చర్ అధికారి ప్రత్యూష మాట్లాడుతూ పండ్ల మొక్కలు సాగు ద్వారా రైతుల జీవన ప్రమాణాలు మెరుగవుతాయన్నారు. కార్యక్రమంలో టీఏ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఎండలోనే నిరీక్షణ..!

- నీడ లేక..ప్రయాణికుల ఇక్కట్లు
- ఆ ప్రాంతంలో యథేచ్ఛగా ఆక్రమణలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- బస్ షెల్టర్, మరుగుదొడ్లను నిర్మించాలని విజ్ఞప్తి



పొదిలిలోని పెద్ద బస్టాండ్ కూడలి



ఎండను తట్టుకోలేక చంటి బిడ్డలతో పట్ట కింద నిల్చున్న మహిళలు

పొదిలి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పాతూరు పెద్దబస్టాండ్ ప్రత్యేక వ్యాపార కూడలి. ఇక్కడికి పొదిలి, కొనకనమిట్ల, మర్రిపూడి మండలాలకు చెందిన వివిధ గ్రామాల ప్రజలు వివిధ రకాల పనులపై రోజూ వస్తుంటారు. అలాగే దర్శి, అద్దంకి, కొండేపి, కురిచేడు, ఒంగోలు, వినుకొండ, విజయవాడ, చీమకుర్తి పట్టణాలకు వెళ్లేవారు పెద్దబస్టాండ్ సెంటర్లోనే వేచి ఉండాలి. అయితే వారు బస్సులు, ఇతర వాహనాల కోసం వేచి ఉండేందుకు ఇక్కడ నిలువ నీడ లేక అల్లాడుతున్నారు. ఉదయం, సాయంత్రం ప్రయాణికులతోపాటు విద్యార్థులతో ఈ ప్రాంతం రద్దీగా ఉంటుంది. గతంలో పంచాయతీ ఆధ్వర్యంలో ప్రయాణికులు వేచి ఉండేందుకు బాలికల ఉన్నత పాఠశాల దక్షిణం వైపు రేకుల షెడ్ నిర్మించారు. ఎండకు వానకు ఇబ్బంది పడకుండా ఆశ్రయం పొందేవారు. కాలక్రమేణా చిరువ్యాపారులు ఆ షెడ్డును ఆక్రమించారు. తరువాత షెడ్‌ను కూల్చేశారు. గతంలో అన్న క్యాంటీన్ నిర్మాణం చేయాలనే ఉద్దేశంతో ఆప్రాంతంలో ఉన్న భారీ వృక్షాలను, రేకులషెడ్డును తొలగించి పునాదులు వేశారు. అయితే అప్పట్లో ప్రభుత్వం మారడంతో పునాదులకే పరిమితమైంది. ఖాళీ స్థలం కనిపించడంతో ఆ ప్రాంతమంతా ఆక్రమణకు గురైంది. దీంతో ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఎండలు మండిపోతుండడంతో ప్రయాణికులు సమీప చెట్లు, వ్యాపార సముదాయాల వద్దకు పరుగులు తీస్తున్నారు. ఆ సమయంలో దుకాణదారుల నుంచి అవమానాలను ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. మరోపక్క వ్యక్తిగత అవసరాలు తీర్చుకునేందుకు కూడా మరుగుదొడ్లు లేక ముఖ్యంగా మహిళలు అగచాట్లు పడుతున్నారు. బస్టాండ్ సమీపంలో ఉన్న మరుగుదొడ్లను గత వైసీపీ పాలనలో ఆక్రమించుకునేందుకు వైసీపీ నాయకుడు కూల్చి వేసిన సంగతి తెలిసిందే. ఇంత జరిగినా రెవెన్యూ, మున్సిపల్, పోలీసు అధికారులు చోద్యం చూశారు. రోజూ ప్రయాణికులు ఇబ్బంది పడతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో ఆక్రమణలపై అధికారులు కన్నెత్తికూడా చూడడం లేదు. ఈ ప్రభుత్వమైనా పెద్ద బస్టాండ్ సెంటర్‌లో బస్ షెల్టర్, మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.



పిడుగుపడి కాలుతున్న తాటాకు పందిరి

పిడుగు పడి పందిరి దగ్ధం

వేణుగోపాలస్వామి కల్యాణ మండపం వద్ద ఘటన

కంభం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కంభం మండలం రావిపాడులో శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ ఆవరణలో ఉన్న కల్యాణ మండపంపై పిడుగు పడి తాటాకు పందిరి కాలిపోయింది. అదృష్టవశాత్తు గుడి ఆవరణలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. మధ్యాహ్నం వరకు తీవ్రమైన వడగాడ్పులతో ఉక్కిరిబిక్కిరయిన ప్రజలకు ఉపశమనం కలిగే విధంగా దట్టమైన మేఘాలు కమ్మి ఉరుములు, మెరుపులతో మోస్తరు వర్షం కురిసింది. రావిపాడు గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయ ఆవరణలోని కల్యాణ మండపానికి ఇరువైపులా వేసిన తాటాకు పందిరిపై పిడుగు పడడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను అదుపు చేశారు. అలాగే హజరత్‌గూడెంలో పిడుగు పడి కేతం వెంకటేశ్వర్లుకు చెందిన రెండు గేదెలు మృతి చెందాయి. వాటి విలువ రూ.1.80లక్షలు ఉంటుందని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాశినాయనకు పూజలు

గిద్దలూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కాశినాయన ఆశ్రమంలో బుధవారం ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించారు. భక్తులు కాశినాయనకు సామూహికంగా అభిషేకం చేశారు. మధ్యాహ్నం భక్తులందరికీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆయా కార్యక్రమాలలో దాతలతోపాటు మాజీ సర్పంచ్ వైజా కృష్ణారెడ్డి, యోగా గురూజీ నారాయణరెడ్డి, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏకలవ్యలో ఇంటర్ ప్రవేశానికి ఆహ్వానం

పెద్దదోర్నాల,ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : ఏకలవ్య గురుకుల ఆదర్శ కళాశాలలో ఇంటర్ (సీబీఎస్ఈ)లో ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఈశ్వర్‌సింగ్ బుధవారం ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి గాను బైపీసీ, ఎంపీసీ, హెచ్ఈసీ విభాగాల్లో సీట్లు పొందేందుకు 2024-25లో పదవ తరగతిలో పాసైన ఎస్టీ విద్యార్థులు ఈనెల 25వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాల కోసం కళాశాల ప్రిన్సిపాల్ ఈశ్వర్ సింగ్ 9416094165 నెంబరును సంప్రదించాలన్నారు.

తెగిన విద్యుత్ వైరు

నీటి సరఫరా లేక ప్రజలకు ఇబ్బందులు

బేస్తవారపేట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : మండంలోని పిటికాయగుళ్ళ గ్రామ ఎస్సీ కాలనీలో రెండ్రోజుల నుంచి నీటి కోసం ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. విద్యుత్ వైర్ తెగిపోవడంతో ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని మాజీ సర్పంచ్ కొటారి రామకృష్ణ తెలిపారు. విద్యుత్ వైరు తెగిపోవడంతో బోరు పనిచేయడంలేదని, దీంతో నీటి ఇబ్బందులు తలెత్తాయని తెలిపారు. వెంటనే అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలు

మలుపు వద్ద పిచ్చి చెట్లే ప్రమాదానికి కారణం

ఎర్రగొండపాలెం రూరల్ ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : ఎదురెదుగా వస్తున్న రెండు ద్వీచక్రవాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలైన ఘటన బుధవారం కొలుకుల గ్రామ సమీపంలో జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. కొలుకుల గ్రామానికి చెందిన మలాది బలరాం ఎర్రగొండపాలెం నుంచి కొలుకుల వెళ్తున్నారు. అదే గ్రామానికి చెందిన గల్లా కోటేశ్వరరావు కొలుకుల నుంచి ఎర్రగొండపాలెం వస్తున్నాడు. ఈ నేపథ్యంలో మార్గమధ్యలోని కొలుకుల గ్రామ సమీపంలో మూలమలుపు వద్ద పిచ్చి చెట్ల కారణంగా ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించక రెండు బైక్‌లు ఎదురపడి ఢీకొట్టాయి. ఈ ప్రమాదంలో ఇద్దరూ గాయపడడంతో స్థానిక రవీంద్ర నర్సింగ్ హోంకు తరలించారు.

రేపటి నుంచి ఫ్రీ సీట్లకు దరఖాస్తు చేయాలి

కొమరోలు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : అన్ని ప్రైవేటు పాఠశాలల్లో ప్రభుత్వ నిబంధనల మేరకు పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించి ఉచిత విద్యను అందించేందుకు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో కావడి వెంకటేశ్వర్లు అన్నారు. ఈనెల 2 నుంచి 19 వరకు పేద విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారని ఎంఈవో తెలిపారు. 20 నుంచి 24 వరకు ఆయా సచివాలయ సిబ్బంది పరిశీలించి తొలివిడతగా 29న జాబితాను ప్రకటిస్తారని తెలిపారు. రెండో జాబితాను జూన్ 11న ప్రకటిస్తారన్నారు. అర్హులైన విద్యార్థులు దరఖాస్తులను సీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో పంపాలని, పూర్తి వివరాల కోసం టోల్ ఫ్రీ నెం. 18004258599కి సంప్రదించాలని ఎంఈవో సూచించారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం



అలీని సన్మానిస్తున్న న్యాయవాదులు

మార్కాపురం రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన సయ్యద్ జహీర్ అలీని ఆయన కార్యాలయంలో సహచర న్యాయవాదులు బుధవారం శాలువా, పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయవాద వృత్తిలో ఆయనకు ఉన్న అపార అనుభవంతో కక్షిదారులకు, బార్ అసోసియేషన్‌కు మంచి పేరు తీసువస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కంభం జడ్పీటీసీ మాజీ సభ్యుడు జాకీర్ హుస్సేన్, లయన్స్ క్లబ్ సభ్యులు మహబూబ్ బేగ్, న్యాయవాదులు హరిక్రిష్ణ, అచ్చిరెడ్డి, వెలుగొండయ్య పాల్గొన్నారు.

ఉపాధి పనులను పరిశీలించిన ఏపీడీ

ఎర్రగొండపాలెం రూరల్ ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బోయలపల్లిలో జరుగుతున్న ఉపాధి పనులను మార్కాపురం ఏపీడీ నిర్మలాదేవి బుధవారం తనిఖీ చేశారు. పొలం వెంట కందకాలు, ఫారంపాండ్ల పనులను పరిశీలించారు. పని మేరకు కూలి చెల్లించాలని సూచించారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో పనులు త్వరగా ముగించుకోవాలన్నారు. వడదెబ్బకు గురికాకుండ సిబ్బంది .జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పనులకు వచ్చిన వారికి మాత్రమే మస్టర్ పేమెంట్ చేయాలని సిబ్బందిని ఏపీడీ ఆదేశించారు. అమె వెంట టీఏ లక్ష్మణ్, ఎఫ్ఏ కాశయ్య, సిబ్బంది ఉన్నారు.

ఏపీటీఏఎస్ఏ కార్యదర్శికి సన్మానం



వలిని సన్మానిస్తున్న ఎన్జీవో నాయకులు

మార్కాపురం రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : ఏపీటీఏఎస్ఏ ప్రకాశం జిల్లా జాయింట్ సెక్రటరీగా ఎన్నికైన సీనియర్ అకౌంటెంట్ ఎస్కే మస్తాన్ వలిని ఆయన కార్యాలయంలో బుధవారం ఎన్జీవో సంఘ నాయకులు సన్మానించారు. ఈ సంద వలి మాట్లాడుతూ ఏకగ్రీవ ఎన్నికకు సహకరించిన సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్‌కు, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ ఖాదర్, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏటీవో కెనడి, ఎన్జీవో నాయకులు శ్రీనివాస శాస్త్రి, రెవెన్యూ, మెడికల్, వెటర్నరీ, పంచాయతీరాజ్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



చెన్నరాయునిపల్లి వాసులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రాజమోహన్‌రావు

సైబర్ నేరాలపై అప్రమత్తం

మార్కాపురం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని టౌన్ ఎస్ఐ డాక్టర్ ఎం.రాజమోహన్‌రావు అన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు ముందస్తు చర్యల్లో భాగంగా బుధవారం పట్టణ పోలీసులు స్థానిక చెన్నరాయునిపల్లిలో పలు విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ నేరాలపట్ల ప్రజలు అవగాహన కలిగివుండాలని, అప్పుడే సైబర్ క్రైంను అరికట్టేందుకు వీలవుతుందన్నారు. నూతన ట్రాఫిక్ రూల్స్, మత్తు పదార్థాల వాడకం, బెల్టు షాపుల నిర్వహణ, సామాజిక రుగ్మతలు, తక్కువ వడ్డీకి డబ్బులు ఇచ్చి చేసే మోసాలపై అవగాహన, తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. వేసవికాలంలో ఆరుబయట నిద్రించేవారు ఇంట్లో డబ్బు, బంగారు ఆభరణాలను భద్రపర్చుకోవాలని ఎస్ఐ సూచించారు. కార్యక్రమంలో టౌన్ స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

వేసవి శిక్షణకు విశేష స్పందన



బీపేట : శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

గిద్దలూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా బుధవారం విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కథలు రాయడం, చెప్పడం నేర్పించారు. స్పోకెన్ ఇంగ్లీస్‌పై అవగాహన కల్పించారు. చెస్, క్యారమ్స్ ఆటల్లో మెళకువలను నేర్పించారు. వివిధ రకాల ఆటలను ఆడించారు. కార్యక్రమంలో గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి, శిక్షకులు పాల్గొన్నారు.

బేస్తవారపేట : గ్రంథాలయాల్లో జరుగుతున్న వేసవి శిక్షణ తరగతులకు విశేష స్పందన లభిస్తుందని గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు వేసవి తరగతులు నిర్వహిస్తున్నారు. బుధవారం 23 మంది విద్యార్థులు హాజరయ్యారు. డ్రాయింగ్ నేర్పించడం, కథలు చెప్పడం, ఇంగ్లీష్ గ్రామర్ నేర్పించడం వంటి కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గురుస్వామి, సుజాత పాల్గొన్నారు.

పెద్ద దోర్నాల : గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా బుధవారం విద్యార్థులకు పుస్తక పఠనం చేశారు. ఇంగ్లీష్‌లో రాయడం, చదవడం నేర్పించారు. అనంతరం చిత్రలేఖనం, నృత్యంలో కూడా శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు వెంకటసుబ్బారెడ్డి, ఫ్యాకల్టీలు ఆదిలక్ష్మీ, బాలంకమ్మ పాల్గొన్నారు.

మట్టి పరీక్షల తర్వాతే సాగు చేయాలి

పుల్లలచెరువు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : మట్టి పరీక్షల చేసిన తర్వాత పంటలను సాగు చేయాలని వ్యవసాయాధికారి పీ నిర్మలాదేవి అన్నారు. బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా పుల్లలచెరువు పొలాల్లో మట్టి నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మట్టి నమూనాలను ల్యాబ్‌కు పంపిస్తామని, వచ్చిన ఫలితాలను పరిశీలించి భూమిలో తక్కువైన ధాతు లోపాలను సరిచేయవచ్చునని అన్నారు. కార్యక్రమంలో వీఏఏలు నబేర్సబాను, మస్తాన్, రైతులు పాల్గొన్నారు.

పథకాలను మహిళలు వినియోగించుకోవాలి

కొమరోలు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పథకాలను వినియోగించుకొని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎంపీడీవో సయ్యద్ మస్తాన్ వలి అన్నారు. ఎస్‌బీఐ రోడ్డులో మహిళల కోసం నిర్వహిస్తున్న కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ఎంపీడీవో పరిశీలించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణను నేర్చుకొని తమకాళ్లపై తాము నిలబడాలని వలి సూచించారు. సొంతంగా చిన్నచిన్న వ్యాపారాలు చేసేవారికి బ్యాంకుల ద్వారా రుణాలు అందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం మండలంలోని నూరవారిపల్లి సచివాలయాన్ని ఎంపీడీవో పరిశీలించి పరిశుభ్రత, పచ్చదనంపై సూచనలు చేశారు.

గోడౌన్‌లో ఆకస్మిక సోదాలు

రూ.2,33,780లక్షల విలువైన ఎరువులపై స్టాప్‌సేల్

ఎర్రగొండపాలెం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : త్రిపురాంతక మండల కేంద్రంలో బుధవారం శ్రీ వెంకట సుబ్రమణ్యేశ్వర ట్రేడర్స్ ఎరువుల గోడౌన్‌ను విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మికంగా సోదాలు చేశారు. ఈ గోడౌన్‌లో వివిధ కంపెనీలకు చెందిన రూ.2,33, 780లక్షల విలువైన ఎరువుల బస్తాల నిల్వలకు అనుమతి పత్రాలు లేకపోవడంతో అధికారులు స్టాప్ సేల్ విధించారు. గోడౌన్‌కు తాళం వేశారు. ఈ తనిఖీలో జిల్లా విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రవిబాబు, విజిలెన్స్ వ్యవసాయాధికారి శివనాగప్రసాద్, కానిస్టేబుల్స్ రవి, చెన్నకృష్ణ, ఏవో నీరజ పాల్గొన్నారు.



ఎరువుల గోడౌన్‌లో తనిఖీ చేస్తున్న విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి



భూమి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

బేస్తవారపేట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలో పలు కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా కస్తూర్బా స్కూల్‌లోని జూనియర్ కళాశాలలో అదనపు తరగతులకు రూ.162.44 లక్షల నిధులు సమగ్ర శిక్షా అభియాన్ ద్వారా మంజూరు కాగా ఆభనవ నిర్మాణానికి అశోక్‌రెడ్డి భూమి పూజ చేశారు. ఈ ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలలో వసతుల కల్పన, పలు పథకాలను అమలు చేస్తోందన్నారు. విద్యార్థులు వినియోగించుకొని ఉన్నతంగా ఎదగాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. గాంధీ బజార్‌లోని ఇంజనీయరింగ్ కార్యాలయం వద్ద మరమ్మతులు చేసిన పశు వైద్యశాల భవనాన్ని ప్రారంభించారు. దర్గా గ్రామానికి వెళ్లే రహదారిలోని ఈద్గా వద్ద తాగు నీటి కోసం ఏర్పాటు చేసిన బోరును అశోక్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సోరెడ్డి మోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సత్యవతి, భూపాల్‌రెడ్డి, సత్యేలి కృష్ణ, సైదులు, రమేష్, ప్రేమానంద్, శ్రీనీశ్వరరెడ్డి, రోషన్, అనిత, మూప్పూరి రాము, తీగిరెడ్డి బూ పాల్‌రెడ్డి, దూదేకుల ఆదాం పాల్గొన్నారు.



గిద్దలూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్యవైశ్యులు



మార్కాపురం పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న బీసీ సంఘ నాయకులు

ఆర్యవైశ్యుల శాంతి ర్యాలీ

గిద్దలూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో పర్యాటకులపై జరిగిన దాడికి నిరసనగా, అలాగే ఈ దాడిలో అసువులు బాసిన వారికి నివాళులర్పిస్తూ ఆర్యవైశ్యులు కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. బుధవారం రాత్రి గాంధీబొమ్మ సెంటర్ నుంచి ప్రధాన వీధుల మీదుగా ర్యాలీ సాగింది. టెర్రరిస్టులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ మండల అధ్యక్షుడు సూరె నాగేశ్వరరావు, అమ్మవారిశాల అధ్యక్షుడు వాడకట్టు రంగసత్యనారాయణ, మాజీ అధ్యక్షుడు శివపురం ఆంజనేయులు, కోశాధికారి ముప్పూరి చంటి, టీడీపీ నాయకులు దమ్మాల జనార్దన్, నాగేశ్వరరావు, ఆర్యవైశ్య సంఘ నాయకుడు రామచంద్రుడు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మార్కాపురం రూరల్ : కాశ్మీర్‌లోని జరిగిన ఉగ్రవాదుల దాడికి నిరసనగా బీసీ సంఘం ఆధ్వర్యంలో బీసీ భవన్ ఉంచి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉగ్రవాదులు పర్యాటకులపై దాడి చేయడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీ కృష్ణారావు, పీఏల్‌పీ యాదవ్, దేవలూటి శంకర్, రాజయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసులు

ఉద్యోగులు బాధ్యతగా పనిచేయాలి

మార్కాపురం రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి). సచివాలయ ఉద్యోగుల తమ బాధ్యతగా పనిచేయాలని ఎంపీడీవో శ్రీనివాసులు సూచించారు. ఎస్సీ, బీసీ కాలనీల్లోని ద్వాక్రా బజారులో సచివాలయ ఉద్యోగులు, ఐసీడీఎస్ సిబ్బంది, డీఆర్‌డీఏ వెలుగు సిబ్బందితో కలిసి సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వ సర్వేలు సకాలంలో సమగ్రంగా చేయాలన్నారు. ఐ గాట్ కర్మయోగి, పీఆర్ 1 యాప్, సామాజిక పింఛన్‌ల పంపిణీ వాట్సాప్ గవర్నెన్స్ అంశాలపై సమీక్ష చేశారు. గ్రామాలలో పారిశుధ్యం ద్వారా సమస్యలు రాకుండా చూడాలని ఎంపీడీవో తెలిపారు. 2వ తేదీ నుంచి జూన్ 10 వరకు ప్రతి మంగళ, శుక్రారం కిశోర వికాసం సమావేశాలు నిర్వహించాలని ఐసీడీఎస్ సీడీపీవో సుశీలాదేవి తెలిపారు. సమావేశంలో వెలుగు ఏపీఎం పిచ్చయ్య, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో నాగరాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు అరుణకుమారి, లలిత సలోమి, వాసవి, ఎంఎస్‌కేలు, సచివాలయ ఉద్యోగులు, కార్యదర్శులు, వీఆర్‌వోలు, వీవోఏలు పాల్గొన్నారు.



వీరభద్రాపురంలో తొట్టె వద్ద నీరు తాగుతున్న పశువులు

పశువుల దాహార్తి తీర్చుతున్న తొట్లు

- మండలంలో మొత్తం 89 ఏర్పాటు
- 53 కుంటలు పూర్తి
- వివిధ దశల్లో ఉన్నవి 36

ఎర్రగొండపాలెం రూరల్ ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో వాగులు, కాలువలలో నీరు ఎండిపోతోంది. దీంతో మేతకు వెళ్లిన పశువులు, మేకలు, గొర్రెలు తదితర మూగజీవాలు తాగేందుకు నీరు లేక ఇబ్బందులు పడుతున్నాయి. దీనిని గుర్తించిన ప్రభుత్వం ఉపాధి హామీ పథకం నిధులతో మండలం వ్యాప్తంగా 19 పంచాయతీలకు మొత్తం 89 నీటి తొట్టెలను మంజూరు చేసింది. వాటిలో ఇప్పటికి 53 పూర్తి అయినట్లు ఏపీవో శైలజ తెలిపారు. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని నెలాఖరునాటికి పూర్తి చేయనున్నట్లు ఆమె తెలిపారు. గ్రామీణ ప్రాంతంలో ఉండే పశువులకు ఈ నీటి కుంటలు ఎంతో ఉపయోగపడనున్నట్లు అమె తెలిపారు. నీటి తొట్టెలలో నీరు నింపడం వలన మూగజీవాలు చక్కగా తాగుతున్నాయి. గ్రామీణ ప్రాంత రైతులు, పశువుల యజమానులు ఆనందం వ్యక్తం చేస్తూన్నారు. మిగిలినవి కూడా త్వరితగతిన పూర్తి చేయాలని ఆయా గ్రామ ప్రజలు, రైతులు, మూగజీవాల యజమానులు కోరుతున్నారు.

సాగర్ కాల్వలో చిల్లచెట్ల తొలగింపు

పనులు ప్రారంభించిన టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు



కాల్వ కట్టపై చిల్లచెట్ల తొలగింపు పనులు ప్రారంభిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు, అధికారులు

ఎర్రగొండపాలెం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : పుల్లలచెరువు, త్రిపురాంతకం మండలాలల్లో సాగర్ కాల్వకు ఇరువైపులా చ్లైచెట్లు, కంప తొలగింపు పనులను బుధవారం టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు ప్రారంభించారు. కొబ్బరికాయ కొట్టి ఎక్స్‌కవేటర్‌తో పనులు మొదలు పెట్టారు. ఈ సందర్భంగా ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో కాలువల అభివృద్ధిని విస్మరించారని ధ్వజమెత్తారు. కాల్వకు ఇరువైపులా చిల్లచెట్లు ఏపుగా పెరగడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయినా నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించారన్నారు. సాగర్ కాల్వ కింద భూములు ఉన్న రైతులు సమస్యను తెలుసుకున్న ఎరిక్షన్‌బాబు దీనిపై జలవనరులశాఖ ఇంజనీర్లను సంప్రదించి చిల్లచెట్ల తొలగింపు పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఇంజనీర్లు, టీడీపీ నాయకులు, సాగునీటి సంఘం అధ్యక్షులు దేవినేని చలమయ్య, పయ్యావుల ప్రసాద్, శనగా నారాయణరెడ్డి, సుబ్బారెడ్డి, మేడికొండ లక్ష్మీనారాయణ, మేకల వలరాజు, పొట్లగోవింద్ పాల్గొన్నారు.

డ్రాప్‌అవుట్ పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

దొనకొండ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో డ్రాప్‌అవుట్ పిల్లలను పాఠశాలల్లో చేర్పించేలా తల్లిదండ్రులను చైతన్యపర్చాలని ఎంపీడీవో శ్రీదేవి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం కిశోర వికాసం కార్యక్రమంపై జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వేసవిలో కిశోర వికాసం కార్యక్రమంలో నిర్వహించే సమ్మర్ క్యాంపులను బాలికలు సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ సుభాషిణి మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో 11 నుంచి 18 సంవత్సరాల కిశోర బాలికలను సర్వే చేసి వారిని గ్రూపులుగా విభజించి సమ్మర్ క్యాంపులు నిర్వహించేలా చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఎంఈవో సాంబశివరావు, ఆరోగ్యకేంద్రం సీహెచ్‌వో విన్యాసమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఫీల్డ్‌అసిస్టెంట్ చేయూత

దొనకొండ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకంలో పనులు చేపడుతున్న కూలీలు తాగునీటి సౌకర్యం లేకపోవటంతో ఎండకు దాహార్తితో అల్లాడుతున్నారు. దీంతో మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ వల్లపునేని కేశవ ఆగ్రామంలో ఉపాధి పనులు చేపడుతున్న కూలీలకు తాగునీరు అందుబాటులో ఉంచుకునేలా పది వాటర్ బబుల్స్ అందజేశారు. కేశవ దాతృత్వానికి ఉపాధి కూలీలు అభినందనలు తెలిపారు.

పామూరులో ఉచిత మజ్జిగ పంపిణీ

పామూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకు పెరుగుతున్న ఎండల తీవ్రత దృష్ట్యా పాదచారుల దాహార్తి తీర్చేందుకు మానవతా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు ఆసంస్థ అధ్యక్షుడు ఎం.ముసలయ్య పేర్కొన్నారు. స్థానిక పాత బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన ఉచిత మజ్జిగ కేంద్రాన్ని వాసవి దేవస్థాన అధ్యక్షుడు కోట నరసింహారావు బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పి.తిరుపతి రెడ్డి, నేరేళ్ల బాబురావు, తోట రమేష్, వి.వెంకటేశ్వరరెడ్డి, బీఎస్ రంగారెడ్డి, ఏ.మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో గస్తీ పెంచాలి

ముండ్లమూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రశాంత వాతావరణానికి భంగం కలగకుండా చూడాలని దర్శి సీఐ వై.రామారావు అన్నారు. బుధవారం స్థానిక పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ వేసవి కాలం ప్రారంభ మైనందున నేరాలు జరగకుండా ఉండేందుకు ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. రాత్రుల సమయంలో గస్తీలు పెంచాలన్నారు. రికార్డులు సక్రమంగా ఉంచాలన్నారు.

కొత్త వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తుంటే వెంటనే సిబ్బందికి తెలియజేయాలని ప్రజలకు సూచించారు. పాఠశాలలకు సెలవులు ఇచ్చినందున చెరువులు, వాగులు వద్దకు పిల్లలను పంపకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్ఐ హనుమంతరావు, రైటర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పాదచారుల దాహాన్ని తీర్చేందుకు చలివేంద్రాల ఏర్పాటు

తాళ్లూరు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): పాదచారుల దాహాన్ని తీర్చేందుకు ప్రభుత్వం అన్ని గ్రామాల్లో చలివేంద్రాలను ఏర్పాటుచేస్తుందని ఎంపీపీ తాటికొండ శ్రీను అన్నారు. తాళ్లూరులోని బస్టాండ్ సెంటర్‌లో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు.

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి ముగిసేవరకు చలివేంద్రాల్లో చల్లని నీటిని అందజేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ చార్లెస్ సర్జన్, జడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, ఎంపీడీవో దారా హనుమంతరావు, టీడీపీ మండల అధ్యక్షుడు బి.ఓబుల్‌రెడ్డి, ఐ.శ్రీనివాసరెడ్డి, మానం రమేష్‌బాబు, శాగం కొండారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మేడేను అంబేడ్కర్ డేగా జరపాలి

తాళ్లూరు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): కార్మికుల చట్టాల రూపశిల్పి అంబేడ్కర్‌ను గుర్తుంచుకునేలా మేడేను అంబేడ్కర్ డేగా జరపాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దారా అంజయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక అంబేడ్కర్ నగర్‌లో బుధవారం కార్మికులతో మాట్లాడారు. కార్మికుల కోసం రాజ్యాంగంలో అంబేడ్కర్ పొందుపరిచిన చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో బి.ప్రకాశం, రాజు, రవి, వెంకటేశ్వర్లు, మోషే తదితరులు పాల్గొన్నారు.

20నుంచి ఫొటోగ్రఫీపై ఉచిత శిక్షణ

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని రూడ్‌సెట్ సంస్థలో మే 20వ తేదీ నుంచి 30 రోజుల పాటు ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ శిక్షణకు ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగులు అర్హులన్నారు. ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు కలిగి ఉండాలన్నారు. శిక్షణ కాలంలో భోజనం, ఉచిత వసతి కల్పిస్తామని, ఇతర వివరాలకు 9573363141 సెల్‌నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

గిట్టుబాటు ధర కల్పనే ప్రభుత్వ లక్ష్యం

» మాజీ ఎమ్మెల్యే పాపారావు



దర్శిలో కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే పాపారావు, పాల్గొన్న ఏడీఏ బాలాజీనాయక్ తదితరులు

దర్శి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించటమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేస్తుందని మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు పేర్కొన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో బుధవారం నూతనంగా ఏర్పాటుచేసిన కందుల కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రైతులు ప్రైవేట్ వ్యాపారుల దోపిడీ వల్ల నష్టపోకుండా ఉండేందుకు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను, కందుల కొనుగోలు కేంద్రాలను అనేకచోట్ల ఏర్పాటు చేసిందన్నారు. కందుల క్వింటాకు కేంద్రప్రభుత్వం రూ.7550 మద్దతు ధర కల్పించిందన్నారు. ఆమేరకు అధికారులు కొను గోలు కేంద్రాల్లో కొనుగోలు చేయటం జరుగుతుం దన్నారు. రైతులు పండించిన పంటలు కేంద్రాల్లో విక్రయించి గిట్టుబాటు ధర పొందాలన్నారు.

కార్యక్రమంలో ఏడీఏ బాలాజీనాయక్, నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కె.వెలుగొండారెడ్డి, టీడీపీ నాయకులు సంగా తిరుపతిరావు, యాదగిరి వాసు, మారెళ్ళ వెంకటేశ్వర్లు, ఎన్.అంకయ్య, తెలుగు మహిళా నాయకురాలు శోభారాణి, గుర్రం ప్రసాద్, మానికొండ మల్లికార్జునరావు, త్రినాద్, రామగిరి తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని సభకు భారీగా తరలిరావాలి

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి పిలుపు



కనిగిరి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో శుక్రవారం జరిగే ప్రధాని నరేంద్రమోదీ బహిరంగ సభకు టీడీపీ శ్రేణులు పెద్దఎత్తున తరలి రావాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు సీఎం చంద్రబాబు సారథ్యంలో ప్రజా రాజధాని అమరావతి పనులు పునఃప్రారంభం కానున్నాయి. ఈ పనులను మోదీ చేతులమీదుగా ప్రార ంభించనున్నట్లు డాక్టర్ ఉగ్ర తెలిపారు. కనిగిరి నియోజకవర్గంలోని మారుమూల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, శ్రేణులు తరలిరావటంతో పాటు ప్రజలను వెంట పెట్టుకుని రావాలని కోరారు. రాష్ట్రంలోనే కనిగిరి ప్రాంతం నుంచి సభకు తరలివచ్చారనే పేరును తీసుకు రావాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. తెలుగుదేశం పార్టీ వార్డు అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్, బూత్, సెక్షన్ ఇన్‌చార్జ్‌లతో పాటు రాష్ట్ర, జిల్లా పార్టీ పదవుల్లో ఉన్న నాయకులు, తెలుగుమహిళలు ప్రధాని సభకు తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. అలాగే, గురువారం జరిగే పెన్షన్ పంపిణీలో కూటమి నాయకులు పాల్గొని లబ్ధిదారులకు అందజేయాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర పేర్కొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

» ఎంపీపీ అత్యాల జఘన్య



మండల సమావేశంలో గ్రామ సమస్యలపై అధికారులను ప్రశ్నిస్తున్న లక్ష్మక్కపల్లివాసులు

వీసీపల్లి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ అత్యాల జఘన్య అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. రోజురోజుకు ఎండతీవ్రతలు అధికమవుతున్న దృష్ట్యా ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా చర్యలు చేపట్టాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారి ప్రకాశరావు మాట్లాడుతూ ప్రభుత్వం 50శాతం రాయితీపై రైతులకు అవసరమైన యంత్ర పరికరాలను అందించేందుకు మండలానికి రూ.16.9 లక్షలు మంజూరు చేసిందన్నారు. వైద్యాధికారిణి డాక్టర్ మంజుల మాట్లాడుతూ వేసవిలో వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సాధ్యమైనంతవరకు ఎండకు బయటికి పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏపీవో జహంగీర్ మాట్లాడుతూ ఉపాధిహామీలో నిబంధనల మేరకు పనులు చేస్తే రూ.307 వేతనం పొందవచ్చునని చెప్పారు. గ్రామాల్లో ఎక్కువమంది పనులకు వెళ్లేలా ప్రజాప్రతినిధులు అవగాహన కల్పించాలన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి మండలంలో 300ఎకరాల్లో పండ్ల తోటలు పెంచుకునేందుకు అనుమతులు వచ్చాయన్నారు. విద్యుత్ శాఖ ఈఈ ఉమాకాంత్ మాట్లాడుతూ సోలార్ కనెక్షన్లు తీసుకునే వినియోగదారులకు పీఎమ్ సూర్యఘర్ కింద కేంద్రప్రభుత్వం రాయితీ ఇస్తుందన్నారు.

నోరుమెదపని ప్రజాప్రతినిధులు

మండల సర్వసభ్య సమావేశానికి వచ్చిన ప్రజాప్రతినిధులు తమ గ్రామాల్లో సమస్యలేమీ లేవన్నట్టుగా నోరు మెదపకుండా మిన్నకుండిపోయారు. అయితే, ఎంపీపీ జఘన్య ప్రాతినిధ్యం వహిస్తున్న లక్ష్మక్కపల్లి ప్రాదేశికంలోని ప్రజలు ఆగ్రామంలో నెలకొన్న సమస్యలపై అధికారులను నిలదీశారు. అధికారులు తమ శాఖలకు సంబంధించిన వివరాలను వెల్లడిస్తున్న సమయంలో లక్ష్మక్కపల్లి, అడివిలోపల్లికి చెందిన పలువురు సమావేశపు హాలులోకి వచ్చారు. మా గ్రామంలో ఉపాధి పనులు కల్పించలేదన్నారు. పశువులకు జబ్బుచేస్తే గ్రామీణ వైద్యసహాయకులు స్పందించి వైద్యం చేయడంలేదని అన్నారు. గ్రామంలో వీధి దీపాలు వెలగడంలేదని, పాఠశాలలో మరుగుదొడ్లు అధ్వాన్నంగా ఉన్నాయని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు.

దీనిపై స్పందించిన ఎంపీడీవో ప్రభాకరశర్మ వెంటనే సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో జడ్పీటీసీ లక్ష్మీకాంతం, వైస్ ఎంపీపీలు లక్ష్మీప్రసూన, బందారు రామక్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా సీపీఐ

» జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ



సీపీఐ జెండాను ఆవిష్కరిస్తున్న జిల్లా కార్యదర్శి నారాయణ తదితరులు

సీఎస్‌పురం(పామూరు), ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాలకు సీపీఐ అండగా ఉంటుందని ఆపార్టీ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ అన్నారు. సీఎస్‌పురంలోని బెల్లంకొండ కాలేజీలో బుధవారం జరిగిన సీపీఐ మండల మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అధికారంలోకి రావడానికి అనేక హామీలను ఇచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 నెలలు గడుస్తున్నా ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని ధ్వజమెత్తారు. వెంటనే సూపర్‌సిక్స్ పథకాలను అమలుపరచాలని డిమాండ్ చేశారు. జూన్‌లో సీపీఐ రాష్ట్ర మహాసభలు ఒంగోలులో జరగనున్నాయన్నారు. మే 28న కనిగిరి నియోజకవర్గ మహాసభ సీఎస్‌పురంలో జరుగుతుందన్నారు. ముందుగా సీపీఐ జెండాను నారాయణ ఆవిష్కరించారు.

సభలో నాయకులు సయ్యద్ మౌలాలి, సవరం రమేష్, యాసిన్, పి.ప్రభాకర్, ఎస్కే పెద మస్తాన్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకొన్నారు. సీపీఐ మండల కార్యదర్శిగా పెద మస్తాన్, సహాయ కార్యదర్శులుగా నరసింహులు, మౌలాలి, సీఎస్‌పురం పట్టణ కార్యదర్శిగా సవరం రమేష్, సహాయకార్యదర్శిగా నాయబ్‌రసూల్‌ను ఎన్నుకున్నారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ సుమన్

కారు బోల్తాపడి వ్యక్తి మృతి

సీఎస్‌పురం(పామూరు), ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కారు బోల్తాపడి వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం సీఎస్‌పురం మండలంలో చోటుచేసుకుంది. ఈక్రమంలో మండలంలోని అరివేముల గ్రామానికి చెందిన బాణాల కృష్ణ (40) అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ ఆర్.సుమన్ తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు తన కారులో పామూరు నుంచి సీఎస్‌పురంకు వెళతున్నాడు. ఈక్రమంలో మండలంలోని కంభంపాడు, కోవిలంపాడు గ్రామాల మధ్య కారు అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న బానాల కృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. భార్య నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ప్రమాదానికి కారణం అతివేగమేనని ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కనిగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

» ఎంపీపీ తాటికొండ శ్రీను



మాట్లాడుతున్న ఎంపీపీ తాటికొండ శ్రీను

తాళ్లూరు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని సచివాలయ ఉద్యోగులు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎంపీపీ తాటికొండ శ్రీను అన్నారు. బుధవారం స్థానిక ఎంపీపీ చాంబర్‌లో గ్రామపంచాయతీ కార్యదర్శులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సచివాలయాల ఉద్యోగులు బాధ్యతారాహిత్యంగా పనిచేస్తూ ప్రజలకు సకాలంలో సర్వీస్‌లు అందించటం లేదని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగుల పనితీరు మెరుగుపడి ప్రజలకు మంచి సేవలు అందించి మండలానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. పంచాయతీ ఉద్యోగులు గ్రామాల్లోని ప్రజాప్రతినిధులను సమన్వయ పరుచుకుని గ్రామాల అభివృద్ధికి బాటలు వేయాలన్నారు. గ్రామపంచాయతీల నిర్వహణలో కార్యదరులు అలసత్వం ప్రదర్శించక రికార్డులను క్రమపద్ధతిలో ఉంచాలన్నారు. ఉద్యోగులు బదిలీల సమయంలో గ్రామ పంచాయతీ రికార్డులను పూర్తిస్థాయిలో అప్పగించక పోవటంవల్ల సమస్యలు వస్తున్నాయన్నారు. ఏవైనా సమస్యలు ఉంటేఎంపీడీవో, ఈవోఆర్డీల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. అక్కడ పరిష్కారంకాకుంటే తమ దృష్టికి తీసుకొస్తే తగు చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల అభివృద్ధిపై కార్యదర్శులు దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో దారాహనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో రైతులకు మేలు

ముండ్లమూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షలతో రైతులకు ఎంతోమేలు జరుగుతుందని మండల వ్యవసాయాధికారి ఎండీ ఫరూక్ అన్నారు. బుధవారం మండలంలోని పులిపాడు, ఉల్లగల్లు గ్రామాల్లో భూసార పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని రైతుల తమ పొలాల్లో భూసార పరీక్షలు చేయించుకొని పంటలు సాగు చేసుకోవటం వల్ల ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. మండలంలో 17 రైతు సేవా కేంద్రాల్లో 935 మట్టి నమూనాలను సేకరించినట్లు చెప్పారు. కార్యక్రమంలో వీఏఏలు ప్రదీప్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



ఉల్లగల్లులో భూసార పరీక్షలు చేస్తున్న ఏవో ఫరూక్



పదో తరగతిలో ప్రతిభ కనపరచిన విద్యార్థులను సన్మానిస్తున్న అధికారులు

ప్రతిభ చూపిన విద్యార్థులకు సన్మానం

కురిచేడు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఇటీవల ప్రకటించిన పదో తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాలలో మండల స్థాయిలో ప్రతిభ కనపబరచిన విద్యార్థులను బుధవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఘనంగా సత్కరించారు. ఎంపీడీవో సతీష్ బాబు అధ్యతన జరిగిన సమావేశంలో ఎంపీపీ బెల్లం కోటేశ్వరమ్మ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మండల స్థాయి ప్రథమ స్థానాన్ని వేమా అశ్విని సాధించగా ఆమెకు మెమొంటోతోపాటు రూ.5 వేలు అందజేశారు. ద్వితీయ స్థానాన్ని సాధించిన షేక్ జాకీర్‌కు మెమొంటోతో పాటు రూ.3 వేల నగదు, తృతీయ స్థానంలో వచ్చిన వరికూటి లక్ష్మీతిరుపతమ్మకు మెమొంటోతో పాటు రూ.2 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో వస్రాం నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలికలను చదివించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మి

పామూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): బాలికల వికాసం కోసం సమాజంలోని ప్రతిఒక్కరూ సహకారం అందించాలని ఎంపీపీ గంగసాని లక్ష్మి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బాలిక సంరక్షణ అనే అంశంపై అంగన్‌వాడీ, ఆశా, ఆరోగ్య, మహిళా పోలీసులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ బాలికలను మంచిగా చదుకోనివ్వాలన్నారు. యుక్తవయస్సు రాకుండనే వివాహాలు చేయరాదన్నారు. అలా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకొనే అవకాశం ఉందని హెచ్చరించారు. ఎంఈవో కె.కరుణకుమారి మాట్లాడుతూ అతిగా సెల్‌ఫోన్‌లు వాడటం మంచిది కాదన్నారు. సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగిండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య, సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ, స్వయంకృషి సేవా సంస్థ అధ్యక్షుడు షేక్ నాయబ్‌రసూల్, అంగన్‌వాడీ, ఆశా, ఆరోగ్య మహిళా పోలీసులు పాల్గొన్నారు.

భైరవకోన దేవస్థాన షాపులకు వేలం

సీఎస్‌పురం(పామూరు), ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలో భైరవకోన దేవస్థానానికి సంబంధించి షాపుల వేలం పాటలు దేవదాయ, ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ సమక్షంలో బుధవారం వేలం పాటలు నిర్వహించారు. ఫలహారశాల నడుపుకోవడానికి రూ.లక్షా 54వేలు, క్యాసెట్లు, సీడీలు, పటాలు అమ్ముకోవడానికి రూ.లక్షా 98వేలు, కొబ్బరికాయలు, పండ్లు, పూలు, రవికలు, చీరెలు అమ్ముకోవడానికి రూ.14 లక్షల 5 వేలు, తదితర షాపులకు పాటదారులు పాల్గొని కైవసం చేసుకొన్నట్టు ఈవో వంశీకృష్ణారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ముప్పాళ్ల శ్యాంసుందర్ రాజు, జి.వెంకటరామరాజు, ఎం.శ్రీనివాసరాజు, ఎం.వెంకటరాజు, ఎం.శ్రీనివాసరాజు, ఆర్ .రాజేంద్రరాజు, తదితరులు పాల్గొన్నారు.

చోరీకి గురైన విగ్రహం అప్పగింత



అయ్యప్పస్వామి విగ్రహాన్ని అప్పగిస్తున్న వెంకటసుబ్బయ్య

పామూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాయిబాబా మందిరంలో గుర్తు తెలియని వ్యక్తులు వదిలివెళ్లిన అయ్యప్ప స్వామి పంచలోహ విగ్రహాన్ని దేవస్థాన చైర్మన్ పబ్బర్తి వెంకటసుబ్బయ్య బుధవారం సీఎస్‌పురంకు చెందిన గ్రంధి చంద్రకు అప్పగించారు. బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంతో సీఎస్‌పురం అయ్యప్ప దేవస్థానానికి చెందిన నిర్వహకుడు గ్రంధి చంద్ర పామూరులోని బాబా మందిరానికి వచ్చారు. సీఎస్‌పురంలో ఇరవై రోజులక్రితం గుడి తాళాలను పగులకొట్టి స్వామి విగ్రహాన్ని ఎత్తుకెళ్లారని, ఈవిషయంపై ఎక్కడా ఫిర్యాదు చేయలేదని గ్రంధి చంద్ర తెలిపారు. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంతో బాబా మందిరానికి వచ్చినట్టు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహకుడు గ్రంధి చంద్రకు బాబా మందిరం చైర్మన్ అయ్యప్పస్వామి విగ్రహాన్ని అప్పగించారు.

పౌరహక్కులపై అవగాహన కలిగిఉండాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ సంజీవరావు

తాళ్లూరు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): సమాజంలో అందరితో పాటు సమానంగా జీవనం సాగించే ఎస్సీలు తమకుగల పౌర హక్కులపై అవగాహన కలిగిఉండాలని తహసీల్దార్ కె.సంజీవరావు అన్నారు. బుధవారం సాయంత్రం శివరాంపురం ఎస్సీ కాలనీలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అంబేడ్కర్ కల్పించిన రిజర్వేషన్ ఫలాల వల్ల నేడు సమాజంలో అందరూ సమానంగా జీవిస్తున్నారన్నారు. ప్రతిఒక్కరూ తమ పిల్లలను చదివిస్తే జీవన విధానంలో మార్పులు వస్తాయన్నారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ ప్రశాంత్‌కుమార్, వీఆర్వో పి.చంద్రశేఖర్‌రావు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

కాగా, అధికారులు ముందస్తు సమాచారం ఇవ్వకపోవటంతో ఈ కార్యక్రమానికి పట్టుమని పది మంది రాక పోవటం గమనార్హం.

ఏగ్రేడ్ రిఫరీగా యాసిన్



అంతర్జాతీయ రిఫరీలు ఆపిచాట్, సామ్‌రుద్దీన్‌లతో యాసిన్

కనిగిరి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): జుజిట్సు కరాటే అసోసియేషన్‌లో ఏగ్రేడ్ రిఫరీగా కనిగిరి పట్టణానికి చెందిన కరాటే మాస్టర్ యాసిన్ ఎంపికయ్యారు. జుజుట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఉత్తరాఖండ్ హల్వానిలోని ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ స్టేడియంలో ఏప్రిల్ 22 నుంచి 28 వరకు జుజిట్సు నేషనల్ జడ్జి, రిఫరీ క్యాంపు జరిగింది. ఆంధ్రప్రదేశ్ నుంచి ఏపీ జుజిట్సు ప్రెసిడెంట్ షేక్ యాసిన్ పాల్గొన్నారు. యాసిన్ ఎంపిక పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

అవీ..ఇవీ..

విజయవంతంగా ముగిసిన నాటికలు



స్వేచ్ఛ నాటికలోని ఓ సన్నివేశం

చీరాల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : ఐదు రోజులుగా పట్టణం లోని కేజీఎం హైస్కూ ల్లో నిర్వహిస్తున్న కళాంజలి సాంస్కృతిక నాటికలు బుధవారంతో విజయ వంతంగా ముగిశాయి. చివరి రోజు బీరం వెంకట సుబ్బయ్య, పున్నమ్మ కళా వేదిక ఆధ్వర్యంలో స్వేచ్ఛ, మా ఇంట్లో మహా భారతం, నిర్వహించగా ప్రేక్షకులు విశేషంగా హాజరై ఆనందించారు. అంతకుముందు విశ్రాంత డీఎస్పీ బీరం నాగేశ్వరరావు, గీతారాణి దంపతులు జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమాలను ప్రారంభించారు. నాటికలు ఆహ్లాదాన్ని, ఆరోగ్యాన్ని అందిస్తాయని, అలాగే సంస్కృతి సాంప్రదాయాల విలువలు పెంచుతాయని నిర్వాహకులు వివరించారు.

సుగుణరావు చెప్పినవన్నీ అసత్యాలే

● ఖండించిన సీఐ శేషగిరిరావు

మార్టూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత అట్లూరి సుగుణరావు అసత్య ప్రచారంతో వీడియోని రిలీజ్ చేశారని, వాస్తవాలను తెలుసుకో కుండా అసత్య ప్రచారాలు చేశారని, సీఐ యం శేషగిరిరావు అన్నారు. బుధ వారం సీఐ ఒక ప్రకటన విడుదల చేశారు. గత నెల 28న సాయంత్రం మార్టూరులో స్థానికంగా అంబేద్కర్‌నగర్ లో దుడ్డు హరిబాబు, అదేవిధంగా అట్లూరి సుగుణరావు కుటుంబాల మధ్య బోరునీళ్ల పట్టుకునే విషయంపై కొట్లాట జరిగిందన్నారు. అందుకు సంబంధించి రెండు కుటుంబాలకు చెందిన వారి ఫిర్యాదుల మేరకు రెండు పరస్పర కేసులను నమోదు చేశా మన్నారు. కాని తన కేసును పోలీసులు నమోదు చేయలేదంటూ సుగుణ రావు చేతికి కత్తితో గాయం చేసుకొని, ఆత్మహత్యా ప్రయత్నం చేసినట్లు సోషల్ మీడియాలో వీడియో రిలీజ్ చేయడాన్ని సీఐ తీవ్రంగా ఖండించారు. చట్టపరంగా, చట్టపరిధిలో తాము అందరినీ సమానంగా చూస్తామన్నారు. ఉన్నత అధికారుల ఆదేశాలు మేరకు చట్టపరంగానే పనిచేస్తామన్నారు.

ఈసారి కందిపప్పు లేవు

ఐదు నెలల నుంచి నిలిచిన సరఫరా

నేటి నుంచి రేషన్ సరుకుల పంపిణీ

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకుల్లో ఈసారి కందిపప్పు పంపిణీ లేనట్టే. ప్రభుత్వం సరఫరా చేయకపోవడమే ఇందుకు కారణం. జిల్లాలో గురువారం నుంచి రేషన్ పంపిణీ జరగనుంది. ఈ రేష న్ బియ్యం పంపిణీ చేసేందుకు ఆ శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. జిల్లాలో 1,392 రేషన్ దుకాణాలు ఉండగా మొబైల్ వాహనాల ద్వారా సరు కులు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకున్నారు. 6.61 లక్షల రేషన్ కార్డులు ఉండగా అవసరమైన మేరకు బియ్యం, చక్కెరను దుకాణాలకు సరఫరా చేశారు. గత ఐదు నెలల నుంచి జిల్లాకు కందిపప్పు సరఫరా కావడం లేదు. దీంతో రేషన్ షాపుల ద్వారా కేవలం బియ్యం, చక్కెరకే పరి మితమయ్యారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కార్డుదారులకు కంది పప్పు ఇవ్వని పరిస్థితి ఏర్పడింది. అయితే రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చాక బియ్యం, పంచదార, కందిపప్పుతో పాటు చిరు ధాన్యాలను కూడా సరఫరా చేస్తామని ప్రకటించారు. ప్రభుత్వం వచ్చిన కొత్తలో కందిపప్పుతో పాటు జొన్నలు కూడా ఇచ్చారు. దీంతో కార్డుదారులు ఇక నుంచి తమకు అన్నిరకాల వస్తువులు తక్కువ ధరకు దొరకుతాయని భావించారు. నవం బరులో 70శాతం కందిపప్పును జిల్లాకు కేటాయించగా, డిసెంబరులో అసలు జిల్లాకు కేటాయించ లేదు. జనవరి, ఫిబ్రవరి నెలల్లో కూడా అదే పరిస్థితి నెలకొంది. తాజాగా మే 1వ తేదీ నుంచి జిల్లాలో రేషన్ పంపిణీ ప్రారంభమవుతుండగా ప్రభుత్వం జిల్లాకు కేవలం బియ్యం, చక్కెరను మాత్రమే సరఫరా చేసింది.

కొలిక్కిరాని కసరత్తు

టీచర్ల పునర్విభజనపై కుస్తీ.. రకరకాల సవరణలతో తలనొప్పి

ఒంగోలు విద్య, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని ఉపాధ్యా యుల పునర్విభజన ప్రక్రియ ఇంకా కొలిక్కి రాలేదు. జిల్లాలోని 3,048 పాఠ శాలల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ పూర్తికాగా టీచర్ల కేటాయింపు విష యంలో ఇంకా కుస్తీ పడుతున్నారు. టీచర్ల పునర్విభజనకు సంబంధించి విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పష్టమైన మార్గదర్శకాలు రాతపూర్వకంగా జారీ చేయకుండా రోజు వెబెక్స్ సమావేశంలో రకరకాల సవరణలు చెప్తుం డటంతో క్షేత్రస్థాయిలో అధికారులు ఏం చేయాలో తెలియక తలలు పట్టు కుంటున్నారు. రోజూ ఒంగోలు నుంచి కమిషనర్ కార్యాలయానికి క్యూ కడు తున్నా ఆశించిన మేర పురోగతి లేదు. బుధవారం కమిషనర్ కార్యాలయా నికి వెళ్లిన డీఈవో కిరణ్‌కుమార్ ఇతర సిబ్బంది టీచర్ల పునర్విభజనను మమఅనిపించి నివేదించారు. అయితే టీచర్ల కేటాయింపుల్లోని తప్పులను కమిషనర్ కార్యాలయ సిబ్బంది ఎత్తిచూపి డీఈవో సమర్పించిన ప్రతిపాద నలను వెనక్కు పంపారు. తప్పులతడకలుగా ప్రతిపాదనలు సిద్ధం చేస్తుం డటం పట్ల వారు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. బుధవారం ఎంత రాత్రైనా జాబితాల్లోని తప్పులు సవరించి కచ్చితమైన జాబితాలను సంతకా లతో సమర్పించిన తర్వాతే వెళ్లాలని కమిషనర్ కార్యాలయం హుకుం జారీ చేసింది. దీంతో ఇక్కడి నుంచి వెళ్లిన అధికారులు, సిబ్బంది తప్పులను సవ రించడంలో తలమునకలవుతున్నారు.

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమ్మెబాట

సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్ వద్ద ఆందోళన



నిరసన తెలుపుతున్న ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఉద్యోగులు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం కలెక్టరేట్ ఎదుట నిరవధిక సమ్మెను ప్రారంభిం చారు. జిల్లాలోని 538 కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు ఈ సమ్మెలో పాల్గొ న్నారు. కలెక్టరేట్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్లు మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు మాట్లా డుతూ బీఎస్సీ నర్సింగ్ నుంచి పీహెచ్‌డీ వరకు ఉన్నత విద్య చదివి నప్పటికీ వారు చేస్తున్న ఉద్యోగానికి భద్రత లేదన్నారు. ఒక నిర్దిష్ట మైన పనిలేకుండా రకరకాలుగా పనులు చేయిస్తూ పనిభారం పెంచడం సిగ్గు చేటన్నారు. ఉద్యోగులకు వెంటనే పనిభారం తగ్గించా లని డిమాండ్‌చేశారు. కేంద్రం ఇచ్చిన ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఆరేళ్లు పనిచేసిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లను రెగ్యూలర్ చేయాలని డిమాండ్‌చేశారు. ఎన్‌ఎంహెచ్ ఉద్యోగులతో సమానంగా 23శాతం ఇంక్రిమెంట్ ఇచ్చివేతనాలు చెల్లించాలన్నారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో ఓపీ దగ్గర నుంచి రోగులకు బీపీ, షుగర్, చిన్న పిలలలకు క్యాన్సర్ పరీక్షలతో పాటు అనేక రకాల వైద్యుల సలహాలు, సౌకర్యాలు అందించడంలో కీలకపాత్ర పోషిస్తున్నారనితెలిపారు. యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కోశాధికారి జి.నాగేశ్వరరావు మాట్లాడుతూ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్‌చేశారు. ఈకార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎం రాజేష్, ఎ. నిర్మల, జీవనజ్యోతి, ప్రసన్న, సయ్యద్ గౌస్ తదితరులు ఉన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు కృషి

● సబ్‌స్టేషన్‌కు భూమి పూజ కార్యక్రమంలో మంత్రి రవికుమార్ ● వ్యవసాయానికి, గృహ వినియోగానికి వేర్వేరుగా లైన్ల ఏర్పాట్లు



భూమిపూజ చేస్తున్న మంత్రి రవికుమార్

అద్దంకి, ఏప్రిల్30 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విద్యుత్ సరఫరా కూటమి ప్రభుత్వ ధ్యేయం అని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. అద్దంకి పట్టణంలో ఎన్ఎస్‌పీ కాలనీలో రూ.6.73 కోట్లతో సెమీఇండోర్ సబ్‌స్టేషన్, ద్వారకానగర్‌లో రూ.4.50కోట్లతో అవుట్‌డోర్ సబ్‌స్టేషన్ల నిర్మాణం, శింగరకొండ రోడ్డులో రూ.2.25 కోట్లతో అగ్నిమాపక కేంద్రం నిర్మాణానికి విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ బుధవారం శంకుస్థాపన చేశారు. అద్దంకి పట్టణ టీడీపీ కమిటీ ఆధ్వర్యంలో సమకూర్చిన రూ.1.50 లక్షల విలువైన డ్రోన్ కెమెరాను మంత్రి రవికుమార్ ద్వారా సీఐ సుబ్బరాజుకు అందజేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ అద్దంకి పట్టణంలో ఏ చిన్న ఘటన చోటుచేసుకున్నా, గుర్తించే విధంగా నాణ్యమైన సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు. దొంగతనాలు జరగకుండా నిఘా పెంచడంతో పాటు పాత దొంగతనాలలో సొత్తు రికవరీపై కూడా దృష్టి పెట్టాలన్నారు. పట్టణాలతో పాటు గ్రామాలలో కూడా నాణ్యమైన విద్యుత్ సరఫరాకు, వ్యవసాయానికి నిరంతరాయంగా విద్యుత్ సరఫరాకు ప్రత్యేకంగా విద్యుత్‌లైన్లు ఏర్పాటు చేస్తున్నా మన్నారు. అద్దంకి పట్టణంలో పెరుగుతున్న విద్యుత్ వినియోగానికి తగ్గట్లు అదనంగా రెండు సబ్‌స్టేషన్లు నిర్మిస్తున్నట్ల తెలిపారు. 4 నెలలలో సబ్‌స్టేషన్ల నిర్మా ణం పూర్తి చేయాలన్నారు. అద్దంకి పట్టణంలో ఇప్పటికే అత్యధిక శాతం పాత స్తంభాల స్థానంలో కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మిగిలిన వాటిని కూడా త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. వచ్చే వ్యవసాయ సీజన్ నాటికి పెండింగ్‌లో ఉన్న అన్ని వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేస్తామ న్నారు. అద్దంకి నియోజకవర్గంలో ఏల్చూరులో 132 కేవీ సబ్‌స్టేషన్, కొప్పరం, మల్లాయపాలెంలలో 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లు మంజూరయ్యాయన్నారు. డిమాండ్ ఉన్న అన్ని ప్రాంతాలలో విద్యుత్ సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేయటం జరుగుతుందన్నారు.

పీఎం మోదీ సభకు తరలిరావాలి



పోలీసులకు డ్రోన్ కెమెరాలు అందజేస్తున్న టీడీపీ నాయకులు

అమరావతి పునర్నిర్మాణం కోసం మే 2న జరిగే ప్రధానమంత్రి మోదీ సభకు అద్దంకి నియోజకవర్గం నుండి పెద్దఎత్తున కూటమి నేతలు, కార్యకర్తలు తరలి రావాలని మంత్రి రవికుమార్ పిలుపునిచ్చారు. బుధవారం అద్దంకిలో అద్దంకి నియోజకవర్గ నాయకు లు, కార్యకర్తలతో మంత్రి రవికుమార్, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట కోటేశ్వరరావులు సమావేశం నిర్వహించారు. మోదీ సభకు వచ్చేందుకు నియోజకవర్గానికి 70 బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలి పారు. అధికారులు, నాయకులు సమన్వయం తో పనిచేసి సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగ కుండా చర్యలు చేపట్టాల న్నారు.

ప్రజల నుండి అర్జీలు స్వీకరణ..

ప్రజాసమస్యల పరిష్కార వేదికలో భాగంగా బుధవారం మంత్రి రవికుమార్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. బెంగళూరు గ్రీన్‌ఫీల్డ్ హైవేలో భూమి కోల్పోయిన రైతులకు ఇంకా పరిహారం చెల్లించలేదని రావూరి రంగయ్య మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి అద్దంకి, పంగులూరు మండలాల పరిధిలో ఇంకా పరిహారం అందని 100 మంది రైతులకు వెంటనే పరిహారం చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. నాగులపాడు రోడ్డు వద్ద 16 అడుగుల ఎత్తులో అండర్‌పాస్ నిర్మాణం చేయడం వల్ల ఇబ్బందులు వస్తాయని, 22 అడుగుల ఎత్తుకు పెంచాలని శ్రీనివాసరావు కోరారు. ఆర్‌వో ప్లాంట్ లు, అంతర్గత సీసీ రోడ్లు, సైడ్‌డ్రైన్ లు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు తదితర సమస్యలను మంత్రి దృష్టికి తీసుకు రాగా వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను రవికుమార్ ఆదేశించారు. కార్య క్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట కోటేశ్వరరావు, విద్యుత్ ఎస్ఈ ఆంజనేయులు, ఈఈ నల్లూరి మస్తాన్‌రావు, అద్దంకి అగ్నిమాపక అధికారి వెంకట్రావు, తహసీల్దార్ శ్రీచరణ్, మున్సిపల్ కమిషనర్ రవీంద్ర, ఎంపీడీవో శింగయ్య, విద్యుత్ డీఈ దామోదరం, ఏఈలు ఎన్.శ్రీనివాసరావు, శివప్రసాద్, బాలకోటేశ్వరరావు, షైలా శ్రీనివాసరావు, కౌన్సిలర్లు కొమ్మాలపాటి సుధీర్, అత్తులూరి రమేష్, యేజెండ్ల నాగరాజు, కంపా రజనీ, తిరుపతమ్మ, సుభాషిణి, టీడీపీ నేతలు నాగినేని రామకృష్ణ, కరి పరమేష్, కాకాని అశోక్, కుందారపు రామారావు, మానం మురళీమోహన్‌దాస్, కోనేటి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

చీరాల మునిసిపల్ చైర్మన్ అవిశ్వాసంలో మరో ట్విస్ట్

జంజనం శ్రీనివాస్ చేరికతో మారుతున్న సమీకరణలు

చీరాల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : చీరాల మునిసిపల్ చైర్మన్ అవిశ్వాసం అంశంలో బుధవారం మరో ట్విస్ట్ చోటుచేసుకొంది. అమరావతి సచివాలయంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ఆధ్వర్యంలో చైర్మన్ జంజనం శ్రీనివాసరావు టీడీపీ పార్టీలో చేరారు. జంజనంకు నేతలు పార్టీ కండువాతో స్వాగతించారు. గత బుధవారం టీడీపీ కౌన్సిలర్లు జిల్లా కలెక్టర్ వెంకట మురళీని కలిసి జంజనంపై అవిశ్వాసంకు తీర్మానం చేశారు. ఈ నేపద్యంలో అధికారులు మే 14న బలపరీక్షకు నోటీసులు కూడా అంద జేశారు. ఇదిలా ఉండగా రెండు రోజుల క్రితం పట్టణ అధ్యక్షులు గజవల్లి శ్రీనివాసరావు సైతం అవిశ్వాసం అవసరం లేదంటూ మరో అర్జీను కలెక్టర్‌కు అందజేశారు. దీంతో గజవల్లిపై నియోజకవర్గ క్యాంపు కార్యాలయం సైతం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ క్రమంలో రోజుకో మలుపు తిరుగుతున్న మునిసిపల్ అంశం బుధవారంతో కొత్త దారులు పట్టింది. అయితే బల నిరూపణ అనివార్యం కానుండగా, ఆ రోజు చైర్మన్‌ను ఎమ్మెల్యే కొండయ్య వర్గం అంగీకరిస్తే అనుకూలంగా స్పందించాల్సి ఉంటుంది. లేదా ఆ రోజు పరీక్షకు గైర్హాజరు కావాల్సి ఉంటుంది. ఇదిలా ఉంటే పూర్తిగా ఆమంచి ఆలోచనను తిప్పి కొట్టేందుకే మాజీ ఎమ్మెల్యే బలరాం వ్యూహంతోనే జంజనం టీడీపీ పార్టీ తీర్థం పుచ్చుకున్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. దీంతో ఆ అవకాశాన్ని జంజనం కూడా సద్వినియోగం చేసుకున్నట్లు అంచనా. ఏది ఏమయినా కొండయ్య కూడా మొట్టమొదటి నుండి జంజనంపై సానకూలంగానే ఉండటంతో పాటు, ఆయన రాజకీయ ప్రస్థానం కూడా టీడీపీతోనే కావడంతో అందరూ దీనిపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగా చోటుచేసుకొన్న పరిణామాలతో ఇక ఇప్పటికే పాపికొండల పర్యటనలో కౌన్సిలర్లు నేడు చీరాలకు చేరనున్నట్లు సమాచారం.

అమరావతి.. అష్టదిగ్బంధనం

(5వ పేజీ తరువాయి)

డీఎస్పీలు భద్రత ఏర్పాట్లలో క్షణం తీరికలేకుండా విధుల్లో నిమగ్నమయ్యారు. ప్రధాని రోడ్ షో, పాల్గొనే సభా వేదిక, శంకుస్థాపన చేసే పైలాన్ ప్రాంతాలను పోలీసు బలగాలు అదుపులోకి తీసుకుని పహారా కాయడమే కాకుండా అనుక్షణం తనిఖీలు నిర్వహిస్తున్నాయి. ప్రధాని పర్యటనకు సంబంధించిన పూర్తి భద్రతా ఏర్పాట్లను ఎస్పీజీ పర్యవేక్షణలోనే నిర్వహిస్తున్నారు. ప్రత్యేక విమానంలో ప్రధాని మోదీ అడుగుపెట్టే గన్నవరం విమానాశ్రయం నుంచి రాజధాని ప్రాంతంలో పర్యటించే ప్రాంతాలన్నింటిలో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా బుధవారం నిర్వహించిన అనధికార ట్రయల్ రన్ ఎటువంటి ఘటనలకు ఆస్కారం లేకుండా సజావుగా ముగియడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. కాగా గురువారం ట్రయల్‌రన్ నిర్వహించనున్నారు.

తనిఖీలు... సోదాలు

ప్రధాని పర్యటన దృష్టిలో ఉంచుకుని కేంద్ర, రాష్ట్ర హోం శాఖల పరిధిలో అన్ని పోలీసు విభాగాలు రంగంలోకి దిగాయి. ఎస్పీజీ నేతృత్వంలో రాజధాని ప్రాంతాన్ని ఆయా బలగాలు జల్లెడ పడుతున్నాయి. రాజధాని గ్రామాల్లో అడుగుపెట్టే సాధారణ వ్యక్తులను కూడా వదలకుండా తనిఖీలు చేస్తున్నారు. ప్రధాని సభ జరిగే వెలగపూడి ప్రాంతానికి సుమారు 25 కిలో మీటర్ల పరిధి నుంచే చెక్‌పోస్టులు, పికెట్లు ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక బలగాలను రంగంలోకి దించారు. రాజధాని ప్రాంతానికి వచ్చే అన్ని రోడ్లలో పోలీసులు మోహరించాయి.

ఏర్పాట్లు పరిశీలించిన నారాయణ

వెలగపూడి సచివాయం సమీపంలో ఏర్పాటు చేసిన ప్రధాని బహిరంగ సభ, వేదిక వద్ద ఏర్పాట్లను పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ, గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మి బుధవారం వేర్వేరుగా పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లపై పోలీసు ఉన్నతాధికారులతో వారు మాట్లాడారు. వేదిక వెనుక అమరావతి పనులకు శంకుస్థాపన స్థూపం(పైలాన్) పనులను మంత్రి పరిశీలించారు. ఐజీ సర్వశ్రేష్ఠత్రిపాఠి, ఎస్పీ సతీష్‌కుమార్, ప్రధాని సభ కార్యక్రమ నోడల్ అధికారి వీరపాండ్యన్ ఉన్నారు.

ఉమ్మడి ప్రకాశం జిల్లా బీచ్ కబడ్డీ జట్టు ఎంపిక

చినగంజాం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి) : చిన్నగంజాంలోని మాగుంట సుబ్బరామిరెడ్డి జూనియర్ కళాశాల ఆవరణలో ఉమ్మడి ప్రకాశం జిల్లా బీచ్ కబడ్డీ జట్టును బుధవారం ఎంపిక చేసినట్లు కోచ్ ఎం.గిరిబాబు తెలిపారు. ఈ నెల 20వ తేదిన జిల్లా బీచ్ కబడ్డీ జట్టుకు 15 మంది ప్రాబబుల్స్‌ను ఎంపిక చేసి కళాశాల ఆవరణలో ఈ నెల 21వ తేది నుండి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణలో ప్రతిభ చూపిన ఆరుగురు క్రీడాకారులను తుది జట్టుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. మే నెల 2, 3, 4 తేదీలలో కాకినాడలో జరిగే 12వ అంతర్ జిల్లాల బీచ్ కబడ్డీ ఛాంపియన్ షిప్ పోటీలలో ఎంపికైన ఉమ్మడి ప్రకాశం జిల్లా బీచ్ కబడ్డీ జట్టు పాల్గొన్నట్లు తెలిపారు. జట్టు సభ్యులకు డాక్టర్ నల్లూరి సుబ్బారావు క్రీడా దుస్తులను అందజేసినట్లు తెలిపారు. బీచ్ కబడ్డీ



ఎంపికైన ఉమ్మడి ప్రకాశం జిల్లా జట్టు

పోటీలలో జిల్లా జట్టు ప్రతిభ చూపి జిల్లాకు మంచి పేరు తేవాలని ఎస్.ఐ శీలం రమేష్ అన్నారు. ఎంపికైన కీడాకారులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జాతీయ కబడ్డీ క్రీడాకారులు, హెడ్ కానిస్టేబుల్ పి.రామలింగేశ్వరారవులు పాల్గొన్నారు. ఎంపికైన జిల్లా బీచ్ కబడ్డీ జట్టు 1.) ఎన్. ఉమామహేశ్వరావు(కెప్టెన్, సోపిరాల), బి.సురేష్‌రెడ్డి (మూలగానివారిపాలెం), వై.రాజశేఖర్‌రెడ్డి(జాండ్రపేట), పి.బ్రహ్మారెడ్డి, జి.లక్ష్మారెడ్డి, ప్రసాద్‌రెడ్డి(రాజుబంగారుపాలెం), కోచ్ ఎం.గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

అమ్మా.. నిద్రలేమా..!

● తల్లి మృతదేహం వద్ద చిన్నారుల ఆర్ధత పిలుపు

● రెండేళ్ల క్రితం తండ్రి మృతి



తల్లిమృతదేహం ముందు విషన్నవదనంతో నిలుచున్న చిన్నారులు

మద్దిపూడి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : వారు ముగ్గురూ చిన్నారులు. ఒక తల్లి బిడ్డలు. మంచంపై విగతజీవిగా ఉన్న తల్లి చనిపోయిందని కూడా ఆ పసి మనసులకు తెలీదు. తల్లి భూజాన్ని తడుతూ 'అమ్మా.. నిద్రలేమ్మా.. ఆకలవుతోంది' అని పదేపదే పిలుస్తూ ఉన్న ఆ చిన్నారులను చూసి అక్కడున్న వారంతా చలించిపోయారు. కన్నీటి చుక్కను చిందించారు. మండల కేంద్రమైన మద్దిపూడిలో బుధవారం హృదయవిదారక ఘటన చోటుచేసుకుంది. కాలనీకి చెందిన కోండ్రు షడ్రక్, మౌనిక(29)లకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. అరవింద్, మేషక్, రూపిక.. ముగ్గురూ చిన్నారులే. వీరిది నిరుపేద కుటుంబం. ఏజుకారోజు కూలి చేసుకుని జీవనం గడపాలి. 2023 ఏప్రిల్‌లో కోండ్రు షడ్రక్ తీవ్ర అనారోగ్యంతో కన్నుమూశారు. కూలి చేసుకుంటూ మౌనిక తన పిల్లలను పోషించుకుంటోంది. ఆమె కూడా అనారోగ్యంతో బుధవారం కన్నుమూశారు. ఆమె శాశ్వతనిద్రలోకి వెళ్లినట్లు తెలీని ఆ పసిబిడ్డలు తల్లి దగ్గరకెళ్లి లేపే ప్రయత్నం చేయడం చూపరులకు కంటతడి పెట్టించింది. అనాథలైన ఆ అమాయకపు పిల్లలు ఎలా బతకాలో అని సమీప బంధువు గజ్జా దానమ్మ రోదించింది. టీడీపీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు గురజాల పోలయ్య, తెలుగు యువత నాయకులు రాజు, సురేష్, ప్రసాదు మాదిగ, జర్నలిస్ట్ ఫోరమ్ అధ్యక్షుడు బాబురావు.... మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. మౌనిక కుటుంబాన్ని ఆదుకునేందుకు మంత్రి స్వామి, మారిటైంబోర్డ్ చైర్మన్ సత్యల కలిసి ప్రభుత్వం, పార్టీ పరంగా సహాయం అందించేందుకు కృషి చేస్తామన్నారు.

బతిమలాడి..అజెండాకు ఆమోదం

సాదాసీదాగా ముగిసిన కౌన్సిల్ సమావేశం



మాట్లాడుతున్న చైర్మన్ బాలమురళీకృష్ణ

మార్కాపురం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రతి నెలాఖరులో మున్సిపాలిటీలో అభి వృద్ధి కార్యక్రమాల నిర్వహణ, సమస్యలను తెలియజేసేందుకు సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించడం పరిపాటి. అక్కడ ముందుగా అభివృద్ధి కార్యక్రమాలతో రూపొందించిన అజెండాపై, ప్రజల సమస్యలపై చర్చించి కౌన్సిల్‌లో ఆమోదంతో పను లు చేపడతారు. కానీ బుధవారం మున్సిపాలిటీలో జరిగిన సాధారణ సమావేశానికి కౌన్సిలర్లు ముఖం చాటేశారు. సాయంత్రం 4.00 గంటలకు సమావేశం ప్రారంభంకావాల్సివున్నా పట్టుమని పది మంది కూడా హాజరుకాలేదు. దీంతో చైర్మన్ చిర్లంచర్ల కృష్ణ పలువురు కౌన్సిలర్లకు ఫోన్ చేసి బతిమలాడి సమావేశానికి పిలిపించుకున్నారు. కోరం సరిపోయేంతమంది కౌన్సిలర్లు 14 మంది 5.00 గంటలకు చేరుకున్నాక 23 అభివృద్ధి అంశాలతో కూడిన అజెండాను ఆమోదింపజేసుకుని మమ అనిపించారు.

ముఖం చాటేసిన కౌన్సిలర్లు

మార్కాపురం మున్సిపాలిటీలో మొ త్తం 35 మంది కౌన్సిలర్లకుగాను ఒక రు చని పోగా, 34 మంది ఉన్నారు. అధికార, ప్రతిప క్షానికి ప్రస్తుతం సమానంగా కౌన్సిలర్లు ఉన్నారు. ప్రతిపక్షానికి చెందిన వాళ్లు సమావేశానికి గైర్హాజరైనా అధికార పక్షానికి చెందిన 17 మంది హాజరైనా కోరం సరిపోతుంది. కానీ చైర్మన్ కృష్ణ పట్ల అధికార పక్షాని కి చెందిన కౌన్సిలర్లు అసంతృప్తితో ఉన్నారు. తమకు సరైన ప్రాధాన్యత ఇవ్వడంలేదనేది వారి వాదన. అంతేకా క వైసీపీ తరపున గెలిచి టీడీపీలో చేరి న కౌన్సిలర్లు కూడా బుధవారం సమావేశానికి హాజరుకాలేదు. కొందరు కౌన్సిలర్లు వారి సమస్యలను తెలియజేసేందుకు మాత్రమే వచ్చారు. చివరికి గత్యంతరం లేని పరిస్థితుల్లో చైర్మన్ పలువురు కౌన్సిలర్లకు ఫోన్ చేసి రావాలని కోరారు. గంట ఆలస్యం తర్వాత కోరంకు సరిపోయేంత మంది హాజరరుకావడంతో అజెండాను ఆమోదించుకున్నారు.

అక్రమ లే-అవుట్లపై ఎందుకు చర్యలు తీసుకోవడంలేదు

పట్టణంలో మున్సిపాలిటీ అనుమతులు లేకుండా వేసిన అక్రమ లేఅవుట్లపై ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని చైర్మన్ చిర్లంచర్ల కృష్ణ అధికారులను ప్రశ్నించారు. ఇప్పటికే అక్రమ లేఅవుట్లను గుర్తించి ఓ పత్రికలో వాటి వివరాలను ప్రచురించినా వాటికి సంబంధించి క్రయవిక్రయాలు యథేచ్ఛగా జరుగుతూనే ఉన్నాయన్నారు. ఎలాంటి చర్యలు తీసుకోనప్పుడు పత్రికల్లో ప్రచురించడం ఎందుకని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణానికి సాగర్ నీటిని అందించే పైప్‌లైన్ పనులు దూపాడు సమీపంలో సంవత్సర కాలంగా నిలిచిపోయాయని వాటిని వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కాంట్రాక్ట్ సంస్థ పట్టించుకోకుంటే పనులు క్యాన్సిల్ చేయడమో, వారికి నోటీసులు ఇవ్వడమో త్వరగా చేయాలన్నారు. గత సంవత్సరం పట్టణంలో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు ప్రభుత్వం నుంచి రాకపోవడంతోనే ఈ సంవత్సరం రవాణా చేసేందుకు ఎవరూ ముందుకు రావడంలేదన్నారు. 22, 29వ వార్డుల కౌన్సిలర్లు పలు సమస్యలపై వినతిపత్రం అందజేయడంతో వాటిని టేబుల్ అజెండాలో చేర్చారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణ రావు, డీఈ లక్ష్మీనారాయణ, మేనేజర్ శ్రీనివాసన్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రధానమంత్రి పర్యటనతో ట్రాఫిక్ మళ్లింపు

● రేపు ఉదయం 5 నుంచి రాత్రి 10 వరకు ఆంక్షలు

ఒంగోలు క్రైం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ అమరావతిలో పర్యటన కారణంగా శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు ట్రాఫిక్ మళ్లించాలని రాష్ట్ర డీజీపీ కార్యాలయం నుంచి ఆదేశాలు ఇచ్చారు. ఈ మేరకు చెన్నయ్ నుంచి విజయవాడ మీదగా విశాఖపట్నం వెళ్లే వాహనాలను ఒంగోలులోని త్రోవగుంట వద్ద నుంచి చీరాల వైపు మళ్ళిస్తారు. అదేవిధంగా విశాఖపట్నం నుంచి చెన్నయ్ వైపు వెళ్లే వాహనాలు కూడా అదే మార్గంగా తరలిచాలని ఆదేశాలు అందాయి. మల్టీ-యాక్సిల్ గూడ్స్ వాహనాలు చెన్నయ్ నుంచి విశాఖపట్నం వెళ్లే వాహనాలు ఒంగోలు, చిలకలూరిపేట వద్ద నిలిపివేస్తారు. ఆయా వాహనాలు శుక్రవారం రాత్రి 9 గంటల తరువాత ముందుకు వెళ్లేందుకు అనుమతి ఇస్తారు. ట్రాఫిక్ మళ్ళింపు ఈనెల 2న ఉదయం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు అమలు చేస్తారని డీజీపీ కార్యాలయం నుంచి ఓ ప్రకటన బుధవారం విడుదల చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ప్రయాణికులు, వాహన డ్రైవర్లు సహకరించాలని కోరారు.

కారు ప్రమాదంలో వైద్య విద్యార్థి మృతి

ఒంగోలు కార్పొరేషన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా కోవూరు మండలం పోతిరెడ్డిపాలెంలో జరిగిన కారు ప్రమాదంలో ఒంగోలుకు చెందిన గుర్రం యగ్నేష్(20) మృతిచెందడంలో వారి కుటుంబం శోకసముద్రంలో మునిగిపోయింది. స్థానిక రామనగర్ 3వ లైను 6వ క్రాస్ రోడ్‌లో నివాసం ఉండే గుర్రం గురువీర్ జిల్లాలోని తూర్పుగంగవరం, అనంతపురంలో పాల వ్యాపారం చేస్తుండగా, తల్లి గృహిణిగా ఉన్నారు. యగ్నేష్ నెల్లూరులోని నారాయణ కాలేజీలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కాగా తనతోపాటు చదువుకునే స్నేహితుడు చక్రధర్ సోదరి నిశ్చయ కార్యక్రమానికి హాజరై వస్తూ ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదానికి గురికావడంతో యగ్నేష్ మృతిచెందాడు.

ఈకేవైసీకి గడువు మరో 2 నెలలు పెంపు

ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రేషన్‌లబ్ధిదారులకు ఈకేవైసీ చేయించుకునేందుకు మరో రెండు నెలలు గడువు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రేషన్‌కార్డుల పరిధిలో ఉన్న లబ్ధిదారులందరూ ఈకేవైసీని చేయించుకునేందుకు మార్చి 15 నుంచి అవకాశం కల్పించింది.మార్చి ఆఖరుకు ప్రక్రియ పూర్తికాకపోవడంతో ఏప్రిల్ 30 వరకు గడువు పొడిగించారు. ప్రస్తుతం జిల్లాలో ఇంకా 1.22 లక్షల మంది లబ్ధిదారులు ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉంది. జూన్ 30 వరకు పెండింగ్‌లో ఉన్న లబ్ధిదారులందరూ చేయించుకోనే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జూన్ 30లోపు ఈకేవైసీ చేయించుకోకపోతే ఇక గడువు పెంచేది లేదని ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేసినట్లు సమాచారం.

అవీ..ఇవీ..

కేజీబీవీలో నూతన వసతిగృహానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న టీడీపీ మండల అధ్యక్షులు వీరయ్య

చినగంజాం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి) : స్థానిక కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయ ప్రాంగణంలో రూ.1.55 కోట్లతో నూతనంగా నిర్మించే హాస్టల్ భవనానికి బుధవారం టీడీపీ మండల అధ్యక్షులు పొద వీరయ్య భూమి పూజ నిర్వహించారు. కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో ఇంటర్మీడియట్ చదువుతున్న బాలికల వసతి నిమిత్తం నూతన భవనాన్ని నిర్మిస్తున్నట్లు బాపట్ల సమగ్ర శిక్ష ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కేవీ.నాగజ్యోతి తెలిపారు. సమగ్ర శిక్ష నిధులు రూ.1.55 కోట్లతో గ్రౌండ్ ఫ్లోర్‌లో మూడు గదులు, మరుగుదొడ్లు, మొదటి అంతస్తులో మూడు గదులు, మరుగుదొడ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. నూతన వసతిగృహాన్ని నాణ్యత ప్రమాణాలతో తొమ్మిది నెలల లోపు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాయని ఆత్మారావు, ఉపసర్పంచ్ చెరుకూరి రాఘవయ్య, కేజీబీవీ ప్రిన్సిపాల్ ఎం.సుమాంజలి, సమగ్రశిక్ష ఏ.ఈ. వెంకటేశ్వర్లు, కాంట్రాక్టర్ సుబ్బారావులు పాల్గొన్నారు.

9న మండల సర్వసభ్య సమావేశం

యద్దనపూడి,(మార్టూరు)ఏప్రిల్30(ఆంధ్రజ్యోతి):యద్దనపూడి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 9 న శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో లక్ష్మీనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు అందరూ హాజరుకావాలని ఆయన తన ప్రకటనలో కోరారు.

వృద్ధులకు పాదరక్షలు పంపిణీ

మార్టూరు,ఏప్రిల్30(ఆంధ్రజ్యోతి): మార్టూరులోని అమ్మ ఆశ్రమంలో ఇన్నర్ వీల్ క్లబ్ మాజీ అధ్యక్షురాలు కుక్కపల్లి మాదవిలత తన భర్త కుక్కపల్లి గోపి 13వ వర్ధంతి సందర్భంగా బుధవారం వృద్ధులకు,పేదలకు అన్నదానం చేసి పండ్లు,పాదరక్షలను పంపిణీచేశారు. కార్యక్రమంలో జాష్టి అనూరాధ, నిర్మలాదేవి, అమ్మ ఆశ్రమం అధ్యక్షులు గుంటుపల్లి చందు పాల్గొన్నారు.

గొడుగులు, చెప్పులు పంపిణీ



గొడుగులు అందజేస్తున్న రోటరీక్లబ్ ప్రతినిధులు

పర్చూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు బొమ్మల కూడలిలో రోటరీక్లబ్ ఆఫ్ పర్చూరు సెంట్రల్ సారధ్యంలో దాతల సహకారంతో చిరువ్యాపారులకు, ప్రయాణికులకు చెప్పులు గొడుగులు పంపిణీ చేశారు. క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మజ్జిగ, మంచినీటి చలివేంద్రం వద్ద పంచాయతీ కార్యదర్శి మస్తారావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. వేసవి దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన ఉచిత మజ్జిగ, మంచినీటి చలివేంద్రాలకు దాతలు అందిస్తున్న సహకారం వెలకట్టలేనిదన్నారు. పలువురు రోటరీ ప్రతినిధులు కొనియాడారు. కార్యక్రమంలో గడ్డిపాటి శ్రీనివాసరావు, కోటా శ్రీనివాసరావు, నాగబైరు శ్రీనివాసరావు, పంబి సదానందరెడ్డి, కసా అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న టీడీపీ శ్రేణులు

పోతినవారిపాలెం(పర్చూరు), ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : కారంచేడు మండల పరిధిలోని పోతినవారిపాలెంలో మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు విగ్రహ నిర్మాణానికి బుధవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు సీనియర్ పార్టీ నేతలు మాట్లాడుతూ తెలుగుజాతి గొప్పతనాన్ని దేశవ్యాప్తంగా చాటిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్ అని కొనియాడారు. కార్యక్రమంలో తెలుగుదేశం మండలపార్టీ అధ్యక్షులు తిరుములశెట్టి శ్రీహరి, సర్పంచ్ పోతిన శ్రీనివాసరావు, మాజీ మండల కోఆప్షన్ సభ్యుడు షేక్.ఖాశీం, కొల్లా నాగబాబు, గోరంట్ల రమాదేవి, కొసరాజు సురేంద్ర, పోతిన మస్తాన్‌రావు, నార్నె మధు, హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

పలువురికి మంత్రి పరామర్శ

అద్దంకి, ఏప్రిల్30 (ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలోని పలు కుటుంబాలను మంత్రి గొట్టిపాటి రవికుమార్ బుధవారం పరామర్శించారు. 9వ వార్డులోని ఘట్టమనేని కోటయ్య ఇటీవల మృతి చెందగా, దశదినకర్మ కు రవికుమార్ హజరయ్యారు. ఆర్‌ఎంపీ వైద్యులు చెన్నుపల్లి శ్రీనివాసరావు ఇటీవల గుండెసమస్యతో మృతిచెందగా కుటుంబసభ్యులను పరామర్శించారు. అనారోగ్యంతో మృతి చెందిన కంచర్ల వాసు కుటుంబసభ్యులను మం త్రి పరామర్శించారు. స్థానిక టీడీపీ నేతలు ఉన్నారు.

మొక్కుబడిగా మున్సిపల్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ

అద్దంకి, ఏప్రిల్30(ఆంధ్రజ్యోతి): అద్దంకి మున్సిపల్ సమావేశం బుధవారం చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ అధ్యక్షతన కౌన్సిల్‌హాల్‌లో మొక్కుబడిగా నిర్వహించారు. ముందుగా జమ్మూకాశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిలో యాత్రికుల మృతికి సంతాపంగా మౌనం పాటించారు. అనంతరం అజెండాలోని 26 అంశాలను చదవగా ఆమోదించినట్లు చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ ప్రకటించారు. టీడీపీ, వైసీపీ కౌన్సెలర్లు కూడా మొక్కుబడిగా హాజరయ్యారు. మున్సిపల్ కమిషనర్ రవీంద్ర మంత్రి రవికుమార్ పర్యటనలో ఉండగా మేనేజర్ శ్రీదేవి, ఏఈ లోకేష్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

ఎండమావిగా అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు

- అగ్నిప్రమాదం జరిగితే సర్వం కోల్పోవాల్సిందే
- వేసవి వస్తే భయం గుప్పెట్లో ప్రజలు

పర్చూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : వేసవి కాలం వస్తుందంటే పర్చూరు నియోజకవర్గ ప్రజలను అగ్నిప్రమాదాలు కలవర పెడుతున్నాయి. పాలకులు మారుతున్నా, ప్రభుత్వాలు మారుతున్నా నియోజకవర్గ కేంద్రంలో అగ్నిమాపకకేంద్రం ఏర్పాటు కలగానే మిగిలింది. ఏదైనా అగ్నిప్రమాదం జరిగినప్పుడు చీరాల, బాపట్ల, చిలకలూరిపేటల నుంచి అగ్నిమాపక శకటాలు వస్తేనే మంటలను ఆర్పే పరిస్థితి ఉంది. అగ్ని ప్రమాదం సంభవించి ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చి వారు ఘటనా స్థలానికి చేరుకేనే సరికి మంటలు పూర్తిగా వ్యాపించి, నష్టజరగడం సర్వసాధారణంగా మారింది. నియోజకవర్గ కేంద్రంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని మూడు దశాబ్ధాలగా ప్రజలు కోరుతున్నా, నేటికీ ఫలితం లేకుండా పోయింది. స్థానికంగా అగ్నిమాపక కేంద్రం అందుబాటులో ఉంటే ప్రమాదం జరిగిన నిమిషాల వ్యవధిలోనే ఘటన స్థలానికి చేరుకునే అవకాశం ఉంది. తద్వారా ప్రమాద స్థాయిని తగ్గించుకునే అవకాశం ఉంటుంది. పర్చూరు నియోజకవర్గంలో ఎక్కువమంది వ్యవసాయంపై ఆదారపడి జీవనం సాగిస్తారు. అగ్నిప్రమాదాలు సంభవించి మొక్కజొన్న, పత్తి, గడ్డి, వైట్‌బర్లీ పొగాకు వంటి పంటలు పూర్తిగా దగ్ధమై రైతులను తీవ్రంగా నష్టపోయిన ఘటనలు అనేకం ఉన్నాయి. అదేవిధంగా పలుచోట్ల ఇళ్లు అగ్నిప్రమాదంలో కాలిపోయి బాధితులు సర్వంకోల్పోయి కట్టుబట్టలతో మిగిలిన ఘటనలు కూడా ఉన్నాయి. వీటిని దృష్టిలో ఉంచుకొని ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పర్చూరు నియోజకవర్గ కేంద్రంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేసి ప్రజల ఆస్తులు అగ్నికి ఆహుతి కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. ఆ దిశగా అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- ఇటీవల పర్చూరులోని రామాలయం వీధిలో విద్యుత్ షార్టుసర్క్యూట్‌తో అగ్నిప్రమాదం చోటుచేసుకొంది. దీంతో ఇద్దరు మహిళలు అక్కడికక్కడే మృతి చెందగా, మరో మహిళ గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందింది. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు చీరాల అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకునే సమయానికే ఇళ్లు పూర్తిగా కాలిపోయి మహిళలు మృతి చెందారు.
- కారంచేడు మండలం ఆదిపూడి గ్రామంలో ఫిబ్రవరి 12న అగ్ని ప్రమాదం జరిగి పూరిల్లు దగ్ధమైన సంఘటలో ఇంటిలో ఉన్న బంగారు అభరణాలతో పాటు, రూ.50వేల నగదు కూడా పూర్తిగా దగ్ధమై బాదితులు కట్టుబట్టలతో నిరాశరులయ్యారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించి ఘటనా స్థలానికి చేరుకునే లోపే ఇళ్లు పూర్తిగా మంటలో కాలిబూడిదైంది.
- జరుబులవారిపాలెం గ్రామంలో ఇటీవల అగ్ని ప్రమాదం చోటుచేసుకుని ఇల్లుపూర్తిగా మంటల్లో కాలి పోయింది. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందిం చినా సకాలంలో స్పందించకపోవటంతో బాదితులు పూర్తిగా నష్టపోవాల్సి వచ్చింది. ఇలాంటి సంఘటనలు పర్చూరు నియోజకవర్గంలో అనేకం చోటుచేసు కుంటున్నాయి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అగ్రి ప్రమాదం చోటుచేసుకున్నప్పుడు అందుబాటులో ఉండే విధంగా నియోజవకర్గ కేంద్రమైన పర్చూరులో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



ఆదిపూడిలో కాలిపోతున్న పూరిల్లు (ఫైల్)

మంచినీటి పైపులకు మరమ్మతులు



వంతెన కింద మంచినీటి పైపులు వేస్తున్న పంచాయతీ సిబ్బంది

మార్టూరు, ఏప్రిల్30 (ఆంధ్రజ్యోతి): దాదాపుగా 20 ఏళ్ల క్రితం గ్రామ పంచాయతీలో మంచినీటి పైపులైన్లును వేయడంతో చాలాచోట్ల పైపులు తుప్పుపట్టి శిథిలమయ్యాయి. దీంతో మంచినీటి సరఫరాకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ముఖ్యంగా మండల కాంప్లెక్స్ వద్ద ఎదురుగా జాతీయరహదారిపై ఉన్న వంతెన కింద మంచినీటి పైపులు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. మంచినీటి చెరువు నుంచి గ్రామంలోకి తాగునీటిని పంపిణీ చేసేందుకు ఫిల్టర్ బెడ్ల నుంచి మండల కాంప్లెక్స్ వద్ద ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంక్ కు నీటిని ఎక్కించేందుకు పైపులైన్ వేశారు. అయితే ప్రస్తుతం ఈ పైపులైన్ పూర్తిగా మరమ్మతులకు గురికావడంతో పలుమార్లు మరమ్మతులు చేసినప్పటికీ, తరచుగా నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. ఫిల్టర్‌బెడ్ల నుంచి ఓవర్‌హెడ్ ట్యాంక్‌కు నీటిని ఎక్కించడానికి చాలా ఎక్కువ సమయం పడుతున్నది. దీంతో గ్రామ పంచాయతీ 15వ ఆర్థిక సంఘం నిదులను వినియోగించి, పాతపైపులను తొలగించి కొత్తగా పైపులైను వేస్తున్నారు. దాదాపుగా 600 అడుగులు దూరం సుమారు 8 లక్షల వ్యయంతో కొత్తగా పైపులైను వేస్తున్నారు. తద్వారా ఓవర్‌హెడ్ ట్యాంకుకు త్వరితంగా నీటిని సరఫరా చేస్తే అక్కడనుండి గ్రామంలోకి తాగునీటిని సరఫరా చేయడం సులభతరమవుతుంది. గ్రామంలో చాలాచోట్ల మంచినీటి పైపులు మరమ్మత్తులకు గురవుతున్నప్పటికీ, ప్రస్తుతం వంతెన కింద పాతపైపులను తొలగించి కొత్తగా పైపులు వేస్తున్నట్లు పంచాయతీ ఈవో తస్నీరు శ్రీనివాసరావు తెలిపారు.

డ్రైవర్ నిద్రమత్తుతో లారీ బోల్తా

తప్పిన ప్రమాదం



బోల్తాపడిన లారీ

కావూరివారిపాలెం(చీరాల), ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : నిద్రమత్తులో డ్రైవర్ వాహనాన్ని నడపడంతో బోల్తా పడింది. అందిన వివరాల ప్రకారం మండల పరిధిలోని కావూరివారిపాలెంలోని ఓ కంపెనీ నుంచి మంగళవారం రాత్రి వాడరేవులో ఐస్‌ను తెచ్చేందుకు వెళుతున్న ఖాళీ లారీ మార్గ మధ్యలోని సిమెంట్ కాలువ సమీపంలో అదుపు తప్పి బోల్తా పడింది. అయితే ఆ సమయంలో అదృష్ట వశాత్తు ఎటువంటి వాహనాలు రాకపోకలు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. అలాగే డ్రైవర్‌కు కూడా ఎటువంటి ప్రమాదం జరుగలేదు. అయితే సుమారు రెండు గంటల పాటు శ్రమించి వాహనాన్ని అదుపులోకి తెచ్చారు. గతంలో ఇదే ప్రాంతంలో ఓ ద్విచక్ర వాహనం అదుపుతప్పి గ్రామానికి చెందిన ద్విచక్ర వాహనదారుడు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు.

రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు



ఉప్పలపాడు-మైలవరం మధ్య చిల్లచెట్లతో మూసుకు పోయిన రహదారి

అద్దంకి,ఏప్రిల్30(ఆంధ్రజ్యోతి): అద్దంకి నియోజకవర్గంలో రెండు రోడ్ల నిర్మాణం కోసం రూ.9.85 కోట్లు మంజూరైనట్లు విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. అద్దంకి మండలం శాంతినగర్ నుండి వెంపరాల, ఉప్పలపాడు, మైలవరం మీదుగా ఏలేశ్వరవారిపాలెం వరకు 9.34 కి.మీ తారు రోడ్డు పునర్నిర్మాణానికి రూ.5.10 కోట్లు, బల్లికురవ మండలం కొప్పెరపాడు నుండి కొత్తూరు, వెలమవారిపాలెం మీదుగా జమ్మలమడక వరకు 9.83 కి.మీ తారు రోడ్డు పునర్నిర్మాణానికి రూ.4.75 కోట్ల రూపాయలు పంచాయతీరాజ్‌శాఖ నుండి నిధులు విడుదల చేస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చినట్లు తెలిపారు. రెండు దశాబ్దాల క్రితం గొట్టిపాటి రవికుమార్ మార్టూరు ఎమ్మెల్యేగా తొలిసారి గెలిచినప్పుడు ఈ రెండు రోడ్లను నిర్మించారు. మరోసారి ఇంతవరకు కనీసం మరమ్మతులు కూడా చేపట్టకపోవటంతో పూర్తిగా దెబ్బతిని రాకపోకలకు ఇబ్బందిగా మారింది. రెండు దశాబ్దాల తరువాత మం త్రి రవికుమార్ రెండు రోడ్ల పునర్నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయించారు. దీంతో ఆయా గ్రామాలకు రవాణా వసతి మెరుగు పడనుంది.





వేణుగోపాలస్వామి దేవాలయ భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్థులు, హోమం నిర్వహిస్తున్న రుత్వికులు

వేణుగోపాల స్వామి దేవాలయ పునర్నిర్మాణానికి భూమిపూజ

బల్లికురవ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామంలో జీర్ణావస్థలో ఉన్న వేణుగోపాల స్వామి దేవాలయ పునర్నిర్మాణానికి బుధవారం భూమిపూజ వైభవంగా నిర్వహించారు. గ్రామస్థుల సమష్టి కృషితో దేవాలయ నిర్మాణానికి ముందుకు వచ్చారు. భూమిపూజ కార్యక్రమంలో భాగంగా గ్రామస్థులు ప్రత్యేక పూజలలో పాల్గొని హోమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఈవో వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అమరావతి పునర్నిర్మాణంలో భాగస్వాములవుదాం

రాష్ట్ర వన్యకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ సీ.ఆర్.రాజన్



మాట్లాడుతున్న రాజన్

చినగంజాం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి) : అమరావతి పునర్నిర్మాణ సభను విజయవంతం చేయాలని రాష్ట్ర వన్యకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్, పర్చూరు నియోజకవర్గ పరిశీలకులు సీ.ఆర్.రాజన్ పిలుపునిచ్చారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రధాని నరేంద్రమోదీ పర్యటన విజయవంతం చేసేందుకు బుధవారం మండల పరిధిలోని టీడీపీ నాయకులతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం మూడు రాజధానుల మసుగులో ఆంధ్రుల రాజధాని అమరావతిని నిర్లక్ష్యం చేసిందన్నారు. ప్రతి ఇంటి నుండి ప్రధాని సభకు తరలి రావాలని అన్నారు. చినగంజాం మండలం నుండి 13 బస్సులు, కార్లను సభకు వినియోగిస్తున్నట్లు మండల టీడీపీ అధ్యక్షులు పొద వీరయ్య తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఏ.శ్రీనివాసమూర్తి, ఏపీఎం జి.పెదసుబ్బారావు, మండల పరిధిలోని టీడీపీ నాయకులు, పాల్గొన్నారు.

యద్దన పూడి,(మార్టూరు): రాష్ట్రానికి శుక్రవారం విచ్చేయుచున్న ప్రధాన మంత్రి మోదీ సభకు భారీగా ప్రజానీకం తరలిరావాలంటూ బుధవారం యద్దనపూడి ఎంపీడీవో కార్యాలయం వద్ద తెలుగుదేశం పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. అమరావతి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నల్లపనేని రంగయ్యచౌదరి,గుదే తారకరామారావు, సాదినేని సుదీర్,కొరటాల వంశీ కృష్ణ,కనపర్తి నాగేశ్వరరావు,కోయ సతీష్,రావిపాటి సీతయ్య గొట్టిపాటి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బల్లికురవ: రాష్ట్ర రాజధాని అమరావతిలో రేపు ప్రధాని పర్యటనకు అన్ని గ్రామాల నుంచి ప్రజలు హాజరై విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి దేవదత్తు కోరారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ బల్లికురవ మండలంలో 13 బస్సులను ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు ఉదయం 8 గంటలకు బయలుదేరాలన్నారు. అన్ని గ్రామాలలో అధికారులు ప్రజలకు తెలియజేయాలని పెద్దఎత్తున ప్రజలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఎంపీడీవో కుసుమకుమారి, ఈవోపీఆర్‌డీ సుమతి తదితరులు పాల్గొన్నారు.

మేడేను అంబేడ్కర్ మేడేగా నిర్వహించాలి

చినగంజాం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి) : మేడేను కార్మికులు అంబేడ్కర్ మేడేగా నిర్వహించి ఆయనకు నివాళులు అర్పించాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షులు మేడికొండ సునీల్ బుధవారం ఒక ప్రకటనలో కార్మికులను కోరారు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ బ్రిటీష్ ప్రభుత్వంలో 1942-46 మధ్య లేబర్ కమిషనర్‌గా పనిచేసి, కార్మికుల కోసం ఆయన అనేక చట్టాలు పోరాడి సాధించారన్నారు. సోషలిజం అని కలలుగనే కమ్యూనిస్టులు మార్క్స్, మావో లెనిన్ గురించి మాట్లాడతారానీ, కార్మికుల కోసం అంబేడ్కర్ చేసిన చట్టాల గురించి ఎక్కడా మాట్లాడరని అన్నారు. సమ్మె కార్మికుల ప్రాథమిక హక్కు అని 1937లో పోరాడిన అంబేడ్కర్‌ని విప్లవ కమ్యూనిస్ట్ పార్టీలు కూడా విస్మరించడం చారిత్రాత్మక ద్రోహం అని అన్నారు. 1942వ సంవత్సరం వరకు ఉన్న 14 గంటల పనిదినాన్ని 8గంటలకు తగ్గించిన ఘనత అంబేడ్కర్‌దేనని అన్నారు. 1923వ సంవత్సరంలో వర్క్‌మెన్ కాంపెన్సేషన్ చట్టం, 1936లో పేమెంట్ ఆఫ్ వేజెస్ చట్టం, 1943లో ఆరోగ్య బీమాచట్టం, 1944లో సెలవులలోను జీతం చెల్లించే చట్టం, 1948లో కనీస వేతన చట్టాలను అంబేడ్కర్ ఆనాటి బ్రిటిష్ పాలకులతో పోరాడి సాధించారన్నారు. ఎక్కడో అమెరికాలో జరిగిన కార్మిక పోరాట నేపథ్యంలో ప్రపంచ కార్మిక దినోత్సవం జరిపే కమ్యూనిస్టులు, ట్రేడ్ యూనియన్లు చైనా, రష్యా దేశాల విప్లవాల గురించి చెబుతారన్నారు. అయితే అంబేడ్కర్ కార్మికుల కోసం పోరాడి తెచ్చిన చట్టాల గురించి చెప్పరన్నారు. ఆనాడు అంబేడ్కర్ పోరాడి సాధించిన చట్టాలే ఈనాడు భారతీయ కార్మికవర్గ సమాజానికి పునాదిరాళ్లుగా నిలిచాయన్నారు. అంబేడ్కర్ కార్మిక, కర్షక, దళిత, గిరిజన, బహుజన, మైనార్టీలకు భారత రాజ్యాంగం ద్వారా హక్కులు కల్పించి వారికి రక్షణ కల్పించిన గొప్ప దార్శనీకుడుని కొనియాడారు. కార్మికుల కోసం అంబేడ్కర్ రాజ్యాంగం ద్వారా అందించిన చట్టాలను అనుభవిస్తున్న కార్మిక సమాజం మేడేని అంబేడ్కర్ మేడేగా జరుపుకోవాలని సునీల్ డిమాండ్ చేశారు.

ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలు

- లారీ ఢీకొని పక్కకు ఒరగడంతో బెంబెలెత్తిన ప్రజలు



లారీ ఢీకొట్టడంతో ఒరిగిన విద్యుత్‌స్తంభం

బల్లికురవ. ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : బల్లికురవ మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల జంక్షన్‌లో మలుపుల వద్ద రోడ్డుపై విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయి. బుధవారం మార్టురు వైపు నుంచి అద్దంకి వైపు వచ్చే సిమెంట్ లోడ్ లారీ మలుపులో విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో విద్యుత్‌స్తంభం కొంత మేర నేలవాలింది. దీంతో ప్రక్కనే ఉన్న ప్రజలు భయాందోళనతో పరుగులు పెట్టారు. స్తంభం పూర్తిగా పడిపోయి ఉంటే పెను ప్రమాదం జరిగి ఉండేదని స్థానికులు తెలిపారు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంగా కారణంగానే ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను మార్చటం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాలుగు రోడ్ల కూడలీలో రోడ్డు మలుపులలో ఉన్న స్తంభాలను తొలగించాలని ఎన్నిమార్లు అధికార్లకు తెలిపిన ఎవరు పట్టించుకోవడం లేదన్నారు. ప్రమాదం జరిగి ప్రాణ నష్టం జరగక ముందే అదికారలు స్తంభాలను తొలగించే పనులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

మావోయిస్టులతో శాంతిచర్చలు నిర్వహించాలి

- ప్రజాసంఘాల నాయకుల డిమాండ్



ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నేతలు, కార్యకర్తలు

చీరాల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం - మావోయిస్టుపార్టీ కాల్పులు విరమించి శాంతి చర్చలు నిర్వహించాలని పలువురు ప్రజాసంఘాల నేతలు, కార్యకర్తలు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో శాంతిర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఆదివాసీలపై దారుణకాండను కొనసాగించడం అన్యాయమన్నారు. దేశపౌరులు ఉన్నత పదువులతో కూడిన బాద్యతలు కల్పిస్తే ప్రకృతి వనరులు రక్షించకుండా, విదేశీ బహుళ జాతి సంస్థలకు దోచి పెడుతున్నట్లు ఆరోపించారు. వెంటనే శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర చేనేత జనసమాఖ్య వ్యవస్థాపకులు మాచర్ల మోహనరావు, ఎరుకుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు మోహన్‌కుమార్‌ధర్మ, శీలం రవి, గోసాల అశోక్, తదితర ఆదివాసీ మహిళలు పాల్గొన్నారు.

పన్ను వసూలులలో అద్దంకి తొలిస్థానం

- 5 శాతం రాయితీని అందిపుచ్చుకుంటున్న పట్టణ ప్రజలు



పన్ను చెల్లించేందుకు క్యూలో ఉన్న ప్రజలు

అద్దంకి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలో అడ్వాన్స్ ఇంటి పన్ను వసూలులో అద్దంకి మున్సిపాలిటీ రాష్ట్రంలో ప్రథమస్థానంలో నిలిచింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 5 శాతం రాయితీతో చెల్లింపునకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. దీంతో అద్దంకి మున్సిపాలిటీ పరిధిలో రూ.5.27 కోట్లు పన్ను వసూలు లక్ష్యం కాగా బుధవారం రా త్రి కి సుమారు రూ.2.27 కోట్లు వసూలు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ రవీంద్ర తెలిపారు. బుధవారం ఒక్కరోజే రూ.20.91 లక్షలు వసూలు చేసినట్లు తెలిపారు. 43 మున్సిపాలిటీల పరిధిలో అద్దంకి మున్సిపాలిటీ రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిందని తెలిపారు. ముందస్తుగా ఇంటి పన్నులు చెల్లించిన యజమానులకు మున్సిపల్ కమిషనర్ రవీంద్ర కృతజ్ఞతలు తెలిపారు. పన్ను వసూలుకు కృషిచేసిన సిబ్బందిని అభినందించారు.